

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



ఆదివారం | 11 ఫిబ్రవరి 2018 | విజయవాడ | సంపుటి 11 | సంచిక 107 | పేజీలు 12+12+16 | వెల: రూ. 6.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్ష తిథి : ఏకాదశి సా.6.15, మూల రా.11.54, వర్జ్యం లేదు
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.49 గం; సూర్యాస్తమయం: సా. 6.12 గం.

పాలస్తీనాతో ఆరు ఒప్పందాలు

- అధ్యక్షుడు అబ్బాస్‌తో ప్రధాని మోడీ చర్చలు
- 50 మిలియన్ డాలర్లు విలువ చేసే ఒప్పందాలు
- మోడీకి అరుదైన సత్కారం
- పాలస్తీనా పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధాని మోడీ
- అత్యున్నత గౌరవ పురస్కారం ప్రదానం
- 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా'గా మోడీకి సన్మానం



రమల్లా : పాలస్తీనా గడ్డపై అడుగుపెట్టిన తొలి భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఘన స్వాగతం లభించింది. ఇజ్రాయెల్ హెలికాప్టర్లు, రాయల్ జోర్డాన్ హెలికాప్టర్లు వెంట రాగా ప్రధాని మోడీ శనివారం పాలస్తీనా రాజధాని రమల్లా చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ అక్కడి అధ్యక్ష నివాసంలో ఘనంగా స్వాగతం పలికారు. పాలస్తీనా దేశం తరఫున ఇచ్చే అత్యంత గౌరవాత్మకంగా ఇచ్చే ప్రశంసా పత్రంతో సత్కరించారు. భారత్, పాలస్తీనా మధ్య సత్సంబంధాలను పెంచడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను అబ్బాస్ మోడీని 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా' పేరుతో ఘనంగా సన్మానించారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న అనంతరం ఆయన మోడీకి గ్రాండ్ కాలర్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను అభివృద్ధి చేసేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం ఆయనకు దక్కింది. తెలివైన నాయకత్వ

మిగతా 3లో

విభజన హామీలపై సానుకూలమే

వీలైనంత త్వరలో ఆదేశాలు జారీ చేస్తాం



- విభజన హామీలపై టీడీపీ కేంద్రంపై ఒత్తిడి
- స్పందించిన కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ
- అరుణ్‌జైట్లీతో సుజనా చౌదరి, సీఎం రమేష్ భేటీ
- రెవెన్యూ లోటు, రైల్వే జోన్‌పై చర్చ
- పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం : అరుణ్‌జైట్లీ


న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై టీడీపీ కేంద్రంపై ఒత్తిడి కొనసాగిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో కేంద్రమంత్రి సుజనా చౌదరి, ఎంపీ సీఎం రమేష్ భేటీ అయ్యారు. రెవెన్యూ లోటు, రైల్వే జోన్, ఏపీ ప్రాజెక్టులపై చర్చించారు. ఏపీకి నిధుల విడుదలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అరుణ్‌జైట్లీ సానుకూలంగా స్పందించారు. సోమవారం ఆయాశాఖల కార్యదర్శులతో సమావేశమై హామీల అమలుకు కృషిచేస్తానని అరుణ్‌జైట్లీ టీడీపీ నేతలకు హామీ ఇచ్చారు. శుక్రవారం రాజ్యసభలో అరుణ్‌జైట్లీ విభజన హామీలపై సమాధానమిస్తూ ఏపీకి న్యాయం చేస్తామని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను నెరవేర్చుతామని చెప్పిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ జరుగుతున్న సమయంలో హామీల గురించి చెప్పటం కష్టమని, వీటిపై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని, రెవెన్యూ లోటు భర్తీతో పాటు, రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ.. మిగతా అంశాలపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని, వీలైనంత త్వరలో ఏపీకి సంబంధించిన హామీలపై ఓ కవర్ అందజేస్తామని రాజ్యసభలో చెప్పడానికి

మిగతా 3లో

మోడీకి ముందు చూపు లేదు

- మాయదారి కలలు, ఉత్తుత్తి వాగ్దానాలు
- బళ్లారి బహిరంగ సభలో రాహుల్
- పర్యటనలో భాగంగా పలు దేవాలయాల సందర్శన
- మోడీపై ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం

3లో



సైనిక కుటుంబాలపై ఉగ్ర దాడి

- ఇద్దరు జెసిఒలు మృతి
- మరో 9 మందికి తీవ్ర గాయాలు
- ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైన్యం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్ర దిగ్భ్రాంతి

3లో



తప్పుడు లెక్కలు చెబితే ఊరుకోవద్దు

ఢిల్లీలో పరిణామాలపై సునిశిత పరిశీలన

- మరోమారు ప్రకటన వచ్చే వరకు వేచి చూద్దాం
- కేంద్రమంత్రి సుజనాచౌదరి, సీఎం రమేష్‌తో చంద్రబాబు సంభాషణ
- ముఖ్య నేతలతో తాజా పరిణామాలపై సమీక్ష
- విభజన హామీలపై స్పష్టత ఇచ్చేంతవరకూ వేచిచూడండి : సిఎం చంద్రబాబు

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర విభజన హామీలపై ఢిల్లీలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు సమీక్షించారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఢిల్లీలో కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీలు సీఎం రమేష్ తదితర ముఖ్యనేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అటు తన నివాసంలోనూ ముఖ్యమైన నేతలు, అధికారులతో కూడా తాజా పరిణామాలపై సమీక్ష నిర్వహించారు. విభజన హామీలపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇచ్చేంతవరకూ వేచిచూసే ధోరణి అవలంబించాలని పార్టీ నేతలకు చంద్రబాబు స్పష్టంచేశారు. బీజేపీ నేతలు ఎవరైనా విభజన హామీలకు సంబంధించి తప్పుడు

మిగతా 3లో





సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం పచ్చజెండా?

- ఎంపీల ఆందోళనతో కేంద్రంలో కదలిక
- ప్రధాని ఆమోదం తరువాత స్పష్టమైన ప్రకటన
- లోటు భర్తీకి కేంద్రం సుముఖత

3లో



అంతా ఇంతే!



అధికారంలోకి రాకపోతే డు ఆర్ డై కదా..

హోదా కోసమే నా ఊపిరి

- కావలి నియోజవర్గం బోడగుడిపాడులో బహిరంగ సభ
- హోదాపై చంద్రబాబు మొసలి కన్నీరు
- డబ్బు దాచుకునేందుకే విదేశీ పర్యటనలు
- ప్రత్యేక హోదాను ఢిల్లీలో తాకట్టు పెట్టారు
- నిరుద్యోగులకు జాబు రావాలంటే బాబు పోవాలి : వైఎస్ జగన్



(కావలి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : విశ్వసనీయత, నిజాయితీ లేకపోతే రాజకీయ నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిలా తయారవుతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు మొసలి కన్నీళ్లు కారుస్తూ హోదాపై పోరును నీరుగార్చారని వైఎస్ జగన్

మిగతా 3లో



పార్లమెంట్ సాక్షిగా చరిత్రను వక్రీకరించేందుకు మోడీ ప్రయత్నం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పార్లమెంటు సాక్షిగా చరిత్రను వక్రీకరించేందుకు ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని టీ- పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. దేశంకోసం సర్వం త్యాగం చేసిన గాంధీ, నెహ్రూ కుటుంబాలను విమర్శించడం దారుణమని మండిపడ్డారు. దేశం కోసం 12ఏళ్ల పాటు జైల్లో మగ్గిన చరిత్ర నెహ్రూదన్నారు. ఇవాళ తెలంగాణలో దేశంలో ఉన్న చెప్పుకోతగ్గ ప్రాజెక్టులన్నీ మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిర వాయాంలో పూర్తయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ సమావేశానికి ఉత్తమ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో అణిచివేత రాజకీయాలు నడుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ప్రొఫెషనల్స్ పాత్ర తప్పని సరిగా అవసరముందన్న ఆయన, రాబోయేది కాంగ్రె స్ పార్టీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు నీతి వంతమైన, ఉపయోగకరమైన పాలన కొనసాగించేందుకు మానిఫెస్టో తయారీలో ప్రొఫెషనల్స్ సహకరించాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలోపడిందన్న ఆయన, మోడీ ప్రభుత్వం హిందుత్వ ఎజెండాతో ముందుకు సాగుతోందని విమర్శించారు.ఇది సెక్యులర్ దేశానికి మంచిదికాదన్నారు. ప్రజల ఇష్టాలను బలవంతంగా అడ్డుకోవడం, .ఏం తినాలో, ఏం మాట్లాడాలి అన్నీ ప్రభుత్వాలే నిర్ణయించడం అమానుషమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ గా ఉంటూ ప్రజల హక్కుల ను కాపాడుతుందని చెప్పారు. శాసనసభ ప్రతిపక్షనేత జానారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమకాలం లో ప్రొఫెషనల్ వ్యక్తులు తమ జీవితాలను ఫణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారన్నారు.ప్రజలను చైతన్య పరచడంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. సామాజిక చైతన్యం కల్పించేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు మరోసారి ప్రొఫెషనల్స్ తప్పని సరిగా ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. సౌత్ ఇండియా కోఆర్డినేటర్ గీతారెడ్డి మాట్లాడుతూ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోడికి ముచ్చెమటలు పట్టించడంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధి తో పాటు ప్రొఫెషనల్ కాంగ్రెస్ పాత్ర అమోఘమన్నారు. తెలంగాణా ప్రొఫెషనల్ ప్రసిడెంట్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో ప్రొఫెషనల్స్ గా నెహ్రూ, సుభాష్, గాంధీ లాంటి నేతలు పాల్గొన్నారన్నారు. వాళ్ళు దేశ ప్రజలందరికి దిశానిర్దేశం చేస్తే, తెలంగాణా ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారు ప్రజలను చైతన్య పరిచారన్నారు.

కాలంతో పోటీ పడుతున్న కాళేశ్వరం

- తాగు,సాగునీటి పథకాలలో తెలంగాణ అగ్రగామి
- మిషన్ భగీరథ, కాళేశ్వరం ఇండియాకు మోడల్
- నిధుల వినియోగం తీరుపై సంతృప్తి
- కేంద్ర 15 వ ఆర్థిక కమిషన్ బృందం ప్రశంస



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు వెచ్చిస్తున్న తీరు పట్ల కేంద్ర ఫైనాన్స్ కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. కాళేశ్వరం పనుల వేగాన్ని చూసి 15వ ఆర్థిక సంఘం ఆశ్చర్యపోయింది. దేశ చరిత్రలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం ఒక నమూనా అవుతుందని ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా వ్యాఖ్యానించారు. ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పథకం, భారీ సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరం దేశంలోని అన్ని రాష్ట్రాలకు మోడల్ కానున్నట్టు 15వ ఫైనాన్సు కమిషన్ కార్యదర్శి అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు.

రైతులకు సాగునీరు, ప్రజలందరికీ సురక్షిత తాగునీరందించే ప్రభుత్వ సంకల్పం గొప్పదని ఆయన అన్నారు. కాళేశ్వరం పనులను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించిన బృందం సభ్యులు తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృఎద్ధి కార్యక్రమాలను 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి ఆరవింద్ మెహతా పరిశీలించారు. అతి తక్కువ వ్యవధిలో ఇంత అద్భుతంగా పనులు జరగటం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. మరో నాలుగు నెలల్లో 15వ ఆర్థిక సంఘం ప్రతినిధులందరమూ వస్తామని అరవింద్ మెహతా తెలిపారు. సిద్ధిపేట సమీపంలో నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 11వ ప్యాకేజీ రంగనాయకి సాగర్ పనులు, అన్నారం బ్యారేజీలను వాళ్లు సందర్శించారు. రంగనాయకి సాగర్ టన్నెల్ లో పనులు జరిగే తీరుపై అరవింద్ మెహతా సంతృప్తి వ్యక్తం చేశారు. సండ్లాపూర్‌లోని రంగనాయక సాగర్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, కాళేశ్వరం ప్రాజెక్టు మ్యాప్ ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జోషీ, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, దానికి అవసరమైన నిధులు, ఖర్చు వివరాలను అరవింద్ మెహతాకు తెలిపారు. రంగనాయక సాగర్ టన్నెల్, కాలువల నిర్మాణం, ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్న పనులపై 15 వ ఫైనాన్సు కమిషన్ కార్యదర్శి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి మంత్రి హరీష్ రావు కృషితో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రాజెక్ట్ ల నిర్మాణం జరుగుతున్నట్టు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జోషీ చెప్పారు.

ఈ ప్రాజెక్టును షెడ్యూలు ప్రకారం పూర్తి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని జోషి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారానే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధ్యమవుతుందని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి ఆరవింద్ మెహత అభిప్రాయపడ్డారు. కేంద్ర ఆర్థిక సంఘం ముఖ్య ఉద్దేశమూ సమగ్ర గ్రామీణ అభివృద్ధే అని ఆయన తెలియజేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నట్టు 15వ ఆర్థిక సంఘం వ్యాఖ్యానించింది.

స్ట్రక్చర్ల నిర్మాణాలు, ప్రణాళిక, పనులవేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని అన్నారు. రేయింబవళ్లు మూడు షిఫ్టులలో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని చూస్తే.. వచ్చే వానాకాలం నాటి కల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలు రాయి దాటుతుందనే విషయంలో తనకు సందేహం లేదని అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే, ప్రాజెక్ట్ వ్యయం పెరగదని అన్నారు.


తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక సవాలుగా తీసుకున్నట్టుగా తమ పరిశీలనలో అర్థమైందన్నారు. జాతీయ అభివృద్ధిలో కాళేశ్వరం నిస్సందేహంగా భాగస్వామి అవుతుందని అరవింద్ మెహతా వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం కాళేశ్వరంను నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళికా బద్ధంగా ఎలా పని చేస్తున్నదో... సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ఎలా సమీక్షిస్తున్నారన్న విషయాలను ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఎస్.కె. జోషి వివరించారు. రాష్ట్రాలలో నిధుల వినియోగంపై ఫైనాన్స్ కమిషన్ తనిఖీలో భాగంగా 15వ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి తెలంగాణలో పర్యటిస్తున్నట్టు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారం బ్యారేజి దగ్గర మీడియాకు తెలిపారు.

రాష్ట్రం అవతరించి మూడున్నరేండ్లే అయినా ఎంతో సాహసంతో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణ పనులను చూసి ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాన్ని అభినందించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను అత్యంత వేగంగా అమలు చేసేందుకే అప్పులు చేస్తున్నట్టు వివరించారు. మిగులు బడ్జెట్ తోనే తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టు రామకృష్ణారావు అన్నారు. అభివృఎద్ధి కార్యక్రమాల ద్వారా అందనున్న ఫలాలను బేరీజు వేసిన తర్వాతే నిధులను ఆచితూచి ఖర్చు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

అభివృద్ధి కార్యక్రమాలకోసం నిధుల సేకరణ, వాటిని ఖర్చు చేస్తున్న తీరు పట్ల ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి సంతృప్తిని వ్యక్తంచేసినట్టు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి వెంట తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ యస్.కె. జోషి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణ రావు, సిద్దిపేట జిల్లా కలెక్టర్ పి. వెంకట్రామారెడ్డి, జాయింట్ కలెక్టర్ పద్మాకర్,జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ అమేయ కుమార్, కాళేశ్వరం సీఈలు, చీఫ్ ఇంజనీర్ హరిరామ్, వెంకటేశ్వర్లు, ఎస్ఈ సుధాకరరెడ్డి, వేణు, ఈఈ ఆనంద్ ఉన్నారు.

చెల్లెలు కవితకు కృతజ్ఞతలు

ట్విట్టర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్



హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి : టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవితకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలంటూ పవన్ ట్విటర్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లోక్‌సభలో మద్దతు తెలిపిన తెరాస ఎంపీ, చెల్లెలు కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు అంటూ పవన్ ట్వీట్ చేశారు. విభజన హామీలు అమలు చేయాలంటూ గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన గళమెత్తిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీ కల్వకుంట్ల కవిత కూడా దీని గురించి లోక్‌సభలో మాట్లాడారు. ఆంధ్రాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్రాన్ని కోరారు. ఇదిలా ఉండగా హామీల విషయంపై కేంద్రం మళ్లీ పాతమాటే చెబుతుండటంతో ఆంధ్రా నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు ఉండవల్లితో పవన్ కల్యాణ్ భేటీ

హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ప్రత్యేక హోదా సాధనకై జనసేన అధినేత పవన్ కల్యాణ్ జేఏసీ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ జేఏసీ సభ్యులుగా కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ ఉంటారని స్వయంగా పవనే చెప్పారు. కాగా ఇప్పటికే జేపీతో సమావేశమైన పవన్ పలు విషయంగా నిశితంగా చర్చించారు. అనంతరం ఇద్దరూ కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాగా ఆదివారం మాజీ ఎంపీ ఉండవల్లితో పవన్ సమావేశం కానున్నారు. ఏపీ హక్కుల సాధన కోసం పవన్ ప్రతిపాదించిన జేఏసీపై ఉండవల్లి చర్చించనున్నారు. అయితే ఇప్పటికే పవన్ ప్రతిపాదనను జయప్రకాష్ నారాయణ సమర్థించారు. అయితే ఉండవల్లి ఎలా స్పందిస్తారో చూడాలి. జేపీతో సమావేశం అనంతరం జరిగే ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

ముస్లిం మైనారిటీలను మోసగించిన సీఎం కేసీఆర్

ప్రభుత్వ మాజీ విప్ జగ్గారెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లీం మైనార్టీలను మోసం చేశారని ప్రభుత్వ మాజీ విప్ జగ్గారెడ్డి విమర్శించారు. ప్రజా సమస్య లపై పల్లెబాటలో భాగంగా ఆయన ముస్లీం మైనార్టీలకు కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ జగ్గారెడ్డి సంగారెడ్డిలో ఒక్కరోజు దీక్షకు దిగారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌కు మాటలెక్కువ, పని తక్కువ అని ఎద్దేవా చేశారు. ముస్లీంలకు 12శాతం రిజర్వేషన్ వీలుకాదని తెలిసికూడా కేవలం ఓట్లకోసం వారిని కేసీఆర్ మోసం చేశారన్నారు. తనను ముఖ్యమంత్రి చేస్తే కేవలం నాలుగు నెలల్లోనే ముస్లీంలకు 12% రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి ఆయన మభ్యపెట్టారని ధ్వజమెత్తారు. నాలుగు నెలల్లో రిజర్వేషన్ అమలు చేస్తామన్న కేసీఆర్ నాలుగేళ్లయినా అమలు చేయట్లేదని జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. అంతా అయిపోయిన తర్వాత ఎన్నికల దగ్గరపడుతుండటంతో అసెంబ్లీ, పార్లమెంట్ అని ఏవేవో మాటలు చెప్పి డ్రామాలు ఆడుతున్నారని విరుచుకుపడ్డారు. గతంలో ముస్లింలకు ఐదుశాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న కాంగ్రెస్ నాలుగు శాతం ఇచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు అధికార దాహం లేదన్న ఆయన కేసీఆర్ సర్కార్ ఇప్పటివరకూ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు.

ప్రదీప్ ట్వీట్.. కేటీఆర్ స్పందన

- వెంటనే కలెక్టర్‌కు ఫోన్
- మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ప్రముఖ యాంకర్ ప్రదీప్ ఓ మంచి కార్యం తలపెట్టడానికి కారణమయ్యారు. మెడ్చెల్‌జిల్లా చర్లపల్లి పాఠశాలలో మరుగుదొడ్లు లేవని, దీని వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన మంత్రి కేటీ రామారావుకు సోషల్‌మీడియా వేదికగా తెలిపారు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ.. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, చర్యలు తీసుకోమని ఆదేశించారు. చర్లపల్లిలోని పాఠశాలను 40 ఏళ్ల క్రితం నిర్మించారు. అందులో మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. ఈ పాఠశాలలో 120 మంది అమ్మాయిలు, 100 మంది అబ్బాయిలు విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం పూర్తన తర్వాత విద్యార్థులు సరిపడ మంచి నీరు తాగడం లేదట. తాగితే పాఠశాల నుంచి దూరంగా వెళ్లి.. రావాల్సి వస్తుందని ఇలా చేస్తున్నారని ఓ ఎన్జీవో సంస్థ ట్వీట్ చేసింది. ఫొటోలను పంచుకుంది. దీన్ని చూసిన ప్రదీప్.. మా బృందం అక్కడికి వెళ్లి పరిశీలించింది. పిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి బాలికలు. కేటీఆర్ సాయం చేయండి అని ట్వీట్ చేశారు. దీనికి కేటీఆర్ బదులిచ్చారు. తగిన చర్యలు తీసుకోమని మేడ్చల్ కలెక్టర్‌కు సూచించారు. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. డీఈవో రోహిణి పాఠశాలను పరిశీలించారని, నెల రోజుల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవుతుందని ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు కేటీఆర్ ధన్యవాదాలు చెప్పారు. నిర్మాణం పూర్తన తర్వాత ఫొటోలు పోస్ట్ చేయమని కోరారు.

లోఫర్ పార్టీతో ఆనాడు పొత్తు ఎలా పెట్టుకున్నారు?: రావుల

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ని లోఫర్ పార్టీ అన్న మంత్రి కేటీఆర్ 2004లో పొత్తు ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, విభజన హామీలు ఏ మేరకు సాధించారని నిలదీశారు. అధికార పార్టీ వైఫల్యాలను నిలదీయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మండిపడ్డారు. దేశంలో అన్ని అనర్థాలకు మూల కారణం కాంగ్రెస్ పార్టీ అని రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు.

ప్రత్యామ్నాయం వైపే ప్రజల చూపు

- వ్యవసాయం సంక్షోభానికి కేంద్రమే కారణం
- మతోన్మాద శక్తులను అడ్డుకుని ముందుకు సాగాలి
- వామపక్షాల ఐక్యత చాలా అవసరం
- బలమైన ప్రజా ఉద్యమాలు రావాలి
- సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి



భీమవరం, సూర్య ప్రతినిధి : సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు పశ్చిమగోదావరి జిల్లా భీవమరంలో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కతిక కేంద్రంలో జరుగుతున్న ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆ పార్టీ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ మహాసభలకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా ప్రత్యామ్నయం వెవు చూస్తున్నారని, దీన్ని వామపక్ష పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మతోన్మాద శక్తులను అడ్డుకుని ముందుకు సాగాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయం సంక్షోభంలో పడటానికి కేంద్రమే కారణమన్నారు. అంతేగాక రైతు సంక్షేమానికి కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత బీజేపీదేనని ఏచూరి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పార్టీ కి అవకాశాలు పెరుగుతున్నాయని, ఈ రెండు రోజుల్లో ఈ దిశగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులు జోడించి చర్చలు జరుగుతాయని చెప్పారు. తీవ్రమైన ఆర్థిక విధానాలు, మతోన్మాద హింస, నిరంకుశ చర్యలు, రాజ్యాంగ సంస్థలపై దాడి, అమెరికా కు లొంగుబాటు, విదేశీ విధానంలో, రక్షణ రంగంలో, అంతర్గత భద్రతలో అమెరికా కు జూనియర్ భాగస్వామిగా భారత్ ఉందన్నారు. ఒక శాతం ధనవంతుల చేతిలో 73 సంపద ఉందని, 6. 99 శాతం ఈ జనాలకి 23 శాతం ఉందని, ఆర్థిక దోపిడి పెరిగిందన్నారు. బ్యాంకులో కోట్లు రుణాలు తీసుకొని కార్పొరేట్ పెద్దలు ఎగ్గొట్టారని, వాటిని బెయిల్ అవుట్ చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడంతో ప్రభుత్వం సంక్షోభంలో పడిందని, దీంతో సంక్షోభం మీద సంక్షోభం ఏర్పడుతుందన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ లోనే సంక్షోభం ఉందని, అందువల్ల దీనికి సోషలిజం ఒక్కటే ప్రత్యామ్నాయమన్నారు. మోడీ హయాంలో రైల్వే, రక్షణ, రీటైల్ ఇలా అన్ని రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమేటిక్ గా అనుమతి ఇవ్వబడిందన్నారు. ప్రభుత్వ రంగాలను రక్షణతో సహా అన్ని రంగాల్లో ప్రయివేటు పరం చేస్తున్నారని, దీనివల్ల సంక్షోభంలో ఉన్న కార్పొరేట్ సంస్థలకు లాభాలు వచ్చే ప్రయత్నం చేస్తున్నారని, ఫలితంగా ప్రజలపై భారం పెరుగుతుందన్నారు.

అంబానీ జియోకు అంబాసిడర్

జైహింద్ నినాదాన్ని మోడీ జియో హింద్ గా మార్చారని ఏచూరి ఆరోపించారు. డిజిటల్ లావాదేవీల్లో విదేశీ కంపెనీలకు లాభమని, ప్రతి లావాదేవికి 2 నుంచి 3 శాతం ఛార్జ్ పడుతుందని, అది వీసా, మాస్టర్ కార్డ్ వంటి కంపెనీలకు చేరుతుందన్నారు. ఇప్పుడు కుంభకోణం లేని ప్రభుత్వం వచ్చిందంటున్నారని, కానీ రఫెల్ విమానాలు కుంభకోణం చాలా పెద్దదని, ఇప్పుడు ప్రధానే నేరుగా మిడిల్ మ్యాన్ పాత్ర పోషిస్తున్నారని, అంత తీవ్రంగా దోపిడి జరుగుతుందన్నారు. లక్షల కోట్ల కంటే ఎక్కువ రుణాలు కార్పొరేట్ విద్యాలయాల రద్దు చేశారని, కానీ మొత్తం 80 వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తే చాలు దేశంలోని రైతులందరూ రుణాలు నుంచి విముక్తి పొందవచ్చని, కానీ దీనికి డబ్బు లేదంటారని వాపోయారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి కౌ ప్రొటెక్షన్ ఆర్మీ. యాంటీ రోమియో స్క్వాడ్ వంటి ప్రయివేటు ఆర్మీలు వచ్చాయని, వీటి లక్షమేంటి హిందూ మతోన్మాద హింస చేయడమేనన్నారు. సెన్సార్ చేసిన చిత్రాలను అడ్డుకుంటున్నారని, హిందూ పౌరాణిక గాథలు నే దేశ చరిత్రగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. చివరికి సుప్రీంకోర్టు లోనే ఇలాంటి అజెండా అమలుచేస్తున్నారని, ఈ చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని చంపేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరాటాలతోపాటు సామాజిక రంగంలో కృషి చేయాలని, విశాఖ మహాసభలో తీసుకున్న నిర్ణయం అనుగుణంగా దళిత సంఘాలు తో కలిసి మనం ఉద్యమాలు నిర్మిస్తున్నామన్నారు. అందుకే బిజెపి వారు వామపక్షాలను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. త్రిపురలో బిజెపి వందల కోట్లు ఖర్చు చేసి హింస రాజేస్తున్నారని, కేంద్రం నుంచి వెళ్లిన ప్రతి పైసా ఖర్చు చేసిన ఏకైక రాష్ట్రం ఏదైనా ఉంటే అది త్రిపుర అని పార్లమెంట్‌లో చెప్పిన మోడీ ఇప్పుడు అదే త్రిపుర వెళ్లి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య చిచ్చు పెడుతున్నారని, దేశభక్తి గురించి నిర్వచనాలు వల్లించే బిజెపి త్రిపురలో ఉగ్రవాద సంస్థలతో పొత్తు పెట్టుకుంటోందని ఎద్దేవా చేశారు. కేరళలో హింస ను ప్రేరేపించి అక్కడ లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు చేస్తున్నారని, బెంగాల్లో బిజెపి హిందూ మతోన్మాదాన్ని మమత ముస్లీం ఛాందస వాదాన్ని పెంచుతూ పోతున్నారని ఆరోపించారు. వీటిని ఎదుర్కొని ప్రజలు ఐక్యపరిచే కృషిలో 164 మంది వామపక్ష కార్యకర్తలు చనిపోయారని, అందువల్ల ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో అసలైన ప్రత్యామ్నాయం తీసుకురావడానికి కృషి చేయాలని ఏచూరి పిలుపునిచ్చారు. వామపక్షాల ఐక్యత అవసరం మన్నారు. ఏపిలో మనకు అవకాశాలు పెరిగాయని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా అటు బిజెపి ఇటు టిడీపి ప్రజలకు ద్రోహం చేశాయని, ఈ నేపథ్యంలో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మిస్తే పాత కమ్యూనిస్టు వైభవం తిరిగి వస్తుందన్నారు.


లిక్కర్‌ప్రైస్.. కొత్త యాప్ గురూ

ఆవిష్కరించిన మంత్రి పద్మారావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: మద్యం అమ్మకాల్లో దుకాణాదారులు పారదర్శకత పాటించాలని తెలంగాణ అబ్కారీ శాఖ మంత్రి పద్మారావు సూచించారు. మద్యం ధరల పట్టికను, లిక్కర్ ప్రైస్ యాప్‌ను ఆయన సచివాలయంలో ఆవిష్కరించారు. ప్రతి మద్యం దుకాణంలో తప్పనిసరిగా ఈ పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. వినియోగదారుల్లో చైతన్యం కల్పించేందుకే ఈ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన ఇవాళ హైదరాబాద్‌లో చెప్పారు. అబ్కారీ శాఖలో నిరంతర పర్యవేక్షణ, జవాబుదారీతనం కోసం సాంకేతికతను వినియోగిస్తున్నామని ఆ శాఖ ఇంచార్జి కమిషనర్ సోమేష్ కుమార్ తెలిపారు. లిక్కర్ ధరల యాప్ ద్వారా మద్యం అమ్మకాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని రకాల మద్యానికి సంబంధించిన సంపూర్ణ సమాచారం ఈ యాప్‌లో లభ్యమవుతుందని చెప్పారు. ఈ యాప్ పనితీరును ఆయన వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే దుకాణదారులకు జరిమానా కూడా విధించనున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ హెచ్చరించారు.

ఎల్లూరు వద్ద మిషన్ భగీరథ ట్రయల్ రన్ ప్రారంభం



నాగర్‌కర్నూల్: జిల్లాలోని కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద మిషన్ భగీరథలో భాగంగా వాటర్‌గ్రిడ్ ట్రయల్ రన్‌ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథంతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. మంత్రి జూపల్లి మాట్లా డుతూ సీఎం కేసీ ఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శ మని చెప్పారు. అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నాయని తెలిపారు. ఇంటింటికి నల్లా నీరు ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ త్వరలో నెరవేరబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో భగీరథ సీఇ కృపాకర్‌రెడ్డితో పాటు ఈఈ, డీఇ, ఏఇలు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

- ఆ రెండింటికీ ముఖ్యమంత్రి సాయం చేస్తున్నారు
- మురికివాడలు లేని నగరంగా చేయాలన్నదే మా లక్ష్యం
- డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.18 వేల కోట్లు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబం ఆత్మగౌరవంలో ఉండాలన్నది ముఖ్యమంత్రి కేటీఆర్ ఉద్దేశం అని ఐటీ, మున్సిపల్ శాఖా మంత్రి కె తారకరామారావు తెలిపారు. కంటోన్మెంట్ మడ్ ఫోర్డ్ డబుల్ బెడ్‌రూమ్‌లకు శంకుస్థాపనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రెండువేలకు పైగా మురికివాడలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వానికి అందిస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. మురికి వాడలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నదే టీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గతంలో ప్రభుత్వాలు నిర్మించిన ఇళ్ళు అగ్గిపెట్టెల్లా ఉండేవని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో విశాలవంతమైన డబుల్ బెడ్‌రూం ఇళ్ళను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు రూ.18వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, దేశ వ్యాప్తంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల కంటే ఇది అధికమని మంత్రి వెల్లడించారు. ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు సామెతలో ఉన్న రెండింటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాయం చేస్తున్నారని అన్నారు. కంటోన్మెంట్ హాస్పిటల్‌ను ప్రభుత్వానికి అప్పగిస్తే అన్ని విధాలుగా అభివృఎద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. [illegible] వరకూ ఉన్న స్థలాన్ని రాష్ట్రానికి అప్పగిస్తే స్కైవే నిర్మాణాలు చేపడతామని కేంద్ర రక్షణ మంత్రిని అడిగినట్లు మంత్రి వెల్లడించారు. పూణె తరహాలో ఇక్కడే ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ వచ్చేలా కృషి చేస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రామన్న కుంట అభివృద్ధికి రూ.2.5 కోట్లు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

కంటోన్మెంట్ సమస్యలు తీర్చాం..: మంత్రి తలసాని

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో డబుల్‌బెడ్ రూం నిర్మాణాలను చేపట్టినట్లు మరో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. జీహెచ్‌యంసీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అన్నీ నెరవేర్చుతున్నామని మంత్రి అన్నారు. కంటోన్మెంట్‌కు ఉన్న నీటి సమస్యను తీర్చేందుకు ఏరియర్స్‌కు పెండింగ్‌లో ఉన్న రూ.16కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు. అవినీతితో నిండిపోయిన కంటోన్మెంట్ బోర్డును ప్రక్షాళన చేశామని మంత్రి తెలిపారు. రోడ్ల సమస్యను మంత్రి కేటీఆర్, కేంద్ర రక్షణ మంత్రితో చర్చలు జరిపి పరిష్కరించారని తలసాని అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే జి.సాయన్న కంటోన్మెంట్ బోర్డు సభ్యులు, టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మేడీకి ముందు చూపు లేదు : రాహుల్ గాంధీ



బళ్లారి : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కర్నాటక పర్యటన దూకుడుగా ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోడిపై ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటంలా ఆయన విరుచుకుపడ్డారు. నాలుగు రోజుల పర్యటనలో తొలి రోజు శనివారం బళ్లారిలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ, మోడీప్రభుత్వం శుష్క వాగ్దానాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఉత్తుత్తి వాగ్దానాలు చేసేవారిని, మాయదారి స్వప్నాలను కళ్లకు కడుతున్నవారిని నమ్మవద్దని ప్రజలను రాహుల్ కోరారు. 'పార్లమెంటులో మోడీ గంటకు పైగా ప్రసంగించారు. కానీ భవిష్యత్తు గురించి కానీ, యువతకు ఉద్యోగాలు ఇవ్వడం గురించి కానీ, రైతులకు సాయపడడం గురించి కానీ ఆయన మాట్లాడలేదు. గతం గురించి, కాంగ్రెస్ పార్టీ గురించి ఆయన గంట సేపు మాట్లాడారు' అని రాహుల్ విమర్శించారు. కర్నాటక శాసనసభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి ప్రజలను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఆయన రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా రాహుల్ కొన్ని దేవాలయాలను కూడా సందర్శిస్తారని పార్టీ వర్గాలు చెప్పాయి.

విశాఖ రైల్వేజోన్‌కు కేంద్రం పచ్చజెండా?



(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : 'రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇస్తానన్న హామీలపై కాస్త కదలిక వచ్చింది. గత ఐదు రోజులుగా పార్లమెంట్‌లో ఎంపీల ఆందోళనతో కేంద్రం కాస్త మొత్తబడింది. ప్రధానంగా ఎంపీలు కోరుతున్న రైల్వేజోన్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోడీ ఆమోదం తరువాత మార్చి 5వ తేదీలోగా స్పష్టమైన ప్రకటన చేయనున్నట్లు సమాచారం. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. గత నాలుగైదు రోజులుగా పార్లమెంట్‌లో ఏపీ ఎంపీలు చేసిన ఆందోళన, బీజేపీ అధిష్ఠానం, కేంద్ర ప్రభుత్వం చర్చోపచర్చల నేపథ్యంలో రైల్వే జోన్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుకు ఒడిశా నుంచి ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యనేతలు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కేంద్రమంత్రి సుజనా చౌదరి గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుతో ఒడిశాకు ఎలాంటి ఇబ్బంది రాదని వారికి వివరించినట్టు సమాచారం. అలాగే గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు విశాఖ రైల్వే డివిజన్‌తో జోన్ ఏర్పాటుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. వాల్తేరు డివిజన్‌లోని 80శాతం ప్రస్తుత జోన్‌లోనే కొనసాగేలా నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనికి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా నేతలు ఒప్పుకున్నట్టు సమాచారం. శుక్రవారం ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో పాటు సుజనాచౌదరి, రైల్వేమంత్రి పీయూష్‌గోయల్ కూడా హాజరయ్యారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు అభ్యంతరాలపై చర్చించిన నేతలు రెండు వారాల్లో ప్రకటన చేయాలని నిర్ణయించినట్టుగా సమాచారం. ఇది కేవలం పరిపాలనా సంబంధమైన వ్యవహారమేనని, పార్లమెంట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో వీలైనంత త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశం ఉంది. నిన్న సాయంత్రం సమావేశం అనంతరం తన కార్యాలయ సిబ్బందికి విధివిధానాలు ఖరారు చేయాలని, ఏర్పాటుకు కావాల్సిన పత్రాలు సిద్ధం చేయాలని పీయూష్‌గోయల్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో కొనసాగుతున్నందున ఆ అధికారులతో పాటు ఈస్ట్‌కోస్ట్ అధికారులతోనూ చర్చించాక సోమవారం నుంచి తుది ప్రక్రియ ప్రారంభించి పూర్తిచేసే అవకాశం ఉంది. అనంతరం ప్రధాని ఆమోదం తర్వాత గోయల్ ఓ స్పష్టమైన ప్రకటన చేయనున్నారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టంలోని ప్రముఖమైన విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. వారం, పది రోజుల్లో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని కేంద్ర సమాచార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే దీని కోసం రైల్వే పరిధిని తగ్గించి జోన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ రైల్వేసెక్షన్‌తో కలిపి రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం చర్యలు ప్రారంభించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కాగా వాల్తేరు డివిజన్‌లోని 80 శాతం ఒడిషాకు వదిలి పెట్టాలని నిర్ణయించారట. కాగా విశాఖ రైల్వే జోన్‌కు సహకరించాలంటూ ఒడిశాకు చెందిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సుజనా చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలీకృతమైనట్లు, దాంతో వెంటనే రైల్వేజోన్ ప్రకటనకు రంగం సిద్ధం చేయాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు అమిత్‌షా చెప్పినట్టు సమాచారం. రైల్వే జోన్‌కు సంబంధించిన స్పష్టమైన ప్రకటన మార్చి 5లోపు వచ్చే అవకాశం ఉందని కేంద్ర సమాచార వర్గాలు తెలిపాయి.

ఫలించిన ఎంపీల ఆందోళన : పార్లమెంట్‌లో ఎంపీల ఆందోళన ఫలించింది. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీకి కేంద్రప్రభుత్వం ఎట్టకేలకు సానుకూల సంకేతాలు ఇచ్చింది. 2014-15 సంవత్సరానికి గాను 14వ ఆర్థికసంఘం నిబంధనల ప్రకారం 10 నెలల కాలానికి రాష్ట్రానికి రావాల్సిన మొత్తం వెంటనే ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మూడేళ్లకు సంబంధించిన మొత్తాన్ని కూడా ఒకేసారి విడుదల చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఏపీ అంశాలపై పరిష్కారానికి కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ, రైల్వే మంత్రి పీయూష్ గోయల్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో సుజనా చౌదరి సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో ఏపీకి ఇవ్వాల్సిన నిధులు, విశాఖ రైల్వేజోన్, పలు సంస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలపై చర్చించారు. అమ్రావతి నిర్మాణానికి చేసిన ఖర్చుల వివరాలను అందచేస్తే నిధులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. హోదా వల్ల వచ్చే నిధులను ఒకేసారి ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం ఈఏపీ నిధుల సర్దుబాటుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఏ నిమిషంలోనైనా రైల్వేజోన్ ప్రకటించాలని పీయూష్ గోయల్‌ను అరుణ్‌జైట్లీ ఆదేశించినట్లు సమాచారం. అలాగే దుగరాజపట్నం పోర్టు విషయంలో రక్షణ పరమైన ఇబ్బందుల ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, ఆ పోర్టును రాష్ట్ర ప్రభుత్వం చూపించిన ప్రదేశంలో నిర్మించేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తంచేసింది. దీనికి నిధులు విడుదల చేయడంతో పాటు అన్ని అనుమతులు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. అయితే, పార్లమెంట్ నియమ నిబంధనలకు లోబడి ఈప్రకటనలేవీ సభలో ప్రస్తావించలేదని జైట్లీ చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు సైతం ఆదేశాలు పంపినట్లు సమాచారం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఉక్కు కర్మాగారం నిర్మిస్తామని కేంద్రం చెప్పినట్లు తెలుస్తోంది. మెకాన్ సంస్థ ఈ నెల 12న నివేదిక అందించనున్నట్లు వెల్లడించింది.

విశాఖ రైల్వేజోన్‌పై ఎందుకు వివక్ష : విభజన హామీలు వెంటనే అమలు చేయాలని.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని గత కొన్ని రోజులుగా పార్లమెంట్ వేదికగా రాష్ట్ర ఎంపీలు గళమెత్తిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రా ఊత్తకపోవడంతో ఏపీ తీవ్రంగా నిరాశ చెందింది. దీంతో తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ పార్లమెంట్‌లో ఆంధ్రా ఎంపీలు నిరసనకు దిగారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడంతో పాటు విశాఖ రైల్వే జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే విశాఖ రైల్వే జోన్‌పై మాత్రం కేంద్రం స్పందించకపోవడం గమనార్హం. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ తెలంగాణకు వచ్చింది. దీంతో ఆంధ్రాకు ప్రత్యేక రైల్వే జోన్ కేటాయించాలని ఏపీ డిమాండ్ చేస్తూ వస్తోంది. కానీ, కేంద్రం మాత్రం సరిగా స్పందించడం లేదు. అయితే తమ కంటే తక్కువ రైల్వే నెట్‌వర్క్ ఉన్న రాష్ట్రాల్లో జోన్ ఏర్పాటు చేసి ఏపీలో మాత్రం ఎందుకు చేయట్లేదనేది ఆంధ్రా నేతల వాదన. ఆంధ్రప్రదేశ్‌లో 3,704 కిలోమీటర్ల మేర రైలు మార్గాలు ఉన్నాయి. కానీ ఇక్కడ రైల్వే జోన్ లేదు. ఛత్తీస్‌గఢ్‌లో 1,213 కిలోమీటర్ల మేర రైలు నెట్‌వర్క్ ఉంది. అక్కడ ఆగ్నేయ మధ్య రైల్వే జోన్‌ను ఏర్పాటుచేశారు. ఒడిశా, కర్ణాటకల్లోనూ అలాగే జరిగింది. ఒడిశాలో 2,572 కిలోమీటర్ల మేర రైలు మార్గాలున్నాయి. అక్కడ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ ఉంది. ఇక కర్ణాటకలో 3,281 కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ ఉండగా నైరుతి రైల్వే జోన్‌ను ఏర్పాటుచేశారు. దీంతో తమ రాష్ట్రానికి ఎందుకు జోన్ ఏర్పాటు చేయట్లేదంటూ ఏపీ నేతలు ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ డిమాండ్ల విషయంలోనూ పార్లమెంట్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. అటు సోషల్‌మీడియాలోనూ ఈ రైల్వే జోన్ కోసం నెటిజన్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర రైల్వే జోన్‌లతో పోలుస్తూ వీటికి సంబంధించిన కొన్ని పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. మరి వీటిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు : విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేశారని బీజేపీ నేత కంభపాటి హరిబాబు వెల్లడించారు. ఏపీకి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై 27 పేజీల నోట్‌ను ఢిల్లీలో ఆయన విడుదల చేశారు. మరోపక్క మాజీ మంత్రి కొణతాల నేతృత్వంలో రైల్వే పూర్వ కార్మిక నాయకుల బృందం నూతన రైల్వే జోన్ ప్రతిపాదనలను రైల్వే మంత్రి పీయూష్ గోయల్, భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలకు వివరించి చెప్పారు. వారు ఈ నూతన జోన్ కూర్పునకు సానుకూలంగా స్పందించారని సీనియర్ రైల్వే కార్మిక నాయకుడు చలసాని గాంధీ స్పష్టంచేశారు.

సైనిక కుటుంబాలపై ఉగ్ర దాడి



జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లో జైషే మహమ్మద్ (జెఇఎం) ఉగ్రవాదులు పడగ విప్పారు. సుంజ్‌వన్ వద్ద సైనిక క్యాంప్‌పై ఫిదాయిలు (ఆత్మాహుతి దళ సభ్యులు) దాడి చేశారు. సైనిక కుటుంబాలను హతమార్చడమే లక్ష్యంగా వారు ఈ దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఇప్పటి వరకు ఇద్దరు జూనియర్ కమిషన్డ్ అధికారులు (జెసిఒలు) మృతి చెందినట్లు సమాచారం. ఈ దాడిలో మరి తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మరి ఇద్దరు చిన్నారులు కూడా మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైనిక దళాలు ఎకె 56 రైఫిల్‌ను, భారీగా గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నాయి. కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను జమ్మూ కాశ్మీర్ సిఎం మెహబూబా ముఫ్తీ పరామర్శించారు.

దాడి జరిగింది ఇలా

శనివారం తెల్లవారు జామున 4.10 గంటల సమయంలో నలుగురైదుగురు ఉగ్రవాదులు 36 బ్రిగేడ్ సైనిక క్యాంపులో చొరబడ్డారు. క్యాంప్ పరిసరాల్లో భద్రత పటిష్ఠంగా ఉండటంతో సైనిక కుటుంబాలు నివసించే క్వార్టర్ల వైపు నుంచి వారు ప్రవేశించారు. క్యాంప్‌లోకి చేరిన ఫిదాయిలు దాడికి దిగడంతో తొలుత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఉగ్రవాదుల తూటాలు తగిలి ఇద్దరు అధికారులు మృతి చెందారు. మరికొంత మంది సైనిక సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. వెంటనే ఉగ్రవాదులు రెండు బృందాలుగా విడిపోయి ఆర్మీ క్వార్టర్స్‌లో నక్కారు. 4.55 గంటల సమయంలో గస్తీ కాస్తున్న సెంట్రీ ఒకరు ఉగ్ర బృందాన్ని గుర్తించి కాల్పులు జరిపాడు. వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. వెంటనే భద్రతా దళాలు అప్రమత్తమై అక్కడకు చేరుకున్నాయి. ఇప్పటికే ఆర్మీ క్వార్టర్స్‌లో నక్కిన ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఉగ్రవాదుల సంఖ్య కచ్చితంగా తెలియరాలేదు. దీనితో ఆ భవనంలో ఉన్న మొత్తం 26 ఫ్లాట్లలో 19ని ఖాళీ చేయించారు. సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. ముందు జాగ్రత్త చర్యగా సంజ్‌వన్ ప్రాంతంలో ఉన్న పాఠశాలను మూసివేశారు. జమ్ములో కూడా భద్రత ఏర్పాట్లను పటిష్ఠం చేశారు. మరొక పక్క జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో గాయపడిన వారికి వారి కుటుంబాలకు ఆమె సంఘీభావం వ్యక్తం చేశారు. ఇది జైష్ పనే ఈ దాడి జైషే మహమ్మద్ పనే అని నిపుణులు విశ్వసిస్తున్నారు. కాశ్మీర్ పోలీసులు కూడా దీనిని ధ్రువీకరించారు. పార్లమెంట్‌పై దాడి కేసులో మాస్టర్‌మైండ్ అఫ్జల్ గురును 2013 ఫిబ్రవరి 9న ఉరి తీశారు. ఈ ఘటన జరిగి కచ్చితంగా శుక్రవారానికి ఐదు సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా కాశ్మీర్ లోయలో బంద్ నిర్వహించారు. ఈ బంద్ ఉద్రిక్తంగా మారింది. దీనితో సిఆర్‌పిఎఫ్ రంగంలోకి దిగి అదుపు చేసింది. ఈ ఘటనలు జరిగిన కొన్ని గంటలలోనే ఇన్‌ఫాంట్రీ దళ కుటుంబ సభ్యులు నివసించే క్వార్టర్స్‌పై ఆత్మాహుతి దళ సభ్యులు విరుచుకుపడ్డారు. దాడి జరిగిన తీరును బట్టి ఇది కచ్చితంగా జైష్ పనే అయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా, ఉగ్ర దాడి దృష్ట్యా ఆర్మీ క్యాంపునకు 500 మీటర్ల వెలుపల ఉన్న అన్ని స్కూళ్లను మూసివేయవలసిందిగా ఆధికారులు ఆదేశాలు జారీ చేశారు. శనివారం అఫ్జల్ గురు వర్ధంతి సందర్భంగా జైషే ఎ మహమ్మద్ ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

మొదటి పేజీ తరువాయి

హోదా కోసమే నా ఊపిరి



విమర్శించారు. టీడీపీ ఎంపీలు కేంద్ర మంత్రులుగా ఉన్నారని, వారు మద్దతు తెలుపకుండానే బడ్జెట్ ఆమోదం పొందిందా అని ప్రశ్నించారు. 83వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా దుండిగం క్రాస్ రోడ్డు నుంచి పాదయాత్ర ప్రారంభించిన వైఎస్ జగన్ సాయంత్రం కావలి నియోజవర్గం బోడగుడిపాడు బహిరంగ సభలో పాల్గొని నాలుగేళ్ల చంద్రబాబు పాలనపై నిప్పులు చెరిగారు. ఈ రోజు కాకపోతే ఏదోరోజు మనం ప్రత్యేక హోదాను తప్పకుండా సాధించుకోవాలని, ఊపిరి ఉన్నంతవరకూ ఏపీకి ప్రత్యేక హోదా కోసం పోరాడతానని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. తెలంగాణ కోసం ఆ ప్రాంత ప్రజలు కొన్నేళ్లపాటు ఎంతగానో శ్రమించి చివరికి అనుకున్నది సాధించుకున్నారు. మనం కూడా ప్రత్యేక హోదా కోసం పోరాడితే ఏదో ఓరోజు మన కష్టం ఫలిస్తుంది. ఏపీకి మంచి రోజులు వస్తాయన్నారు. ప్రత్యేక హోదా వచ్చిన తర్వాత అభివృద్ధి జరిగితే ప్రతి జిల్లా హైదరాబాద్‌లా తయారవుతుందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు.

లక్షల కోట్ల పెట్టుబడులు అవాస్తవం...

విశాఖలో పది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పారిశ్రామిక సదస్సులు నిర్వహించి చంద్రబాబు ప్రకటిస్తుంటారు. లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేశాయంటూ భ్రమలు కల్పిస్తున్నారు. వాస్తవానికి డిసెంబర్ 31, 2015 నాటికి కేవలం వచ్చింది రూ. 4500 కోట్లు మాత్రమే. డిసెంబర్ 31, 2017 నాటికి కేవలం పదివేల కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చినట్లు ఓ సంస్థ సర్వేలో తేలింది. కానీ ఇన్ని జరుగుతున్నా చంద్రబాబు లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయంటూ గొప్పలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. సింగపూర్ వెళ్తే రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తా. కొరియాకు వెళ్తే రాష్ట్రాన్ని కొరియా చేస్తాం. జపాన్‌కు వెళ్తే అమరావతిని జపాన్ చేస్తాం అని చెప్పడం చంద్రబాబుకు అలవాటే. చంద్రబాబు విదేశాలకు వెళ్తే మూడు నాలుగు వందల కోట్లు ఖర్చువుతుంది. ప్రత్యేక విమానాల్లో మాత్రమే విదేశాలకు ఎందుకు వెళ్తున్నారో ప్రజలకు చెప్పాలి. చంద్రబాబు విదేశీ పర్యటనల్లో మర్మం ఏంటంటే తాను అక్రమంగా సంపాదించిన కోట్ల రూపాయల డబ్బును దాచుకోవడానికే విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు.

హడావుడి చేస్తున్న చంద్రబాబు...

నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు ఏం చేశారో చూశాం. మరో ఏడాదిలో ఎన్నికలొస్తాయని చెబుతున్న చంద్రబాబు ఇప్పుడు లేనిపోని హడావుడి చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. పంటల గిట్టుబాటు ధరలు కల్పించలేదు. సాధారణంగా ఎవరైనా ఆడబిడ్డల ఉసురు తాకుతుందని వారి కంట కన్నీళ్లు పెట్టించరు. కానీ చంద్రబాబు వాళ్ల చేత కూడా కన్నీళ్లు పెట్టించిన ఘనుడు అని జగన్ విమర్శించారు. ఎన్నికలకు ముందు జాబు రావాలంటే బాబు రావాలన్నారు. ఇప్పటికీ ఏ జాబులు రాలేదు. 45 నెలలు గడిచాయి. హామీ మేరకు నిరుద్యోగికి నెలకు రెండు వేల చొప్పున రూ.90వేల చొప్పున ఎగ్గొట్టిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ప్రత్యేక హోదా వస్తే పారిశ్రామిక వేత్తలు ఆదాయపన్ను, కొన్ని ఇతర పన్నులు కట్టాల్సిన అవసరం ఉండదు. కానీ చంద్రబాబు అలాంటి ప్రత్యేక హోదాను ఢిల్లీలో తాకట్టుపెట్టారు. ఐదారు రోజులుగా పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశాలు జరిగాయి. బాబు మొసలి కన్నీళ్లు కారుస్తూ హోదాపై పోరును నీరుగార్చారు. కేంద్ర మంత్రివర్గంలో ఉన్న టీడీపీ ఎంపీలు మద్ధతు తెలపకుండానే బడ్జెట్ ఆమోదం పొందుతుందా అని జగన్ ప్రశ్నించారు. మరో ఏడాది తర్వాత ఎన్నికలు వస్తాయనగా రాష్ట్ర ప్రజలు తనను తిడుతున్నారని గ్రహించి చంద్రబాబు ఆ నెపాన్ని ఇతరుల మీదకు మళ్లిస్తున్నారని, చంద్రబాబుకు కొన్ని మీడియాలు సహకరిస్తున్నాయని ఆరోపించారు. ఆ మీడియాల్లో. కేంద్ర ప్రభుత్వం బ్రహ్మాండంగా పని చేస్తోందని, ఏపీకి భారీగా నిధులు ఇస్తోందంటూ కథనాలు వచ్చాయి. ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీతో అదనపు ప్రయోజనాలంటూ బాబుకు అనుకూల పత్రికల్లో కథనాలు రావడం దురదృష్టకరమని, హోదాను సంజీవనితో పోల్చిన చంద్రబాబు ఆపై ఎందుకు ప్యాకేజీ రాగం అందుకున్నారని జగన్ విమర్శించారు. హోదాతో లాభం కంటే నష్టమే ఎక్కువని కేంద్ర మంత్రి, టీడీపీ ఎంపీ సుజనా చౌదరి వ్యాఖ్యలు చేశారని, టీడీపీ నేతలు రాష్ట్రాన్ని ఈ విధంగా అమ్మే కుట్రలు చేస్తున్నారన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెడతారా...

చంద్రబాబు తన మీద ఉన్న కేసులకు భయపడి, కేంద్రం ఎక్కడ తన మీద విచారణకు ఆదేశిస్తుందోనని రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెట్టి చేతులు దులుపుకున్నారని, ప్రత్యేక హోదా ఇవ్వకున్నా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని, లేనిది వచ్చినట్లుగా చూపించే యత్నం చేశారన్నారు. తన అవసరాలకు తగ్గట్లుగా నటిస్తున్న చంద్రబాబు దిక్కుమాలిన రాజకీయాలు చేయడం కంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవడం మంచిదని హితవు పలికారు. 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీలున్నాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జాబు రావాలంటే బాబు రావాలన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే నిరుద్యోగులు తమకు జాబు రావాలంటే బాబు పోవాలంటున్నారన్నారు. ప్రతి ఏడాది ఏపీపీఎస్‌సీ ద్వారా రికట్ మెంట్ చేయిస్తూ ఓవరాల్ గా 1.42 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయిస్తామని ఇచ్చిన హామీకి బాబు నీళ్లొదిలారని, మట్టి, ఇసుక, కరెంట్ ఇలా అన్ని విషయాల్లో దోపిడీ చేశారని, రైతుల భూములతో పాటు గుడి భూములను స్వాహా చేస్తున్నారని, అన్ని రకాలుగా దోచుకుంటున్నారన్నారు. గ్రామ సెక్రటేరియట్ తీసుకొచ్చి ప్రతి గ్రామంలో చదువుకున్న పది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, పెన్షన్, ఇళ్లు, రేషన్, ఫీజు రీయింబర్స్ కావాలన్నా, 72 గంటల్లోనే పని అయ్యేలా చేస్తామన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఆ తీర్మానం కాపీని రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమలకు పంపిస్తాం. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా రూల్ తీసుకువచ్చి చదువుకుంటున్న మన పిల్లలకు ఎంతో ఉపయోగం ఉంటుందని జగన్ అన్నారు.


మొదటి పేజీ తరువాయి

విభజన హామీలపై సానుకూలమే



ముందు అరుణ్‌జైట్లీ, సుజనా చౌదరి, సీఎం రమేష్‌కు హామీ ఇచ్చారు. రాజ్యసభలో ప్రకటన చేసినప్పటి నుంచి టీడీపీ ఈ అంశాలను నిశితంగా గమనిస్తోంది. అందులో భాగంగా శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని టీడీపీ ఎంపీలు కలిశారు. శుక్రవారం రాజ్యసభలో చెప్పిన అంశాలను పరిశీలించాలని జైట్లీకి టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఆయా సంస్థలకు చెందిన కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయాలని సుజనా చౌదరి అభిప్రాయపడ్డారు. శని, ఆదివారం సెలవు కావడంతో సోమవారం అన్నీ శాఖలకు సంబంధించి కార్యదర్శులను పిలిచి సమావేశం ఏర్పాటు చేస్తామని జైట్లీ చెప్పినట్లు తెలుస్తోంది. రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవన్నీ హెవీ ఇండ్రస్టీకి సంబంధించిన వ్యవహారాలు కాబట్టి ఆ శాఖకు చెందిన కార్యదర్శులను పిలిపించి వీలైనంత త్వరలో ఆదేశాలు జారీ చేస్తామని అరుణ్‌జైట్లీ చెప్పినట్లు సమాచారం.

తప్పుడు లెక్కలు చెబితే ఊరుకోవద్దు



లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మరోమారు ప్రకటన వచ్చేంతవరకూ వేచిచూడాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావును ఢిల్లీకి వెళ్లాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించారు. శనివారం ఢిల్లీలో పరిణామాలను సునిశితంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. కేంద్రంలో వచ్చిన కదలికతో వేచి చూడాలని నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ నేతలు తప్పుడు లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ నేతలతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావును, మరోమారు ఢిల్లీ వెళ్లాల్సిందిగా చంద్రబాబు సూచించారు.

పాలస్తీనాతో ఆరు ఒప్పందాలు

లక్షణాలు; జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన సాధించిన సమున్నత విజయాలు; భారతదేశం, పాలస్తీనా మధ్య చరిత్రాత్మక సంబంధాల అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈవిధంగా సత్కరిస్తున్నట్లు పాలస్తీనా ప్రభుత్వం తెలియజేసింది. పాలస్తీనా పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్న విషయం విదితమే. ఇతర దేశాల రాజులు, దేశాధినేతలు, ఆ స్థాయి వ్యక్తులకు అత్యంత గౌరవ సూచకంగా పాలస్తీనా ఈ గ్రాండ్ కాలర్‌ను ఇస్తుంది. గతంలో సౌదీ అరేబియా రాజు సాల్మన్, బెహ్రెయిన్ రాజు హమద్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తదితరులకు గతంలో అందజేశారు. మోడీ, అబ్బాస్ చర్చల అనంతరం ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశారు. దాదాపు 50 మిలియన్ డాలర్లు విలువ చేసే ఒప్పందాలు జరిగాయి. అందులో 30 మిలియన్ డాలర్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించే ఒప్పందం కూడా ఉంది. 5 మిలియన్ డాలర్లు విద్యా రంగం కోసం, మరి 5 డాలర్లు మహిళా సాధికారిత కోసం సెంటర్ నిర్మించడం కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పాలస్తీనా ప్రజల ఆసక్తులను భారత్ గౌరవిస్తుందని మోడీ వారి సమావేశం అనంతరం వెల్లడించారు. ఇక్కడ శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తామని మోడీ హామీ ఇచ్చారు. కాగా, జోర్డాన్ పర్యటన ముగించుకున్న మోడీ శనివారం పాలస్తీనా చేరుకున్నారు. రమల్లా చేరుకోగానే మోడీ ముందుగా పాలస్తీనా మాజీ అధ్యక్షుడు యాసర్ అరాఫత్ సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. అక్కడి మ్యూజియంలోని సందర్శకుల పుస్తకంలో కూడా సంతకం చేశారు. పాలస్తీనా పర్యటన ముగించుకున్న తరువాత మోడీ తిరిగి జోర్డాన్ బయలుదేరారు. ఆయన అక్కడి నుంచి యుఎఇ వెళ్లనున్నారు.





సూర్య
హైదరాబాద్
ఆదివారం
11 ఫిబ్రవరి 2018
4



“ఎక్కడ అధికారం వుంటే అక్కడకు చేరే పార్టీలు, చట్ట సభలకు ఎన్నికైన వారు అర్రులు చాచటం కనిపిస్తోంది. అధికార ప్రలోభానికి అర్రులు చాస్తే వున్న జన మద్దతు కూడా పోయేట్లుందని ఐరోపాలో అనేక పార్టీలు భయపడే స్థితికి చేరుకున్నాయి. ఐరోపాకు గుండెకాయ వంటి జర్మనీలో అదే స్థితి. గతేడాది సెప్టెంబరు 24న ఎన్నికలు జరిగినా ఇంతవరకు కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. జర్మనీలో మళ్లీ రాజకీయ పునరేకికరనకు ఏర్పాటు పూర్తయినట్లు కనిపిస్తోంది. కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ఇటీవల కొంత కాలంగా ప్రయత్నిస్తున్న జర్మనీ రాజకీయవేత్తలు తాము జరిగి న చర్చల్లో వురోగతి సాధించారు. ఇదే సమయంలో జర్మన్ కార్మికవర్గం 2003 తరువాత తొలిసారిగా తమ డిమాండ్లపై సమ్మెకి దిగటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో పార్లమెంటు రద్దుకాకుండా చూసేందుకు, ఎన్నికలను నివారించేందుకు జర్మన్ పెట్టుబడిదారులు వివిధ పార్టీలపై వత్తిడి తెస్తున్నా అవి కార్యరూపం దాల్చలేదు. సోవియట్, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలను కూల్చివేసిన తరువాత ఇదొక ఆశాజనక పరిణామం. వెంటనే ఏవో పెను మార్పులు సంభవిస్తాయని చెప్పలేము గాని తిరిగి వామపక్ష శక్తుల పెరుగుదలకు ఇది నాంది అని చెప్పవచ్చు.కానీ తాజా పరిణామాల నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అయితే ఇది ఎంతకాలం నులుస్తుందని చెప్పలేం.”

ఎట్టకేలకు జర్మనీలో ప్రభుత్వం?

మన దేశంలో ఎక్కడ అధికారం వుంటే అక్కడకు చేరే పార్టీలు, చట్ట సభలకు ఎన్నికైన వారు అర్రులు చాచటం కనిపిస్తోంది. అధికార ప్రలోభానికి అర్రులు చాస్తే వున్న జన మద్దతు కూడా పోయేట్లుందని ఐరోపాలో అనేక పార్టీలు భయపడే స్థితికి చేరుకున్నాయి. ఐరోపాకు గుండెకాయ వంటి జర్మనీలో అదే స్థితి. గతేడాది సెప్టెంబరు 24న ఎన్నికలు జరిగినా ఇంతవరకు కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. జర్మనీలో మళ్లీ రాజకీయ పునరేకికరనకు ఏర్పాటు పూర్తయినట్లు కనిపిస్తోంది. కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ఇటీవల కొంత కాలంగా ప్రయత్నిస్తున్న జర్మనీ రాజకీయవేత్తలు తాము జరిగి న చర్చల్లో వురోగతి సాధించారు. చర్చల కోసం రూపొందించిన 28 పేజీల ప్రణాళికపై చాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌కి చెందిన క్రిస్టియన్ డెమోక్రాట్స్ (సిడియు), వారి మాజీ సంకీర్ణ భాగస్వాములైన సోషల్ డెమోక్రాట్స్ (ఎస్పిడి) మధ్య గత నెల జనవరిలోనే కొంత అంగీకారం కుదిరింది. ఇరు పక్షాలకు ఆమోద యోగ్యంగా వుండే ఒప్పందం కోసం రాత్రంతా చర్చలు జరుపి వలసలు వంటి కీలకమైన అంశాలపైనా కూడ ఇరు పక్షాల మధ్య ఒప్పందం కుదిరింది. ఏటా జర్మనీకి వచ్చే వలస ప్రజలను రెండు లక్షలకే పరిమితం చేయాలని పేర్కొన్నారు. కూడా.

జర్మనీలో నివసిస్తున్న తమ కుటుంబాలను కలుసుకునేందుకు నెలకు వెయ్యి మంది వలస ప్రజలను మాత్రమే అనుమతించాలని కూడా బ్లూప్రింట్ పేర్కొంటోంది. పన్నుల్లో మార్పులపై కూడా ఈ చర్చల్లో దృష్టి కేంద్రీకరించినట్లు మీడియా వర్గాలు తెలిపాయి. తూర్పు జర్మనీ అభివృద్ధి కోసం చెల్లిస్తున్న సంఘీభావ పన్ను (సాలిడారిటీ టాక్స్)ను రద్దు చేయాలని సిడియు డిమాండ్ చేస్తోంది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుపై జరుగుతున్న ఈ కసరత్తు గతంలో ఎన్నడూ ఇంత సుదీర్ఘంగా సాగలేదు. అయితే : జర్మనీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు విషయంలో చాన్సర్ ఏంజెలా మెర్కెల్ నేతృత్వంలోని సిడియు/సిఎస్‌యు కూటమితో పొత్తు కుదిరినట్లు వచ్చిన వార్తలను ఖండించిన జర్మనీ సోషల్ డెమొక్రాట్స్ (ఎస్పిడి), సంకీర్ణ కూటమి ఏర్పాటుపై తమ షరతులను వెల్లడించింది. అయితే కూటమి ఏర్పాటుపై తమ పార్టీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ఎస్పి డి నేత మార్టిన్ షల్జ్ మీడియాకు చెప్పారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రతిపాదిస్తున్న ఐరోపా కూటమి సంస్కరణలకు సానుకూల స్పందన వెలువడితే తాము అధికార పార్టీతో చర్చలకు సిద్ధమవుతామని ఆయన వివ రించారు. ఐరోపా కూటమి సంస్కరణలతో పాటు, జర్మనీ సామాజిక విధానాల కోసం తాము సిడియుపై వత్తిడి పెంచుతా మని ఆయన చెప్పారు. ఐరోపా మొత్తానికి ఏకీకృత ఆర్థిక విధానాన్ని అమలు చేయటంతో పాటు ఇందు కు ఐరోపా కూటమిలో ఆర్థిక మంత్రిని నియమిం చాలని షల్జ్ తదితరులు పట్టుపడుతున్న విషయం తెలిసిందే. వచ్చే వారం జరుగనున్న ఎస్పిడి పార్టీ సమావేశం ముగిసే వరకూ తాము ఎటువంటి చర్చల్లో పాల్గొనబోమని షల్జ్ జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ స్టీన్‌మీర్, ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, సిఎస్‌యు నేత స్పష్టం చేశారని ఎస్‌పిడి ప్రతి నిధులు మీడియాకు వివరించారు.

పార్లమెంట్‌లోని 709 స్థానాలలో ప్రస్తుత ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ నాయకత్వంలోని సిడియు దాని మిత్రపక్షానికి 246, ప్రధాన ప్రతిపక్షమైన ఎస్‌డిపికి 153, జర్మనీ ప్రత్యామ్నాయ పార్టీ(ఎఎఫ్‌డి)కి 94, ఫ్రీ డెమోక్రటిక్ పార్టీకి 80, వామపక్షం(పూర్వపు కమ్యూనిస్టు పార్టీ) 69, గ్రీన్ పార్టీకి 67 వచ్చాయి. తిరిగి ప్రభుత్వంలో చేరాలా వద్దా అని చర్చించేందుకు డిసెంబరు ఆరున ఏర్పాటు చేసిన సమా వేశంలో ఎస్‌పిడి ప్రతినిధులు సంకీర్ణ కూటమి చర్చలకు అంగీకారం తెలిపారు. అయితే సమావేశం హాలు వెలుపల పార్టీ యువజన విభాగం నిరసన ప్రదర్శనలు చేసింది. జనవరి పన్నెండున తాము ప్రతిష్ఠంభనను అధిగమించి ఒక అంగీకారానికి వచ్చామని రెండు పార్టీలు ప్రకటించాయి. జనవరి 21న ఎస్‌పిడి అసాధారణ పార్టీ సమావేశం జరపగా 642 మంది ప్రతినిధులు హాజరయ్యారు. దానిలో సంకీర్ణ ప్రభుత్వంలో చేరేందుకు 362 అనుకూలంగా 279 మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. జనవరి 26న అంతిమంగా రెండు పార్టీలు లాంఛనంగా చర్చలు ప్రారంభించాయి.

గత నెల రోజులుగా జరుగుతున్న చర్చలను నాలుగో గడువు ఆదివారం నాటితో ముగించాలని అనుకున్నప్పటికీ అది కూడా ముగిసి పోయింది. ఒకవైపు కార్మికవర్గ సమ్మె సైరన్లు మోగుతుంటే మరోవైపు ఇతర దేశాలతో పాటు జర్మన్ స్టాక్ మార్కెట్ కూడా కుప్పకూలింది. వెంటనే సంకీర్ణ ప్రభుత్వ ఏర్పడాల్సిన అత్యవసరాన్ని స్టాక్ మార్కెట్ పరిణామాలు పెంచాయని అందరం ఇబ్బందుల్లో వున్నామని ఆపద్ధర్మ ప్రభుత్వ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ ప్రకటించారు. దీంతో సంకీర్ణానికి అన్ని పార్టీలు సిద్ధమవుతున్నా, గతంలో అవి చేసిన ప్రకటనలు, వాటి విధానాల ప్రకారం ఈ పార్టీలలో ఏ రెండూ భావసారూప్యత కలిగినవి కావు. అయినప్పటికీ చివరి నిమిషంలో అనూహ్య పరిణామం జరిగితే తప్ప సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సిడియు మరియు ఎస్‌పిడి సిద్ధం అవుతున్నాయి. ఇదే సమయంలో జర్మన్ కార్మికవర్గం 2003 తరువాత తొలిసారిగా తమ డిమాండ్లపై సమ్మెకి దిగటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో పార్లమెంటు రద్దుకాకుండా చూసేందుకు, ఎన్నికలను నివారించేందుకు జర్మన్ పెట్టుబడిదారులు వివిధ పార్టీలపై వత్తిడి తెస్తున్నా అవి కార్యరూపం దాల్చలేదు. సోవియట్, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలను కూల్చివేసిన తరువాత ఇదొక ఆశాజనక పరిణామం. వెంటనే ఏవో పెను మార్పులు సంభవిస్తాయని చెప్పలేము గాని తిరిగి వామపక్ష శక్తుల పెరుగుదలకు ఇది నాంది అని చెప్పవచ్చు.కానీ తాజా పరిణామాల నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఎక్కువ సీట్లొచ్చిన మెర్కెల్ మళ్లీ పీఠమెక్కినా ఎంతకాలం నిలుస్తుందని చెప్పలేం.

యువసేనను సిద్ధం చేస్తున్న రాహుల్

ఎం.రామ్‌గోపాల్ – హైదరాబాద్
9032340123

- బిజెపి సీట్లుని గెలుపొందటంలో కాంగ్రెస్‌లో విశ్వాసం
- వచ్చే ఎన్నికలకు పార్టీ సర్వసిద్ధం కావటంపై అనుమానం
- 2024 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగే వ్యూహం
- సీనియర్లు స్వచ్ఛందంగా తప్పుకోవాలని విన్నపం
- కర్నాటకలో విజయానికి రంగంలోకి ప్రియాంక?



ఇటీవల కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తనదైన శైలిలో యుద్ధం చేస్తునే ఉన్నారు. ముఖ్యంగా మరో ఏడాదిలో జరగబోయే లోక్సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీని, బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అస్త్రశస్త్రాలన్నిటినీ సిద్ధం చేసుకుంటున్న ఆయన ఎన్నికలలో ప్రధాన ప్రత్యర్థిగా భారతీయ జనతాపార్టీకి గట్టి పోటీ ఇవ్వాలన్న పట్టుదల ఆయనలో కనిపిస్తోంది.

అయితే ఆతని సన్నిహితులు సైతం ఇప్పటికప్పుడు ఏదో అద్భుతం జరిగితే తప్ప కేంద్రంలో రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారం అందుకోలేదన్న భావనలో ఉన్నారన్నది వాస్తవం. ప్రస్తుత ఎన్నికలకు కాకుండా 2024లో జరగబోయే ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే తనటీంకు తగిన సూచనలు చేస్తున్నారాయన అని ఆయన సన్నిహితుల కథనం.

ఆయన 2024 నాటికి పార్టీ ఖచ్చితంగా బలోపేతమై అధికారంలోకి వచ్చి తీరుతుందన్న నమ్మకాన్ని సహచరుల వద్ద వ్యక్తం చేస్తున్న ఆయన అందుకు తగిన విధంగానే బృహత్ ప్రణాళికను రూపొందించుకుని దానిని అముల పరిచే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ పగ్గాలు అందుకోక ముందునేంచే పూర్తి ప్రక్షాళనకు తెరదీసారు. ఇప్పటికే ఆయన తన వ్యక్తిగత కార్యాచరణ బృందంలోయువకులను నింపే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే రాజకీయ కొటారీలలో ఉన్న సీనియర్లకు, వృద్ధుల స్థానంలోనికి కూడా యువతరాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఈ క్రమంలోనే తనకు విధేయులైన యువ నాయకులను సమీకరించుకోవాలనేది ఆయన ప్రయత్నం. నిజానికి ఇప్పటికే పార్టీలో కొన్ని కొత్త ముఖాలు ప్రవేశిస్తున్నాయి. వారంతా రాహుల్‌కు నమ్మకస్తులే. అయితే, వారు పూర్తిస్థాయి నాయకులుగా తయారై, సరైన సమయంలో సరైన సహాయ సహకారాలు అందించడానికి ఎంత లేదన్నా కనీసం ఐదేళ్లు పడుతుందని అంచనా. ప్రస్తుతం వారికి అవసరైమెనంత రాజకీయానుభవం లేని వారు. వీరిని సానబట్టాలంటే వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికలలో వినూత్న ప్రచారం చేపట్టాలని భావిస్తున్నారు. ఈ ప్రచారం సీనియర్ నాయకుల శైలికి భిన్నంగా ఉండాలనేది ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే తన బృందంలో టెక్నాలజీ విభాగాన్ని రూపొందించి పలువురు యువకులకు స్థానం కల్పించిన ఆయన రానున్న ఎన్నికల నాటికి సలహా బృందంలోనూ యువతరం ఉండాలని ఆశిస్తున్నారు. ఇందుకు తన విధేయుల్లో ఐఏఎస్ నుంచి రాజీనామా చేసినవాళ్లు, టెక్కీలు, ఎంబీలను గుర్తించినట్లు సమాచారం. వీరంతా అనుభవ సంపాదించి, పార్టీలో అంతర్గతంగా సిద్ధం చేయడానికి, తాను సరైన వ్యూహాలను అనుసరించడానికి ఇంకా కొంత సమయం అవసరం అవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తోంది. మరో అయిదారేళ్లు ఆగితే, తన తల్లి సోనియా గాంధీ కోటరీకి సంబంధించిన ఎనియర్ నాయకులు అహ్మద్ పటేల్, మోతీలాల్ వోరా, ఏకే ఆంటోనీ, చిదంబరం, దిగ్విజయ్ సింగ్ తదితర క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటారని, వారి స్థానాలలోకి యువ తరాన్ని తీసుకువచ్చి, తన అభీష్టం ప్రకారం పార్టీని పటిష్టం చేసుకుని, బీజేపీని ఢీకొట్ట వచ్చున్నది రాహుల్ ఆలోచనలుగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆయన పార్టీ సీనియర్లు తమకు తాముగా, హుందాగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పు కోవాలని సూచించినట్లు సమాచారం. వారు తప్పుకునేలోగా సుమారు 20 మంది యువకులతో తన బృందాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు న్నాయి.

ఈ క్రమంలో రానున్న ఎన్నికలలోనూ బిజెపికి ధీటైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు తన నాయనమ్మ ఇందిరా గాంధీ తరహాలో, ప్రధాని నరేంద్ర మోదీలా యువతను ఆకర్షించేలా నినాదాలను సృష్టించేందుకు సాంకేతిక సలహాదారులకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. ఇందిర నినాదం రోటీ కపడా ఔర్ మకాన్, గరీబీ హటావోవంటి నినాదాల రూపకల్పన అవసరాన్ని రాహుల్‌కు పలువురు సలహాలిచ్చినట్లు కనిపిస్తోంది. అభివృద్ధి, అవినీతి, వారసత్వ రాజకీయాలు అంటూ ప్రధాని మోదీ ఎన్నికల రణరంగంలోకి దిగే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, అభివృద్ధిని ఊతంగా చేసుకుని నినాదాలను రూపొందించాల్సిన అవసరం ఉందని, ఇందిరా గాంధీ రూపొందించిన ఇరవై సూత్రాల కార్యక్రమం తరహాలో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి ఎన్నికల ప్రచారం ప్రారంభించే పనిలో కాంగ్రెస్ నేతలు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఇటీవల జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభల ఎన్నికల సమయంలో రాహుల్ వ్యవహారైశెలి బాగా మెరుగుపడిందని, అందునా ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షాల జోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో కాషాయ జండా రెపరెపల్ని నిలువరించడంలో రాహుల్ తనదైన ప్రతిభ చూపడంతో పాటు చేసిన నినాదాలు ప్రజల మనసులకు హత్తుకు పోవటం వల్లే బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు అందుకోలేక పోయిందన్నది కాంగ్రెస్ శ్రేణుల వాదన. ఇది వాస్తవం కూడా ముఖ్యంగా గత కొంత కాలంగా దేశంలోని పలు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి రుచులు చూస్తున్నా గుజరాత్ ఎన్నికల నాటికి అది తగ్గిందనిపిస్తోంది. గుజరాత్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడడం, ఆపై బిజెపికి బలమైన రాష్ట్రంగా ఉన్న రాజస్థాన్‌లో జరగిన ఉప ఎన్నికల్లో బిజెపి సొంత సీట్లలో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడం కాంగ్రెస్ శ్రేణులలో కొండంత ధైర్యాన్ని నింపిందనే చెప్పారు. ఇందుకు అనుగుణంగానే తను ఏర్పాటు చేసుకున్న టీంలోకి సచిన్ పైలట్, జ్యోతిరాదిత్య సింధియా, అశోక్ గెహ్లట్, కమల్నాథ్ వంటి యువ నాయకుల సహాయ సహకారం రాహుల్ గాంధీకి బాగా అంది వచ్చింది., నిన్నమొన్నటి వరకు పార్టీలోని కొందరు సీనియర్ నేతలపైనే ఆధారపడి, వారి సలహాలను పాటిస్తూ వస్తుండటం వల్లే పార్టీ పతనావస్థకి కారణమని భావిస్తున్న ఆయన తన యువ విధేయులతో మనసు విప్పి మాట్లాడుతున్నారు. తన రాజకీయ వ్యూహాలు, అంశాలపై పదే పదే చర్చిస్తు, కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత గురించే వ్యూహాలు రచిస్తునే ఉన్నారు. ప్రస్తుతం పాలక పార్టీగా ఉన్న బిజెపి జన వ్యతిరేకత ఎదుర్కొంటున్నా మరో నాలుగేళ్లలో మరింత బలహీనపడడం ఖాయమనీ, అది ఇప్పటికి ఇప్పటి స్థాయిని మించి కాంగ్రెస్ జనం మద్దతు అందుకుంటుందన్న భావనలో ఉన్నారాయన. రాహుల్ వామపక్ష సిద్ధాం తాల పట్ల అభిమానం ఉందని, ఈ క్రమంలోనే ఆయన సీతారాం ఏచూరి వంటి నాయకులను పలు విషయాలలో సంప్రదించి సలహాలు పొందుతుంటారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌తో కలసి పోరాదని సిపిఎం నిర్ణయించినా, ఎన్నికల అనంతరం తమతో కలసి వచ్చేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారన్నది ఆయన తపిస్తున్నారు. 2024 నాటికి బిజెపి అధికారం నుంచి తొలగించడానికి ఆయన వామపక్షాలతో చేతులు కలిపే అవకాశం ఉందన్నది నిజమేనని పార్టీ వర్గాలు కూడా భావిస్తున్నాయి.

సోనియా కోటరీలో తనకు వ్యతిరేకులుగా ఉన్న వారిని ఇప్పటినుంచే తప్పించే పనిలో ఉన్న ఆయన కర్నాటక ఎన్నికలలో అధికారం కనుక అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యవహారంలో కల్పించుకునేందుకు దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కర్ణాటకలో అధికారం తిరిగి పొందితే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కర్ణాట నుంచి కూడా వీలైనంత మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నదిరాహుల్ వ్యూహం. అయితే బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల కాంగ్రెస్‌లోతీవ్రస్థాయిలో విభేదాలు నెలకొని ఉండటంతో వాటిని పరిష్కరించడం మీద దృషి సారించారు. ఇందుకు అనుగుణంగానే రాజస్థాన్‌లో సచిన్ పైలట్‌ను, అశోక్ గెహ్లాట్లను, మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, కమల్‌నాథ్‌లను ప్రోత్సహిస్తున్నారన్నది వాస్తవం. ప్రస్తుత సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే తాను అధికారం కోసం 2024 వరకూ వేచి చూడాల్సిందేనని భావిస్తుం పార్టీపై తన పట్టు, పలుకుబడి పెరిగేలా చూస్తున్నారు. .

వాస్తవానికి గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడినప్పటికీ, 2019 ఎన్నికల్లో కేవలం ప్రత్యర్థుల బలహీనతలు, లోటుపాట్ల మీద ఆధారపడితే ప్రయోజనం లేదన్నదీ వాస్తవాన్ని గ్రహించాలి. ఇప్పటికే అవినీతి మచ్చపడిన కాంగ్రెస్ నాయకులను దూరం పెట్టడంతో పాటు కొత్త రక్తం ఎక్కించి జవసత్వాలు గలిగింగించేలా కనీసం ఏడాది పాటు పూర్తిగా పార్టీ ప్రక్షాళన కార్యక్రమం చేపడితే తప్ప పార్టీకి పూర్తి వైభవం అందించడం సాధ్యమయ్యే విషయం కాదు. ఇందుకు ఖచ్చితంగా రానున్న కర్ణాటక ఎన్నికలలో విజయం సాధించాల్సిన అవసరం గుర్తించి, అవసరైమెతే సోదరి ప్రియాంక గాంధీని కూడా రంగంలోకి దింపే ఆస్కారం ఉంది. కాగా ఈ ఏడాది చివరి నాటికి సోనియా గాంధీ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెపుతుండటం గమనార్హం.

చరిత్రలో ఈరోజు

ఫిబ్రవరి 11

1990: 27 సంవత్సరాల జైలు జీవితం నుంచి నెల్సన్ మండేలాకు స్వేచ్ఛ లభించింది.
1847: థామస్ ఆల్వా ఎడిసన్, విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ కనిపెట్టిన అమెరికన్ శాస్త్రవేత్త మరియు వ్యాపారవేత్త జననం.
1917: తరిమెల నాగిరెడ్డి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు జననం.
1974: ఘంటసాల వెంకటేశ్వరరావు, ప్రముఖ తెలుగు సినిమా సంగీత దర్శకుడు మరియు నేపథ్య గాయకుడు మరణం.
1996: ఆలపాటి రవీంద్రనాథ్, జ్యోతి, రేరాణి, సినిమా, మిసిమి పత్రికల స్థాపకుడు మరణం.
2010: లక్ష్మీదేవమ్మ, ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి మరణం.

ఘంటసాల వెంకటేశ్వరరావు




ఘంటసాల వెంకటేశ్వరరావు డిసెంబర్ 4, 1922న జన్మించి, ఫిబ్రవరి 11, 1974న మరణించారు. ఆయన ప్రముఖ తెలుగు సినిమా సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు. ఘంటసాల తెలుగు సినిమా తొలితరము నేపథ్యగాయకులలో ప్రముఖుడు. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగు వారిలో అత్యంత ప్రజాదరణ పొందినది. 1951లో పాతాళభైరవి విజయంతో ఘంటసాల పేరు ఆంధ్రదేశమంతా మారుమ్రోగింది. తరువాత విడుదలైన మల్లీశ్వరి చిత్రంలోని పాటలు అత్యంత ప్రజాదరణ పొందడానికి సాలూరి రాజేశ్వరరావు సంగీతానికి ఘంటసాల గాత్రం తోడవడమే! 1953లో వచ్చిన దేవదాసు ఘంటసాల సినీజీవితంలో కలికితురాయిగా నిలిచిపోయింది. 1970 వరకు దాదాపు ప్రతిపాట ఘంటసాల పాడినదే! ఏనోట విన్నా ఆయన పాడిన పాటలే.

థామస్ అల్వా ఎడిసన్

థామస్ అల్వా ఎడిసన్ అమెరికాలో ఫిబ్రవరి 11, 1847న జన్మించి, అక్టోబర్ 18న, 1931న మరణించారు. మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త మరియు వ్యాపారవేత్త. ఆయన 1000 పేటెంట్లకు హక్కులు కలిగి ఉన్నాడు. 1889లో పారిస్లో గొప్ప వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. అందులో ప్రదర్శించబడ్డ వస్తువుల్లో తొంభై శాతానికి పైగా థామస్ ఎడిసన్‌కు చెందినవే. 10 ఏళ్ళ వయస్సు నాటికి ఆయన సొంతంగా లాబొరేటరీని ఏర్పాటు చేసుకున్నాడు. అతి చిన్నవయస్సులోనే టెలిగ్రాఫ్ నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. 1868లో టెలిగ్రాఫ్ పేటెంట్‌ను పొందగలిగాడు. 1878లో ఎలక్ట్రిక్ బల్బ్‌ను రూపొందించాడు. టైప్‌రైటర్, ఎలక్ట్రిక్‌పెన్, గ్రామ్‌ఫోన్, మోషన్ పిక్చర్ కెమేరా, అలాగ ఎన్నింటినో ఆయన రూపొందించారు.

నెల్సన్ మండేలా



నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా 18 జూలై, 1918న జన్మించి, డిసెంబర్ 5, 2013న మరణించారు. ఆయన దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు. 1990 ఫిబ్రవరి 11న 27 ఏళ్ల తర్వాత ఆయనకు శ్వేతజాతి ప్రభుత్వం నుంచి స్వేచ్ఛ లభించింది. ఆయన ఆ దేశానికి పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడు. అధ్యక్షుడు కాకమునుపు ఇతను జాతి వివక్ష వ్యతిరేఖ ఉద్యమకారుడు మరియు ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, దానికి సాయుధ విభాగం అయిన ఉంకోంటో విసిజ్వేకు అధ్యక్షుడు. జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో జరిగిన ఒక మారణకాండకు సంబంధించి 27 సంవత్సరాల పాటు రోబెన్ అనే ద్వీపంలో జైలు శిక్షననుభవించాడు. 20వ శతాబ్దపు అత్యంత ప్రసిద్ధులైన ప్రపంచ నాయకులలో ఒకడు. నల్లజాతి సూరీడు అని పలు తెలుగు వ్యాసాలలో ఈయన గురించి వర్ణించారు. జాతి వివక్షతకు వ్యతిరేకంగా జరిపే పోరాటాలకు, వర్ణ సమానతకు మండేలా సంకేతంగా నిలిచాడు. జైలునుండి విడుదల అయిన తరువాత నెల్సన్ మండేలా రాజకీయంగా తన లక్ష్యాన్ని సాధించడానికి, దేశంలో నెలకొన్న జాతివైర్యాన్ని నివారించడానికి, అందరి మధ్య సయోధ్యపెంచడానికి కృషి చేశాడు.

కేంద్రం ‘గల్లా’ పట్టుకున్న జయదేవుడు

సత్య ఎం.వి.ఎస్ - హైదరాబాద్
833011972

- ఏపి ప్రత్యేక ప్రయోజనాల విషయంపై నిలదీతలు
- పార్లమెంటును తాకిన గుంటూరు మిర్చి ఘాటు
- సామాజిక మీడియాలో హీరో అయిన ఎంపి జయదేవ్
- మాటల మాంత్రికుడు ఉండవల్లి సైతం ప్రశంసలు
- శభాష్ అంటూ ప్రోత్సాహమిచ్చిన ఏపి సిఎం చంద్రబాబు



నిన్న మొన్నటిదాకా టీడీపీలో ఓ సాదాసీదా ఎంపీగా ఉన్న గల్లా జయదేవ్ ఇప్పుడు ఒక్కసారిగా హీరో అయిపోయారు. విభజన హామిల వైఫల్యంపై కేంద్రాన్ని నిలదీస్తూ పార్లమెంటులో ఆయన ఇచ్చిన స్పీచుకు ఏపీ యువత ఫిదా అయిపోయింది. సోషల్ మీడియాలో ఆయన ప్రసంగం వైరల్ గా మారింది. ప్రధానమంత్రి, ఆర్థికమంత్రులను సూటిగా ప్రశ్నిస్తూ చేసిన ప్రసంగం ఆయనకు ఎక్కడలేని క్రేజ్ తీసుకొచ్చింది.

పార్లమెంటులో గుంటూరు మిరప రుచి ఇదంటూ బడ్జెట్ సెషన్లో టీడీపీ ఫైటింగ్ స్పిరిట్ అనే అంశంపై ఇప్పుడు దేశమంతా సంచలనం సృష్టిస్తోందన్నది వాస్తవం. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ అదరగొట్టాడని! ఫలితం మాట అటుంచితే.. నిండుసభలో కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని ఎలాంటి భేషజాలు లేకుండా సూటిగా వేలెత్తి చూపుతూ గల్లా చేసిన ప్రసంగం.. ఏపీ పాలిటిక్స్ లో హాట్ టాపిక్! పార్లమెంట్ వెలుపల చిత్తూరు ఎంపీ శివప్రసాద్ సినీ దర్శకుడిగా తన ప్రత్యేక నిరూపించుకుంటూ అద్భుత పెర్ఫామెన్స్‌తో ఇరగదీస్తే.. లోక్‌సభ లోపల గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన సూటైని ప్రశ్నల పరంపరతో హీరోయిక్ స్టైల్ చూపించారు. ఇప్పటివరకు అధికార పక్షానికి తోడుగా, జోడుగా ఉన్న మిత్రపక్షాల నుంచి ఏనాడు ఎదురుకాని సంకటస్థితిని జయదేవ్ రుచి చూపించాడంటూ తోటి పార్లమెంటేరియన్లే ప్రశంసలు కురిపిస్తుండటం విశేషం. రాష్ట్రం గురించి ప్రశ్నించడంలేదు. మన ఎంపీలు రాజీనామాలు చేయాలంటూ పదే పదే విపక్షాలతో సహా పలువురు చేస్తున్న ప్రకటనలు, విమర్శలకు ధీటుగా తనేంటో నిరూపించుకున్నాడు జయదేవ్ అనటంలో సందేహం లేదు. సినీ నటుడు మహేష్ బాబు అక్కకు భర్తగా మాత్రమే కాకుండా గల్లా అరుణకుమారి లాంటి ఉన్నత రాజకీయ నేతకు కుమారుడిగా, మంచి చదువరిగా విజయవంతమైన వ్యాపారవేత్తగా పేరున్న జయదేవ్.. తాజాగా పార్లమెంటులో తనకు అందిన అవకాశాన్ని చాలా చక్కగా వినియోగించుకున్నారని, అతడిలోని ఇంటలెక్చువల్ క్వాలిటీస్ బాగా ఎక్స్ పోజ్ అయ్యాయని ప్రశంసలు కురుస్తున్నాయి.

2014ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన జయదేవ్.. ఈ స్థాయిలో మునుపెన్నడూ మాట్లాడలేదు. పార్లమెంటులో దాదాపు గంట పాటు ఇంగ్లీషులోనే మాట్లాడిన జయదేవ్.. మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మిస్టర్ ఫైనాన్స్ మినిస్టర్ అంటూ గద్దింపు స్వరంతో నిలదీసిన తీరు అందర్నీ సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తింది. ఏపీ ప్రజలు ఫూల్స్ కాదని.. ఈ విషయంలో సంజాయిషీ ఇవ్వడానికి మీకు ఇదే లాస్ట్ ఛాన్స్ అంటూ ప్రభుత్వాన్ని చేసిన హెచ్చరికలతో ఊహించని పరిణామాలు ముందుకు వస్తున్నట్లు అధికార పక్షమే నివ్వెర పోయింది.

అప్పులతో ఉన్న రాష్ట్రంలో కనీసం రాజధాని నిర్మించుకునేందుకు కూడా నిధులు ఇవ్వలేదని, విశాఖకు రైల్వే జోన్ మాటే లేకుండా పోయిందని ఓ వైపు విరుచుకు పడుతునే, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని చెపుతున్న పార్టీ పలు కేసుల్లో ఏ1 నిందితుడిగా ఉన్న జగన్‌తో పొత్తుకు వెంపర్లాడుతోందని ఇది ఏతరహా సంకేతాలని నిలదీసారు. ఇలాంటి సందర్భంలో బీజేపీతో మేము పొత్తు ఎందుకు కొనసాగించాలి? అని ప్రశ్నించడంతో పాటు ఏపీ ప్రభుత్వానికి ఇచ్చిన నిధులు బాహుబలి కలెక్షన్ల కంటే తక్కువగా ఉన్నాయంటూ చేసిన ఎద్దేవా పార్లమెంటునే బిక్కచచ్చిపోయేలా చేసింది.

ఇదే అన్యాయం ఇంకా కొనసాగితే బీజేపీకి పుట్టగతులు ఉండవంటూ అతడు చేసిన వ్యాఖ్యలు.. సూటిగా తగిలేశాయి. ఇంతవరకూ ఇంత ధాటిగా మాట్లాడిన సందర్భం లేదు. అనర్గళంగా మాట్లాడ్డం వేరు.. అర్థవంతంగా మాట్లాడ్డం వేరు..! ఈ రెండు కోణాల్లోనూ గల్లా పరిణితి చూపించారని.. ఈ విషయం చంద్రబాబు సైతం మెచుకోలుగా భుజం తట్టారని తెలుగుదేశం వర్గాలలోనే వినిపిస్తున్న వార్త. గల్లా స్పీచ్ కాపీని ఎవరు తయారుచేశారు, ఎవరు ఖరారు చేశారు.. అనేదాకా వెళ్ళిపోయింది రాజకీయవర్గాల్లో చర్చ. శెభాష్ గల్లా.. అంటూ ఉండవల్లి లాంటి విజ్ఞులే కాంప్లిమెంట్ ఇచ్చేశాంంటే ఆయన భావనలు ఈ రాష్ట్రానికి ఏదో చేయాలన్న పరితపన ఏపాటితో చెప్పకనే చెపుతోంది.


వ్యక్తిగత పొలిటికల్ మైలేజ్ కోసం చట్టసభల్లో నానా స్టంట్స్ చేసే నేతల కన్నా.. హుందాగా ప్రశ్నిస్తూ జయదేవ్ చేసిన ప్రసంగం ఏపీ ప్రజల మనసు గెలిచిందననది వాస్తవం. ఇప్పటి వరకు ఈ తరహాలో మన ఎంపీలు ఎవ్వరూ మాట్లాడలేదన్నది కూడా నిజం. ఎంపీగా ఎన్నికై గుంటూరు ప్రజల మనసు గెలిచిన జయదేవ్.. ఈ స్పీచుతో ఐదున్నర కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల మనసు గెలుచుకున్నారని చెబుతున్నారు.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా:
Editor, Surya, Surya Soudha, Plot.No.185, MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i

చదువుతో పాటు ఉద్యోగం

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉద్యోగాలు చదువు పూర్తయ్యాక చూద్దామన్న భావన నుంచి నేటి తరం విద్యార్థులు బయటికి వస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఈ మార్పు అధికంగా కనిపిస్తోంది. ఇంజినీరింగ్ చదువుతూనే కొద్ది వారాలపాటు ఐటీ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు విద్యార్థులు ముందుకువస్తున్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని వివిధ కంపెనీల్లో ఉద్యోగ అనుభవం పొందుతున్నారు. ఇంటర్న్‌షిప్ అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఆన్‌లైన్ పోర్టళ్లు కూడా అందుబాటులోకి రావడం మరింత సులువుగా మారింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగంలో చేరినప్పటి నుంచే శిక్షణ అవసరం లేకుండా పని చేయాలని పరిశ్రమలు కోరుకుంటున్నాయి. ఆ క్రమంలోనే ఇంటర్న్‌షిప్ విధానం తెరపైకి వచ్చింది. కొద్ది సంవత్సరాల నుంచి ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన వారికి బీటెక్ చివరి ఏడాది రెండో సెమిస్టర్‌లో కొద్ది నెలలపాటు ఇంటర్న్‌షిప్ పేరిట ఉద్యోగంలో నియమించుకుంటున్నాయి. ఆ సమయంలో వేతనాలూ ఇస్తున్నాయి. పరిశ్రమల స్థాయి నిబట్టి నెల వేతనం రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు అందిస్తున్నాయి. ఇప్పటికే ఉద్యోగాలకు ఎంపికైన వారిని కాకుండా బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్లోనే ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేసుకుంటున్న పరిశ్రమల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతోంది. ఆ సమయంలో విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యాల ఆధారంగా వారిని నేరుగా ఉద్యోగానికి ఎంపిక చేస్తున్నారు. అలాంటి వారు ప్రాంగణ నియామకాల్లో నిర్వహించే రాత పరీక్ష, ముఖాముఖీలకు హాజరవ్వాల్సిన అవసరం లేదు. పరిశ్రమలు కోరుకుంటున్నట్లు ఇంజినీరింగ్ పూర్తయ్యేలోపు అసలు సిసలు ఉద్యోగిలాగానే పనిచేసేలా విద్య ఉండాలని భావిస్తున్న అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) సైతం గత ఏడాది కాలంగా ఇంటర్న్‌షిప్‌పై దృష్టి సారించింది. ఇంటర్వ్యూలు, మరికొన్ని ఇతర సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. కొన్ని కంపెనీలు బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులను ఆన్‌లైన్ పరీక్షల ద్వారా ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేసుకొని వారి పనితీరు ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయనీ, వారు మళ్లీ ప్రాంగణ నియామకాల్లో పోటీ పడాల్సిన అవసరం లేదని సీబీఐటీ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి ఎన్ఎల్ఎన్ రెడ్డి చెప్పారు.

ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది: జైట్లీ



న్యూఢిల్లీ : రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ శనివారం ఆశాభావం వ్యక్తం చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) బోర్డుతో శనివారం జరిగిన సమావేశం అనంతరం జైట్లీ మీడియాతో మాట్లాడుతూ ఈ ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడంపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లు యథాతథంగా ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరైనదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఖరీఫ్ పంటకు మద్దతు ధర పెంచే నిర్ణయం గురించి చర్చించినట్లు జైట్లీ వెల్లడించారు. మద్దతు ధర పెంపును ఎలా అమలు చేయాలి, దాని ప్రభావం రైతుల మీద ఎలా ఉంటుంది, వస్తువుల ఎగుమతులు, దిగుమతుల మధ్య నెలకొన్న పోటీ మొదలైన కీలకమైన అంశాలను ఈ సమావేశంలో చర్చించామని జైట్లీ తెలియజేశారు.

మరో బ్రహ్మాండమైన ఆఫర్ ప్రకటించిన గో ఎయిర్



న్యూఢిల్లీ : చౌక ధరల విమాన యాన సంస్థ గో ఎయిర్ మరొక చవక ఆఫర్‌తో ముందుకు వచ్చింది. దేశీయ ప్రయాణికుల కోసం అన్ని పన్నులతో కలుపుకుని రూ. 991కే టిక్కెట్లను విక్రయించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ నెల 20 వరకు టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. హెచ్‌డిఎఫ్‌సి డెబిట్, క్రెడిట్ కార్డులపై టిక్కెట్లను బుక్ చేసుకునే వినియోగదారులు అదనంగా పది శాతం రాయితీ పొందవచ్చు. అయితే, ఇందు కోసం ఆంగ్ల అక్షరాలతో 'గోహెచ్‌డిఎఫ్‌సి10 అనే ప్రోమో కోడ్‌ను ఉపయోగించవలసి ఉంటుంది. గో ఎయిర్ వెబ్‌సైట్ ప్రకారం, బరోడా నుంచి గువాహటికి రూ. 991కే టిక్కెట్ ఆఫర్ చేస్తుండగా గువాహటి నుంచి బరోడాకు రూ. 1,299, కోచి నుంచి బెంగళూరుకు రూ. 1,390, హైదరాబాద్ నుంచి చెన్నైకి రూ. 1,399, కోచి నుంచి చెన్నైకి రూ. 1,540, పాట్నా నుంచి రాంచీకి రూ. 1,560, చెన్నై నుంచి కోచికి రూ. 1,653, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రూ. 1,731 కనీస ధరలతో టిక్కెట్లను ఆఫర్ చేస్తోంది. కాగా, ఈ ఆఫర్ కింద పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయి.

ఏపీకి చెప్పింది చేస్తున్నాం

● ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం కట్టుబడి ఉంది ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు



న్యూఢిల్లీ, సూర్య ప్రధాన ప్రతినిధి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు స్పందించారు. ఏపీకి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై 27 పేజీల నోట్‌ను హరిబాబు ఢిల్లీలో విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఏపీకి కేంద్రం నుంచి అందుతున్న సాయాన్ని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే రూ.4 వేల కోట్లకు పైగా ఇచ్చారని వివరించారు. మోడీ ప్రభుత్వం తొలి భేటీలోనే పోలవరానికి సంబంధించిన 7 మండలాలపై నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఉజ్వల్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏపీ పూర్తిస్థాయిలో వినియోగించుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం అంగీకరించినట్లు చెప్పారు. రెండు విశ్వవిద్యాలయాలకు రూ.10 కోట్ల చొప్పున కేంద్రం కేటాయిస్తోందని వెల్లడించారు. దుగరాజ పట్నం పోర్టు ఏర్పాటుకు పలు అభ్యంతరాలు వచ్చాయని, దీంతో ప్రత్యామ్నాయ పోర్టు సూచించాలని ఏపీని కేంద్రం కోరిందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏపీలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ప్రకటిస్తే రాష్ట్రానికి ఎంతమేర లాభం చేకూరుతుందో అంతేమేర ఒక్క రూపాయి తగ్గకుండా ప్రత్యేక ప్యాకేజీని అమలు చేస్తామని కేంద్రం ప్రకటించిందని ఆయన అన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలు బంద్ పాటించాయని, చట్టాన్ని రూపొందించి ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో పెట్టనివాళ్లు కూడా బంద్‌లో పాల్గొన్నారని విమర్శించారు.

ఆంధ్రా ప్రజల గొంతు కోసింది కాంగ్రెస్సే...నరసింహారావు

ఆంధ్రా ప్రజల గొంతు కోసింది కాంగ్రెస్ పార్టీనేనని బీజేపీ నేత నరసింహారావు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీపై కొందరు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని, ఏపీకి కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని బీజేపీ ప్రభుత్వమే సరిచేస్తోందన్నారు. ఏపీ వల్లనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏపీ ప్రజలనే మోసం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ సరైన న్యాయం చేయలేదని, విభజన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు.

పర్యాటకం ఇక పరుగులు

- **విశాఖలో అరకు, మధురవాడ**
- **విజయవాడలో భవానీ ద్వీపాల అభివృద్ధి**
- **కడపలో పెన్నానదిపై తీగల వంతెన**
- **శ్రీకాకుళంలో బీచ్ రిసార్ట్**
- **పర్యాటక గమ్యస్థానంగా మధురవాడ**
- **సముద్ర మ్యూజియంగా విరాట్**
- **పతిపాదనలను ఆమోదించిన ప్రభుత్వం**



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : కొత్త సంవత్సరంలో రాష్ట్రం సరికొత్త పర్యాటక కళను సంతరించుకోనుంది. విశాఖలో అరకు అందాలు కనువిందు చేయనున్నాయి. పెన్నాపై తీగల వంతెన అలరించనుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్), ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర పర్యాటక, వారసత్వ ప్రాధికార బోర్డు ఆమోదముద్ర వేసింది. మొత్తం 240 ఎకరాల కొండ ప్రాంతంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో 48 ఎకరాల స్థలంలో ప్రకృతి రమణీయతను చాటేలా ఆహ్లాదకరమై పచ్చిక (గ్రీన్ జోన్). తూర్పు పశ్చిమ భాగాల్లో సాహస, ఎంటర్టైన్మెంట్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు. 42 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్, మలువులను కలుపుతూ రహదారుల అభివృద్ధి, 115 ఎకరాల్లో హోటళ్లు, కన్వెన్షన్ కేంద్రం, గ్రీన్ బిల్డింగ్ వంటివి ఏర్పాటు చేస్తారు. 15 ఎకరాల స్థలాన్ని భవిష్యత్తు అవసరాలు, అభివృద్ధి కోసం కేటాయిస్తారు. 11 ఎకరాల్లో హస్తకళల గ్రామం, గ్రీన్, ఆర్గానిక్ ల్యాండ్ స్కేపింగ్, 8 ఎకరాల్లో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రం అభివృద్ధి చేస్తారు. అలాగే విశాఖలోని రుషికొండలో రూ.350 కోట్ల అంచనా వ్యయంతో ఐఎన్ఎస్ విరాట్ యుద్ధ నౌకను సముద్ర మ్యూజియంగా మారుస్తారు. దీనిని 15 నెలల్లో పూర్తి చేసేలా ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇందులో 750 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ కేంద్రం, 2 రెస్టారెంట్లు, 148 హోటల్ గదులు, పై అంతస్తులో అవుట్డోర్ ఓపెన్ స్పేస్, ఎంటర్టైన్మెంట్ వంటివి ఉంటాయి. జలాంతర్గామికి సంబంధించి శిక్షణ సంస్థను ఇందులో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ప్రాజెక్టులను చేపట్టేందుకు డీపీఆర్‌ను (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) సిద్ధం చేసేందుకు ప్రతిపాదనలు ఆహ్వానించనున్నారు.

అరకులో గిరిజన సర్క్యూట్

అరకు ఎకో టూరిజం గమ్యస్థానంగా నిలిచేలా గిరిజన సర్క్యూట్ను అభివృద్ధి చేయనున్నారు. రూ.163 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రాజెక్టులో శృంగవరపుకోట వద్ద దారిపక్కన అభివృద్ధి పనులు, అనంతగిరిలోని హరిత రిసార్టులో అదనపు కాటేజీలు, 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈతకొలను, సాహసకృత్యాల ప్రాంతం(జోన్), 150 మీటర్ల పొడవున సస్పెన్షన్ వంతెన, వైద్య పర్యాటక కేంద్రం, బోటింగ్ ఎరీనా, ఆర్ట్ థియేటర్ తదితర ఏర్పాట్లు చేయనున్నారు.

అమరావతిలో మెగా శిల్పారామం

అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో మెగా శిల్పారామాన్ని శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేయనుంది. చేతి వృత్తుల శిక్షణ కేంద్రాలు, ఉత్పత్తుల డిజైన్ అభివృద్ధి కేంద్రం, ఉత్పత్తి- ప్రత్యక్ష ప్రదర్శన కేంద్రం, క్రాఫ్ట్ బజార్, బహుళ ప్రయోజన హాళ్లు, యాంఫీ థియేటర్లు, గ్రామ, ఆదివాసీ మ్యూజియం, నిర్మించి నిర్వహించి అప్పగించే (బీఓటీ) విధానంలో స్టార్ హోటల్ నిర్మిస్తారు.

భవానీ ద్వీపంలో 3 ద్వీపాల అభివృద్ధి

విజయవాడ కృష్ణా నదిలో ఉన్న ఏడు ప్రధాన ద్వీపాల్లో మొదటి విడతలో భవానీ ద్వీపంతోపాటు, 515 ఎకరాల్లో విస్తరించి ఉన్న మరో 3 ద్వీపాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కడప జిల్లా గండికోట వద్ద పెన్నానదిపై తీగల వంతెన (రోప్-వే) ఏర్పాటు చేసి, ప్యాసింజర్ కేబుల్ కార్ షికారుకు ఏర్పాట్లు చేస్తారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం బీచ్ వద్ద రూ.200 కోట్లతో 500 ఉద్యోగాలను కల్పించేలా లగ్జరీ బీచ్ రిసార్ట్ ఏర్పాటు చేస్తారు.

వాట్సాప్ బీటా యూజర్లకు శుభవార్త

● అందుబాటులోకి వాట్సాప్ పేమెంట్స్ ఫీచర్ ● గ్యాలరీ, వీడియో, డాక్యుమెంట్లు ఆప్షన్లతో పాటు పేమెంట్స్ ఫీచర్ ● యుపిఐతో కనెక్ట్ అయిన బ్యాంకు అకౌంట్‌ను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది ● ఐఒఎస్‌లోని 2.18.21 బీటా వెర్షన్, ఆండ్రాయిడ్‌లోని 2.18.41 బీటా వెర్షన్



న్యూఢిల్లీ : వాట్సాప్‌కు చెందిన బీటా వెర్షన్ యాప్‌ను ఆండ్రాయిడ్, ఐఒఎస్ ప్లాట్‌ఫామ్‌లపై వాడే యూజర్లకు వాట్సాప్ పేమెంట్స్ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. గ్యాలరీ, వీడియో, డాక్యుమెంట్లు వంటి ఇతర ఆప్షన్లతో పాటు ఈ పేమెంట్స్ ఆప్షన్ కూడా ఉంటుంది. ఈ ఫీచర్ ద్వారా సదరు అకౌంట్ నుంచి నేరుగా నగదును బదలీ చేసుకోవచ్చు. దీని కోసం యూజర్లు యుపిఐ యాప్ ద్వారా లేదా సంబంధిత బ్యాంకు వెబ్‌సైట్ ద్వారా యుపిఐ అకౌంట్‌ను క్రియేట్ చేసుకోవాలి. దీనితో సదరు అకౌంట్ నుంచి నేరుగా నగదును బదలీ చేసుకోవచ్చు. అయితే, నగదు పంపేవారికి, స్వీకరించే వారికి ఇద్దరికీ కచ్చితంగా వాట్సాప్ ఆఫర్ చేసే పేమెంట్స్ ఫీచర్ ఉండాలి. ప్రస్తుతం ఈ పేమెంట్స్ ఫీచర్ ఐఒఎస్‌లోని 2.18.21 బీటా వెర్షన్, ఆండ్రాయిడ్‌లోని 2.18.41 బీటా వెర్షన్ వారికి అందుబాటులో ఉంది. ప్రస్తుతం వాట్సాప్‌కు ఇండియా లో 200 మిలియన్‌ల మంది యూజర్‌లు ఉండగా, గూగుల్ టెజ్‌కు 12 మిలియన్‌ల మంది యూజర్‌లు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం కనిపించలేదా?

నిజామాబాద్ ఎంపీ కవితను ప్రశ్నించిన కాంగ్రెస్ నేత వీహెచ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరిన నిజామాబాద్ ఎంపీ కవితకు, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం కనబడలేదా? అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతారావు ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైకోర్టు విభజన వంటి అంశాలు కవితకు గుర్తు రాకపోవడం శోచనీయమన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. హైదరాబాద్‌ను సీఎం కేసీఆర్ సర్వనాశనం చేస్తున్నారని హనుమంతరావు ఆరోపించారు. గ్రేటర్ ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్న పన్నులను మిషన్‌భగీరథకు ఖర్చు చేస్తున్నారు. గ్రేటర్‌లో కార్పొరేటర్లు ఉత్సవ విగ్రహాలుగా మారారని అన్నారు. రోడ్లు వేయడంలేదని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్న ఆయన, మౌలిక వసతులు కల్పించడానికి చేస్తున్న కృషి శూన్యమని విమర్శించారు. నగర అభివృద్ధికి టీఆర్ఎస్ సర్కార్ చేసిందేమీ లేకపోగా, మంత్రి కేటీఆర్ గుత్తాధిపత్యం చలాయిస్తున్నారని మండిపడ్డారు.

బీసీ, ఎస్సీస్టడీ సర్కిళ్లలో అవినీతి

బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లలో అవినీతి జరుగుతుందని వీహెచ్ అన్నారు. బోధన సిబ్బంది కూడా సరిగ్గా లేకుండా పోయారన్నారు. ఒకటిన్నర సంవత్సరానికి కోర్సు అయిపోయిందని డైరెక్టర్ చెబుతున్నారన్న ఆయన, విద్యార్థులకు దన్నుగా కాంగ్రెస్ ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న వీహెచ్, ఎక్కడా అన్యాయం జరిగితే అక్కడ నేనుంటానని చెప్పారు. ఈసందర్భంగా బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల విద్యార్థులు వీహెచ్‌ను సన్మానించారు.

దేశం మొత్తం బాసర ఐఐటీ వైపు చూసేలా అభివృద్ధి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశం మొత్తం బాసర ఐఐఐటి వైపు చూసేలా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ' బాసర ఐఐఐటి విద్యార్థులంటే ఏ కంపెనీ అయినా తీసుకునేలా వీరిని తీర్చిదిద్దాలి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యను పటిష్ఠం చేస్తున్నామని, ప్రమాణాలు పెంచుతున్నామని చెప్పారు. బాసర ఐఐఐటి బాసర స్నాతకోత్సవంలో విద్యార్థులకు కడియం శ్రీహరి డిగ్రీలు అందించారు. గతంలో 1,75,000 ఇంజనీరింగ్ సీట్లను 98,000 తీసుకొచ్చామని, ఇంకా నియంత్రిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 50వేల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే చాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తెలంగాణ విద్యార్థి పోటీపడేలా విద్యను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. గతంలో విద్యను భ్రష్టు పట్టించిన వారు నేడు మాపై విమర్శలు చేయడం శోచనీయమని విమర్శించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విద్యను భ్రష్టు పట్టించారని అనడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని ఒక వైపు అంటూ మరోవైపు అడ్డుకునే ప్రయత్నం చేసే నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలనే ప్రొఫెసర్ కోదండ రామ్ టిఆర్టిని వాయిదా వేయాలనే కోర్టుకు వెళ్తున్నట్లు సమాచారం ఉందన్నారు. టిఆర్టి కి పరీక్షల షెడ్యూల్ ఇచ్చామని, ఎన్. సి.టీ. ఈ నిబంధనల మేరకు పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. కొంతమంది రాజకీయ కారణాల తో నిర్వహించే ఈ సభల వల్ల పరీక్షలు వాయిదా వేయమని, నిర్ణయించినట్లు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఎవరి మాటలు విని మోసపోకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు. 2008లో బాసర ఐఐఐటి ప్రారంభమైతే...రెగ్యులర్ నియామకాలు చేయలేదన్నారు. యూనివర్శిటీలను బలోపేతం చేసేందుకు 2017-18 బడ్జెట్ లో సిఎం కేసిఆర్ 420 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. యూనివర్శిటీల్లో 1551 పోస్టులు భర్తీ చేసేందుకు అనుమతినిచ్చారు...బాసర ఐఐఐటిలో వంద పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ఐఐఐటి బాసరకు వచ్చే విద్యార్థులు అత్యంత ప్రతిభావంతులు...వీరిని కొద్దిగా మెరుగుపరిస్తే అత్యున్నత స్థాయికి వెళ్తారన్నారు. నిబంధనల మేరకే యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు ఉంటాయన్నారు. అధ్యాపకుల భర్తీపై పూర్తి స్వేచ్ఛ యూనివర్సిటీలకు ఉందన్నారు. వాటి స్వయం ప్రతిపత్తి లో మేము జోక్యం చేసుకోమని తెలిపారు. త్వరలోనే ఐఐఐటి బాసరకు పూర్తి స్థాయి వీసీ ని నియమిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న బాసర ఐఐఐటి వీసీ ఏ. అశోక్ , ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ఉదయ్ బి. దేశాయ్, యూనివర్శిటీ అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరికొన్ని రోజులు మార్కెట్లకు ఊగిసలాటే

సెబీ అంచనా



న్యూఢిల్లీ : బడ్జెట్.. ఆంబిఐ సమీక్ష.. అమెరికా మార్కెట్ల పతనం ఇలా వరుస పరిణామాలతో గత కొన్ని రోజులుగా దేశీయ మార్కెట్లు అల్లకల్లోలంగా మారిన విషయం విదితమే. బడ్జెట్‌కు ముందు వరకు రికార్డుల జోరు కొనసాగించిన సూచీలు ఆ తరువాత భారీ నుంచి నష్టాలను మూటగట్టుకుంటూ వస్తున్నాయి. అయితే, ఈ నష్టాల పరంపర మరికొన్ని రోజులు ఉండవచ్చని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అభిప్రాయపడింది. అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా మరి కొద్ది రోజులు మార్కెట్లు ఊగిసలాడే అవకాశం ఉందని సెబీ చీఫ్ అజయ్ త్యాగి సూచించారు. అయితే, మదుపరులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. కాగా, దీర్ఘ కాల మూలధన పన్ను (ఎల్‌టిసిజి)పై వస్తున్న వార్తలపై కూడా త్యాగి స్పందించారు. ఇప్పటి వరకు ఎల్‌టిసిజి పన్నుకు వ్యతిరేకంగా మదుపరుల నుంచి ఎటువంటి ప్రతిపాదనలూ రాలేదని ఆయన చెప్పారు. మార్కెట్లపై ఎల్‌టిసిజి పన్ను ప్రభావం లేదన్నది మాత్రం పూర్తిగా నిజం కాదని త్యాగి అన్నారు. అయితే, ఎల్‌టిసిజి పన్ను వల్ల కూడా మార్కెట్లు కొంత నష్టపోయినట్లు, చాలా వరకు అంతర్జాతీయ మార్కెట్ల వల్లే కుదేలైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల రూ. లక్ష పైబడిన ఈక్విటీ లాభాలపై 10 శాతం ఎల్‌టిసిజి పన్నును విధిస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. ఈ ప్రభావం ఉండగానే అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. పర్యవసానంగా దేశీయ సూచీలు కూడా కుప్పకూలాయి. రోజుల వ్యవధిలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా కోల్పోయింది. లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైంది. శుక్రవారం ట్రేడింగ్‌లోనూ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే చవి చూశాయి.

ఫోర్టిస్ అంశాన్ని పరిశీలిస్తున్నాం: సెబీ

ఫోర్టిస్ హెల్త్‌కేర్ వివాదానికి సంబంధించిన విషయాన్ని పరిశీలిస్తున్నామని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వెల్లడించింది. ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్న సింగ్ సోదరులకు రూ. 500 కోట్లు రుణం ఇవ్వడంపై వివాదం నెలకొన్న సంగతి విదితమే. బోర్డు అనుమతి లేకుండా వారు రుణం తీసుకున్నారు. ఈ మేరకు సెబీ ఫోర్టిస్ అంశాన్ని పరిశీలిస్తోంది. శనివారం సెబీ బోర్డు మీటింగ్ అనంతరం సెబీ చైర్మన్ అజయ్ త్యాగి ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. సెబీ ఈ విషయంపై శుక్రవారం ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు నోటీసులు కూడా పంపించింది. ఈ నోటీసులపై ఫోర్టిస్ స్పందిస్తూ, స్వల్ప కాలిక పెట్టుబడుల కింద ఏడాది క్రితం ఈ రుణాన్ని ఇచ్చామని, పూర్తి హామీతో షరతులకు లోబడే ఇచ్చామని వెల్లడించింది. ముందుగా నిర్దేశించుకున్న గడువు ప్రకారం వారు రుణం తీర్చేస్తారని తాము విశ్వసిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ వివాదంతో ఇప్పటికే సింగ్ సోదరులు మల్వీందర్ మోహన్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్ కంపెనీ బోర్డుకు రాజీనామా చేశారు. అయితే, రుణం తిరిగి చెల్లించడం లేదా పద్దులో చూపించేంత వరకు రెండవ త్రైమాసిక ఫలితాల ఆడిట్ పత్రాలపై సంతకం చేయబోమని డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

కొత్త రకం వరి వంగడాలు సృష్టించిన రైతు

● తల్లిదండ్రుల పేరు పెట్టిన వైనం ● సరికొత్త వరి వంగడాలను సృష్టించిన కన్నడ రైతు ● ఈ వంగడాలకు తన తల్లిదండ్రుల పేర్లు కలిసి వచ్చేలా నామకరణం ● ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి



బెంగళూరు : కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన ఔత్సాహిక రైతు ఒకరు సరికొత్త వంగడాలను సృష్టించారు. [illegible] ఆ రైతు ఈ వంగడాలను తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల పేరు పెట్టి రుణం తీర్చుకున్నారు. దాని వివరాల్లోకి వెళితే, మండ్య జిల్లా శివళ్లికి చెందిన రైతు బోరేగౌడ సేంద్రియ సాగును అనుసరించే రైతు. ఆయన రాజముడి రకం, సోనా మసూరి వరి వంగడాలను సంకరం చేయడం ద్వారా సరికొత్త వరి వంగడాన్ని సృష్టించారు. ఈ సరికొత్త వంగడానికి, తండ్రి సిద్ధేగౌడ, తల్లి సణ్ణమ్మ పేర్లు కలిసి వచ్చేలా సిద్ధ- సణ్ణ వరి రకం అని ఆయన పేరు పెట్టారు. ఈ వంగడం ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల ధాన్యం దిగుబడిని ఇస్తుందని, విత్తనం చల్లిన రోజు నుంచి లెక్క వేస్తే 135 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని ఆయన తెలిపారు. ఈ వంగడం పలు రకాల తెగుళ్లను తట్టుకుని దిగుబడి ఇస్తుందని ఆయన వెల్లడించారు. ఈ రకం వంగడాన్ని సాగు చేయడం ప్రారంభించిన తరువాత వచ్చిన దిగుబడి చూసి తన చుట్టుపక్కల రైతులు కూడా సాగు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ వంగడాన్ని మార్కెటింగ్ చేసేందుకు 'సహజ సమృద్ధ' అనే సంస్థ ముందుకు వచ్చిందని బోరేగౌడ తెలిపారు.

సిఎం చంద్రబాబు నివాసం వద్ద న్యాయవాదుల ఆందోళన

అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద న్యాయవాదులు ఆందోళనకు దిగారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసి తీరవలసిందేనని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు ఆందోళనకు చేపట్టారు. శనివారం సాయంత్రం గుంటూరు జిల్లా ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద వారు నిరసన తెలిపారు. చంద్రబాబును కలుసుకుని వినతిపత్రం ఇచ్చేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిరసనకు భద్రత కారణాల దృష్ట్యా పోలీసులు అనుమతించకపోవడంతో వారు అక్కడి నుంచి సమీపంలో ఉన్న రహదారిపైకి గుంపులుగా చేరుకొని బైఠాయించారు. 'హైకోర్టు అమరావతిలో వద్దు. రాయలసీమలోనే ఏర్పాటు చేయాలి' అని ప్లకార్డులు పట్టుకుని వారు తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాది ఒకరు మాట్లాడుతూ, 'ఆంధ్ర ప్రదేశ్ అంటే ఒక్క అమరావతేనా? ఎపి అంటే గుంటూరేనా? ఎపి అంటే విజయవాడేనా?. రాయలసీమ కూడా ఆంధ్ర ప్రదేశ్‌లో భాగమేనన్న విషయాన్ని మరిచారని సీమ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇది సీమ వాసుల హక్కు. ఈ రోజు మేము ఎవరూ గళం విప్పకుండా హైకోర్టును సీమలో ఏర్పాటు చేయవలసిన అవసరం పాలకులకు ఉంది' అని అన్నారు. 'మీరు రాయలసీమ వాసులే కదా చంద్రబాబు గారు! చిత్తూరులో హైకోర్టు ఏర్పాటు చేసుకోండి. దీనికి మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. రాయలసీమలో కచ్చితంగా హైకోర్టు పెట్టి తీరవలసిందే.



ప్రత్యేక హోదా సాధనకు


పవన్ నాయకత్వం సరిపోదు

- బలిజల ఆత్మీయ కలయికలో ముద్రగడ
- బాబుకు ఎలా గుణపాఠం చెప్పాలో మాకు తెలుసు
- కేంద్ర మంత్రులతో రాజీనామాలు చేయించాలి
- బీసీ సర్టిఫికెట్ పొందినపుడే కాపులకు పండుగ
- కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

తిరుపతి, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనకు పవన్ కల్యాణ్ నాయకత్వం సరిపోదని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. శనివారం తిరుపతిలో జరిగిన బలిజల ఆత్మీయ కలయికలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతి అశోక్ ప్యాలెస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ఎంపీలు, మంత్రులతో సీఎం రాజీనామా చేయించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ఎంపీలు, కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించి ప్రత్యేక హోదా సాధనకు పోరాడాలని సూచించారు. ఇందుకోసం తమ జాతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ముద్రగడ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బీసీ సర్టిఫికేట్ పొందినప్పుడే కాపులకు పండుగని అన్నారు. చంద్రబాబు జాప్యం వహించడం వల్లే కాపులంతా రోడ్లపైకి వచ్చారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి త్రికరణ శుద్ధితో అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో జరగబోయే నియామకాల్లో బీసీ ఎఫ్ ద్వారా తమ జాతికి న్యాయం చేయాలని ముద్రగడ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే ఎలా ఆకలి తీర్చుకోవాలో తమకు తెలుసునన్నారు. సరైన సమయంలో ఉద్యమించి ముఖ్యమంత్రికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాపులను మోసం చేయాలని భావిస్తే తెలుగుదేశం ప్రభుత్వాన్ని, చంద్రబాబును ఎలా మోసం చేయాలో నిర్ణయిస్తామన్నారు. కాపుల రిజర్వేషన్ల విషయంలో సీఎం వెనకడుగు వేయరని భావిస్తున్నామని ముద్రగడ తెలిపారు.



అరుణ్‌జైట్లీతో సుజనా, రమేష్ భేటీ



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో కేంద్రమంత్రి సుజనా చౌదరి, ఎంపీ సీఎం రమేశ్ శనివారం భేటీ అయ్యారు. శుక్రవారం రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం చర్యలు త్వరితగతిన చేపట్టాలని ఆయనను కోరారు. రెండురోజుల పాటు సెలవులు ఉన్నందువల్ల సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినటివంటి హామీలు, నిన్నటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వాటన్నిటినీ పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఆయా శాఖల అధికారులతో చర్చించి చర్యలు ముమ్మరం చేద్దామని జైట్లీ వారితో చెప్పినట్టు తెలుస్తోంది. మరోవైపు కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి మేకన్‌హౌస్ రూపొందించిన నివేదిక 12న రాబోతోందని, ఆ నివేదిక అందగానే అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పినట్టు సమాచారం.

విభజన హామీలపై సంయుక్త నిజనిర్ధారణ కమిటీ



హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ విభజన హామీలకు సంబంధించి సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, విద్యావేత్తలతో పాటు సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు, తదితరులతో జేఎఫ్‌సీని ఏర్పాటు చేయాలని ట్విటర్‌లో తెలిపారు. విభజన హామీల అమలు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదం నెలకొన్న అంశాలపై విస్తృతంగా చర్చించాలని పవన్ పేర్కొన్నారు.

నవ్యాంధ్రలో 'స్టార్' పంచాయతీలు

- అగ్రస్థానం చేరుకోవడానికి జిల్లా యాక్షన్ ప్లాన్
- ఇప్పటికే 8 స్టార్ రేటింగ్ పాయింట్ల సాధన
- డిసెంబర్ 31 తుది గడువు

(వెలగపూడి-సూర్య ప్రధాన ప్రతినిధి) : అభివృద్ధికి పట్టుగొమ్మలు పంచాయతీలే. సర్వతోముఖాభివృద్ధికి గీటురాయిగా నిలిచే ప్రభుత్వ రేటింగ్‌లో టెన్ స్టార్ సాధనకు జిల్లా పోటీ పడుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన రేటింగ్‌లో జిల్లా ఇప్పటికి ఎనిమిది స్టార్లు సాధించి మిగిలిన జిల్లాల కంటే ముందంజలో నిలిచింది. ప్రస్తుతం మిగిలిన రెండు స్టార్ల రేటింగ్‌ను సాధించటానికి కీలక అడుగులు వేస్తోంది. అన్ని అంశాల్లోనూ జిల్లాను అగ్ర పథంలో నిలువుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం టెన్ స్టార్ రేటింగ్‌లో కూడా జిల్లాను అగ్రస్థానంలో నిలపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిని ప్రగతి పథంలో పయనింపజేయటానికి ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది . వీటి సాధనకు జిల్లా ఇప్పుడు పోటీ పడుతోంది. ఇప్పటికే ఎనిమిది స్టార్ల రేటింగ్‌ను సాధించింది. మిగిలిన రెండింటి కోసం అడుగులు వేస్తోంది. అన్ని అంశాల్లోనూ జిల్లాను అగ్ర పథంలో నిలువుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం 10 స్టార్ రేటింగ్‌లో కూడా అగ్రభాగాన నిలపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు గాను డిసెంబరు 31 వ తేదీని గడువుగా నిర్ణయించుకున్నారు. జిల్లాలో అమలు జరుగుతున్న స్టార్ రేటింగ్ వివరాల్లోకి వెళితే.. 970 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన ఈ పది అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. అవి. 1. వ్యక్తిగత మరుగుదొడ్లు నూరు శాతం పూర్తి చేయటం, 2. ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ , 3. ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్, 4. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరివ్వడం 5. గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ 6. రోడ్ల అభివఎద్ధి 7. ప్రతి ఇంటికీ ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్‌తో అనుసంధానం 8. ప్రతి ఇంటికీ రూ. 10 వేల ఆదాయం కల్పించటం



9. పాఠశాలల్లో మౌలిక సదు పాయాల కల్పన 10. ఆరోగ్యం - పౌష్టి కాహారం అందించటం వంటి అంశాలను రేటింగ్ ఇవ్వడానికి పరిగణనలోకి తీసుకుంటారు. ప్రతి అంశంలోనూ ప్రభుత్వం గ్రేడింగ్ పాయింట్స్ ఇస్తుంది. ప్రతి రేటింగ్ పాయింట్‌లో కూడా నూరు శాతం లక్ష్యం సాధించాల్సి ఉంటుంది. ఇది సాధిస్తేనే జిల్లాకు ఆ కేటగిరీలో స్టార్ రేటింగ్ వస్తుంది. ఇలా ప్రతి పంచాయతీలో పది స్టార్ రేటింగ్స్‌ను సాధించాల్సి ఉంటుంది. ఒక పంచాయితీ అన్ని కేటగిరిల్లో స్టార్ రేటింగ్ సాధిస్తే ఆ పంచాయతీని ప్లాటినం పంచాయితీ గా ప్రకటిస్తారు. పది అంశాలలో 75 - 100 శాతం సాధిస్తే గోల్డ్ పంచాయతీ గా ప్రకటిస్తారు. అలాగే 50 నుంచి 75 శాతం సాధిస్తే సిల్వర్ పంచా యితీ, యాభై లోపు శాతం ఫలితం సాధిస్తే రజిత పంచాయితీ గా ప్రకటిస్తారు. స్టార్ రేటింగ్‌లో జిల్లాను అగ్ర పథంలో నిలపటానికి కలెక్టర్ లక్ష్మీకాంతం డిసెంబరు 31వ తేదీని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 10 స్టార్ రేటింగ్ సాధనలో భాగంగా జిల్లా ఇప్పటికే పరుగులు పెడుతోంది. ఓవరాల్‌గా జిల్లా ఎనిమిది స్టార్ రేటింగ్‌లను సాధించింది. ఆయా పంచాయతీలలో ఆర్థికంగా దిగజారిన కుటుంబాలకు నెలకు రూ. 10 వేల ఆదాయం, ఫైబర్ గ్రిడ్ కనెక్షన్స్ అన్న రెండు అంశాలను జిల్లా సాధించాల్సి ఉంది. మిగిలిన అంశాల్లో ఇప్పటికే దాదాపు నూరు శాతం సాధించి నట్లుగా భావించాల్సి ఉంది. వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి జిల్లాను ఇప్పటికే నూరు శాతం ఓడీఎఫ్‌గా ప్రకటిం చారు. ఇంటింటికీ గ్యాస్ కేటగిరీలో స్టార్ రేటింగ్ ఇచ్చారు. ఇంటింటికీ విద్యుత్ కనెక్షన్ల విషయంలో జిల్లా నూరు శాతం సాధన దిశగా ఉంది. ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా నీటిని అందించటానికి చర్యలు తీసు కుంటోంది. దీని కోసం జిల్లాలో రూ. 850 కోట్లతో రక్షిత మంచినీటి పథకానికి శ్రీకారం చుడుతోంది. ఆర్థికంగా అట్టడుగున ఉన్న ప్రతి ఇంటికీ నెలకు రూ. 10 వేల ఆదాయం సమకూర్చడానికి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అభ్యున్నతి ద్వారా దీనిని అధిగమించేందుకు చర్యలు చేపడు తోంది. జిల్లా వ్యాప్తంగా 2.12 లక్షల మందిని గుర్తించారు. వీరికి రూ. 10 వేల కంటే ఎక్కువ ఆదాయం కల్పించటానికి ఉపాధి మార్గాలను కల్పించనుంది. మనకోడి లో భాగంగా రూ. 20 వేల రుణాలను అందిం చటం, బ్యాంకు లింకేజీ ద్వారా నెట్ సెంటర్లు, బ్యూటీ పార్లర్లు, చిన్నపాటి బిజినెస్ సెంటర్స్ నిర్వహణకు రుణాలు మంజూరు చేస్తారు. ముద్ర, స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. జిల్లాలో ఆర్థికంగా ఇబ్బందులు పడే దివ్యాంగులను కూడా జిల్లా యంత్రాంగం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా 1.38 లక్షల దివ్యాంగులున్నట్టు గుర్తించింది. డిసెంబర్ మూడో తేదీన దివ్యాంగుల దినోత్సవం జరుగుతుంది కనుక ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లబ్ధి కల్పించటానికి చేయూత నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించింది. గర్భిణులకు పౌష్టికాహారం అందించటం, రక్తహీనత నిర్మూలించటానికి ట్యాబ్లెట్స్ ఇవ్వడం వంటివి చేస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పైన పేర్కొన్న కార్యక్రమాలపై ప్రత్యేకంగా కలెక్టర్ దృష్టి సారించనున్నారు. ప్రతి వారం వీటికి సంబంధించి సమీక్షలు నిర్వహించనున్నారు. పంచాయతీల వారీగా చాలా దగ్గరగా పరిశీలిస్తారు. ఎప్పటి కప్పుడు అధికారులకు సూచనలు చేస్తారు.

మాట తప్పితే పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం : కేశినేని నాని



అమరావతి, సూర్య బ్యూరో : కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాటలు, హామీలను నమ్మేది లేదని టీడీపీ ఎంపీ కేశినేని నాని అన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని, చెప్పిన మాటలను చేతల్లో చేసి చూపించాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం మాట తప్పితే మార్చి 5 నుంచి పార్లమెంట్ ఉభయసభలను స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రత్యేక హోదా విషయ ంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు తమ వైఖరి ఉంటుందని స్పష్టంచేశారు. పాత తరం బీజేపీ నేతలకు చంద్రబాబుపై గౌరవం, ఏపీపై సానుభూతి ఉందని అభిప్రాయపడ్డారు. మిత్రపక్షాలు కూడా బీజేపీ తీరును, ప్రధాని నరేంద్ర మోడీ వైఖరిని తప్పుపడుతున్నాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని జాతీయ పార్టీలు సైతం అంగీకరి స్తున్నాయన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా జేఏసీ, ప్రతిపక్షాల అవసరమే లేదని నాని అభిప్రాయపడ్డారు.

సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు నష్టం



విజయవాడ, సూర్య బ్యూరో : సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎన్జీవోలు శనివారం మహాధర్నాకు దిగారు. ఈ ఆందోళనలో పాల్గొన్న అశోక్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు నష్టం కలుగుతుందన్నారు. ఈ అంశం కేంద్రం పరిధిలోనిదైనా రాష్ట్రం కూడా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల ఉద్యోగులతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని అశోక్‌బాబు స్పష్టం చేశారు. మహాధర్నాలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరంలాంటిది



చిట్యాల, మేజర్‌న్యూస్ : ఆర్థికంగా వెనకబడిన పేదల కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ పథకం వరం లాంటిదని శాసనసభాపతి సిరికొండ మధుసూధన చారి అన్నారు. శనివారం జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 71మంది లబ్దిదారలకు కళ్యాణిలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదల కోసం పైసల్ ఖర్చు చేయలేదని, తెలంగాణా రాష్ట్రం ఏర్పాడినాక మనస్సు ఉన్న మహారాజు సీఎం కేసిఆర్ పేదలకు కోసం పైసలు ఖర్చుచేస్తూ వారి చేతికే ప్రభుత్వ సొమ్మును అందజేయడం జరిగిందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో మారు మూల ప్రాంతాల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తు అభివృద్ధి దిశగా కృషి చేస్తుంటే కొంత మంది నియోజక వర్గంలో తిరుగుతు అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పరకాల మార్కెట్ కమిటి చైర్మెన్ కుంభం రవిందర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మెన్ కర్రె అశోక్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ కిరణ్ కుమార్, టీఆర్ఎస్ నాయకులు అరపెల్లి మల్లయ్య, ఎరుకొండ గణపతి, మన్నెం శ్రీనివాసరావు, జన్నె యుగేందర్, మడికొండ రవిందర్‌రావు, పిట్టల సుధాకర్,కోడెల రాజమల్లు, పుషమ్మ, ఈర్ల మల్లక్క, ఉప్పుల కిరణ్, గుర్రపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌లో పడ్డా.. హెల్మెట్ కాపాడింది

సచివాలయం వద్ద ఘటన



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : నగరంలోని సచివాలయం ఎదుట ఓ ద్విచక్ర వాహనదారుడు భూగర్భ పైప్‌లైన్ కోసం తీసిన పెద్ద గోతిలో పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. భూగర్భ పైప్ లైన్ కోసం సచివాలయం ఎదుట అధికారులు ఓ గుంతను తవ్వి.... దాన్ని అలాగే వదిలిపెట్టారు. దాని చుట్టుపక్కల ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఆ మార్గంలో వస్తున్న ఓ ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి వాహనంతో సహా అందులో పడిపోయాడు. దాదాపు 20 అడుగుల లోతు గోతిలో పడటంతో ఆ యువకుడికి ఏమి కనిపించలేదు. ఏమి జరిగిందో కూడా తెలియని పరిస్థితి. లోపలి నుంచి కేకలు వేశాడు. అటుగా ఉదయపు నడకకు వచ్చిన కొంత మంది అరుపులు విని ఆ యువకుడిని బయటకు తీశారు. అధికారులు నిర్లక్ష్యంగా గుంత తవ్వి వదిలేయడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు. యువకుడు హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పింది. ఎక్కన గుంతలను వెంటనే పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐఐటీల్లో మరో 1000 సీట్లు

- ప్రతిపాదించిన జేఏబీ
- తెలుగు విద్యార్థులకు ప్రయోజనం
- అమ్మాయిలకు 14 శాతం సీట్లు
- సౌకర్యాలపై ఐఐటీల ఆందోళన

హైదరాబాద్, సూర్య బ్యూరో : ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు శుభవార్త. ఇంజనీరింగ్ విద్యకు అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్లు పెరగనున్నాయి. సీట్ల పెంపు దిశగా సంయుక్త ప్రవేశాల మండలి(జేఏబీ) ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విషయంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కూడా సానుకూలంగా ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీల్లో కనీసం 1000 సీట్లు పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఐఐటీల్లో చేరేలా విద్యార్థినులను ప్రోత్సహించడానికి వారికోసం ప్రత్యేకంగా 14 శాతం సీట్లను కేటాయించనున్నారు. ప్రస్తుతం ఉన్న సీట్లలో కోత వేయకుండా అదనంగా (సూపర్ న్యూమరరీ) అమ్మాయిలకు సీట్లను కేటాయించాలని జేఏబీ కోరుతోంది. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల నుంచి గత ఏడాది దాదాపు 3000 మంది విద్యార్థులు అర్హత సాధించారు. మొత్తం ఉత్తీర్ణుల్లో తెలుగు విద్యార్థులు 10 శాతంపైనే ఉన్నారు. కామన్ మెరిట్‌లిస్ట్‌లో చోటు సాధించిన విద్యార్థుల్లోనూ తెలుగువారే ఎక్కువగా ఉన్నారు. కాబట్టి సీట్ల సంఖ్య పెరిగితే మన విద్యార్థులే ఎక్కువగా లబ్ధి పొందుతారు.

అడ్వాన్స్‌డ్‌కు మరో 4000 మంది

ఐఐటీల్లో సీట్ల సంఖ్య పెరిగితే మరింత మంది విద్యార్థులను జేఈఈ మెయిన్ నుంచి అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మరో 4000 మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసే అవకాశం కల్పించనున్నట్టు జేఏబీ ఇప్పటికే ప్రకటించింది. అంటే జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణులైన టాప్ 2.4 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసే అవకాశం ఉంటుంది. సీట్ల సంఖ్య పెంపును దృష్టిలో ఉంచుకొనే జేఏబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఐఐటీలు కూడా ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్లు పెంచడానికి ఎలాంటి వ్యతిరేకత చూపించడం లేదు. కాకపోతే సౌకర్యాలను మెరుగుపరిస్తే నాణ్యమైన విద్యను అందించవచ్చని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. పెరిగే సీట్లకు అనుగుణంగా తరగతి గదులు, వసతి సౌకర్యాలను పెంచాలని ప్రతిపాదిస్తున్నాయి. గత ఏడాది ఐఐటీ బాంబే బి.ఎస్. ఎకనామిక్స్ కోర్సును ప్రారంభించింది. ఇక్కడ ఇప్పటికే వివిధ కోర్సుల్లో 10 వేలకుపైగా విద్యార్థులు ఉన్నారు. వసతి సౌకర్యాలు మాత్రం 8 వేల మందికే ఉన్నాయి. దీనివల్ల హాస్టళ్లు కిక్కిరిసిపోయే పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో రాజకీయ జెండాలు ఎగరకూడదు



విజయవాడ, సూర్య బ్యూరో : కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా యువత నూతన రాజకీయ వ్యవస్థ నిర్మించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, అమ్మ కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. ఆయన విజయవాడలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏ రాజకీయ పార్టీ జెండా ఎగురకూడదని, కేవలం రైతు ఔన్నత్యాన్ని చాటే జెండాలే ఎగరాలని అన్నారు. దీనికి సంబంధించి త్వరలో రైతు జెండా రూపకల్పన చేస్తామని కొండవీటి జ్యోతిర్మయి తెలిపారు.

రైతుల కోసం దేనికైనా సిద్ధం

ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు, సూర్య బ్యూరో : రైతుల శ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని, వారి కోసం ఏం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నాయుడుపేట మండలం ద్వారకాపురంలో శనివారం ఆయన పొలాలను పరిశీలించారు. ఇక్కడి రైతులకు మరోసారి సాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల కారణంగా సాగునీటి పారుదలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఊరుకోబోమన్నారు. మరో వారంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మామిడికాలువపై 8 చెక్ డ్యాంలు నిర్మించబోతున్నామని చెప్పారు. మొదట ద్వారకాపురంలో మంత్రికి ఘనస్వాగతం లభించింది.

అవగాహన లేకుండా మాట్లాడటం తగదు...



సాగునీటి వ్యవస్థపై అవగాహన లేకుండా ఏదేదో మాట్లాడటం ప్రతిపక్ష నేతకు తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి గారు అన్నా రు. ఓజిలి మండలం అత్తివరం చెరువు పరిశీలన, గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్న అనం తరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం అవాస్తవాలు మాట్లాడటం తగదని హితవు పలికారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యుద్ధప్రాతిపదికన జిల్లాలో చెరువులు, కాలువలు అభివృద్ధి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. జిల్లా వాసుల వరప్రదాయిని అయిన తెలుగుగంగ ప్రాజెక్టు పేరు చెబితేనే అన్న ఎన్టీఆర్, తెలుగుదేశం పార్టీ గుర్తుకు వస్తాయనే విషయం ప్రతిపక్ష నేత తెలుసుకోవాలన్నారు.

అన్ని స్కూళ్లలో తెలుగు తప్పనిసరిపై త్వరలో ఆర్డినెన్స్

హైదరాబాద్ : తెలుగు బోధనను తప్పనిసరి చేస్తూ త్వరలో ఆర్డినెన్స్ తీసుకురానున్నారు. పాఠశాల విద్యలో తెలుగు లాంగ్వేజ్ తప్పనిసరిపై కొత్త చట్టాన్ని చేయనున్నారు. న్యాయ శాఖ పరిశీలనకు ఆర్డినెన్స్ ముసాయిదా, త్వరలో గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్సు జారీ చేస్తారు. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ స్కూళ్లతో సహా అన్ని ఇంటర్నేషనల్, సిబిఎస్‌సి పాటర్న్ స్కూళ్లలో సైతం తెలుగు తప్పనిసరి చేస్తూ విద్యా శాఖ చట్టం రూపొందించింది.



కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర రవాణా శాఖమంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్ జిల్లా మేజర్‌న్యూస్: కుల సంఘాల అబివృద్ధికి తెలం గాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖమంత్రి మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తులసి గార్డెన్‌లో జరిగిన వికారాబాద్ జిల్లా కుమ్మర సంఘం ప్రథమ వార్షికోత్సవ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల కుల వృత్తుల వారి సంక్షేమానికి నిధులు కేటాయి స్తుందని అన్నారు. మరుగున పడ్డ వృత్తులను వెలికితేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గొల్ల కురుమలు, గంగ పుత్రులు, నాయిబ్రహ్మణులు, కుమ్మ రల అభ్యున్నతికి తెలం గాణ ప్రభుత్వం నిధులు కేటాయించిందని అన్నారు. కుమ్మర భవనం కోసం సహకరిస్తామని మంత్రి తెలిపారు. కుమ్మర సంఘ క్యాలెండర్‌ను మంత్రి ఆవి ష్కరించారు.

ఈ కార్యక్రమంలో టీఎస్ఎంఐడీసీ చెర్మెన్‌పర్యాద క్రిష్ణమూర్తి ఎం బిసి చెర్మెన్ తాదూరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్, జిల్లా పశు గణాబివృద్ది చెర్మెన్‌గాజీపూర్ నారాయణరెడ్డి, యాలాల ఎంపిపి సాయన్న గౌడ్, తాండూర్ జడ్పీటిసి రవిగౌడ్,కుమ్మర సంఘం రాష్ట్ర అద్యక్షులు జయంత్‌రావు, గౌరవ అద్యక్షులు బిక్షపతి, కోశాదికారి బాలక్రిష్ణ, కార్యదర్శి లక్ష్మీ నారాయణ , యువజన విభాగం ఉపాధ్య క్షులు జితేందర్, రాష్ట్ర జర్నలిస్ట్ కన్వీనర్ వెంకట్‌కార్యదర్శి అంజయ్య, వికారాబాద్ జిల్లా అద్యక్షులు మారుతి,ప్రదాన కార్యదర్శి రఘు, 18 మండలాలకు చెందిన కుమ్మర సోదురులు తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే వేటే...

- టీఆర్ఎస్ నేతల తీరుపై అధినేత సీరియస్
- పార్టీకి చేటు కలిగించేలా వ్యవహరిస్తే చర్యలే
- పార్టీని ఇరుకున పెట్టే వారికి హెచ్చరికే
- ఉమ్మడి జిల్లాలో త్వరలోనే సమావేశాలు
- ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలకు సమాచారం



కరీంనగర్-సూర్యప్రతినిధి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ కార్యాకలాపాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దృష్టి సారించారు. సాధారణ ఎన్నికలు మరో ఏడాదిన్నరలో జరిగే అవకాశం ఉండగా.. ఇప్పుడిప్పుడేబయటపడుతున్న అంతర్గత విభేదాలపై ఆయన సీరియస్‌గా ఉన్నారు. పొరుగు జిల్లా నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్. భూపతిరెడ్డిని దాదాపుగా పార్టీ నుంచే తప్పించే పరిస్థితి ఏర్పడింది. ఆ జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కరీంనగర్ జడ్పిచైర్‌పర్సన్ తుల ఉమ కూడా ఆ నిర్ణయంలో కీలకంగా ఉన్నారు.


తెలంగాణ ఉద్యమం రాష్ట్రం ఏర్పాటు చారిత్రాత్మకమో ఈ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి కూడా అంతే ముఖ్యం. వీటిని దృష్టిలో పెట్టుకొని అన్ని స్థాయిలో పార్టీ కేడర్ ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేపట్టిన యజ్ఞంలో అంకిత భావంతో పాల్గోనాలి అంటు టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసిఆర్ పదే పదే ఉద్భోద చేస్తున్నారు. అయితే పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన, చేస్తున్న నాయకులు, కార్యకర్తలను పక్కన బెడితే అనుహ్యంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికై పదవులు అనుభవిస్తున్న వారే అసంతృప్తికి గురవుతుండడం అధినేతకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీని క్రమశిక్షణ పథంలో నడిపించేందుకు నడుం కట్టిన అధినేత నియమ నిబంధనలను ఉల్లఘించి నష్టం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకునేందుకు నియోజకవర్గాల వారిగా నివేదకలు తయారికి సిద్దం కావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మంథని నుంచి కోరుట్ల వరకు నియోజకవర్గాల వారిగా నివేదికలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 నియోజకవర్గాలో పార్టీ పరిస్థితి పై నివేదికలు సిద్దం అవుతున్నాయి. ఇది వరకే మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేల పనితీరుపై మూడు విడుతలుఉగా స్వయంగా సర్వే చేసిన ముఖ్యమంత్రి కేసిఆర్ వాస్తవ పరిస్థితులను వారి కళ్లకు కట్టారు. ప్రభుత్వ పథకాలు బాగానే అమలవుతున్నా ప్రజాప్రతినిధుల తీరుపై వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవాలని ఆయన మీటింగ్ పెట్టి మరీ సూచనలు చేశారు. తాజాగా ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని మంథని నియోజకవర్గం మొదలుకొని కోరుట్ల వరకు నియోజకవర్గాల వారీగా అన్ని కోణాలను సృశిస్తు సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఇంటలిజెన్స్‌ను ఆదేశించినట్లు తెలిసింది. టీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వంలో పదవులు అనుభవిస్తు సంతృప్తి అసంతృప్తి వాదుల జాబితాను కూడా అందులో పొందుపరచనున్నారని సమాచారం. పెద్దపల్లి జిల్లాలో ఎంపి, ఎమ్మెల్యేల మధ్యకొరవడిన సమన్వయం జగిత్యాల , కరీంనగర్ జిల్లాలో తారాస్థాయికి చేరుకుంటున్న గ్రూపుల పోరుపైన సీఎం ఆరా తీసినట్లు తెలుస్తోంది. గత నెల రోజుల కిందటే ఐటి, పురపాలకశాఖ మంత్రి కేటిఆర్ ఉమ్మడి జిల్లాలో 13 నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిదులు, ముఖ్యనేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారన్న ప్రచారం జరగ్గా, అది కాస్త వాయిదా పడింది. అయితే 13 నియోజకవర్గాలకు సంబంధించిన సమగ్ర నివేదికలు ఇంటలిజెన్స్ నుంచే అందెలోపే అసెంబ్లి నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కూడా ఆదేశించినట్లు తెలిసింది. మాజి మంత్రి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ ఉమ్మడి కరీంనగర్‌జిల్లా ఇన్‌చార్జి జనరల్ సెక్రటరి బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో త్వరలోనే సమావేశాలు నిర్వహిచేందుకు సన్నహాలు చేస్తున్నారు.

పార్టీకి చేటు కలిగిస్తే వేటే

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తోలి ముఖ్యమంత్రి గా భాధ్యతలు చేపట్టిన కేసిఆర్ అభివృద్ధి, సంక్షేమంపై సీరియస్‌గా కృషి చేస్తునే మరో వైపు పార్టీ సంస్థాగత వ్యవహారాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల నుంచే పాలన, పార్టీలపై నిశిత పరిశీలన చేస్తున్న ఆయన సాధారణ ఎన్నికలు మరో ఏడాదిన్నరలో రానున్న నేపథ్యంలో మరింత పకడ్బందిగా చర్యలు చేపట్టే దిశలో అడుగులు వేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు ఒక ఎత్తైతే. ఆపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో పార్టీ శ్రేణుల వ్యవహారశైలి కీలకమని అధినేత భావిస్తున్నారు. అందుకే ప్రతీసారి పార్టీఅధినేత ప్రజలే తమకు హైకమాండ్ అని, ఎవరి విమర్శలు తమకు అవసరం లేదని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పూర్వ కరీంనగర్ జిల్లాలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మధ్య ఏర్పడిన అంతరాలపై అధినేత సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో బలంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితిలో నేతల మధ్య విబేధాలు ముదిరి పాకాన పడుతుండడంతో పాటు ఉమ్మడి జిల్లాలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలపై ఆయన ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు చాపకింద నీరులా ఉన్న ఈ విభేదాలు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రోజు రోజుకు బహిర్గతమవుతున్నాయి. జిల్లాలో పార్టీ పటిష్టతను పక్కనబెట్టి నేతలు తలోదారి అన్నట్లు వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధుల మధ్యే పొసగక పోవడంతో తమను ఎవరు పట్టించుకుంటారని ఆవేదన కూడా వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశం అవుతుంది.

రిలయన్స్‌కు బ్రాండ్ అంబాసిడర్ ప్రధాని మోడీ

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల్లో సీతారాం ఏచూరి ధ్వజం



భీమవరం, మేజర్‌న్యూస్ : సి.పి.ఎం. 25వ రాష్ట్ర మహాసభలు భీమవరం అల్లూరు సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమ య్యాయి. 13 జిల్లాల నుండి హాజరైన 650మంది ప్రతినిధు లు సమక్షంలో సి.పి.ఎం. పతాకా విష్కరణతో మహాసభలు లాంచనంగా ప్రారంభమయ్యాయి. పార్టీ సినియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్. ఎస్) పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతినిధులు మార్క్సిజం వర్థిలాలి... సోషలిజం సాధిస్తాం... అంటూ నినాదాలతో హోరెత్తించారు. పతాకా విష్కరణలో పాల్గొన్న సి.పి.ఎం. జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ ఏచూరి అమరుల స్థూపానికి ఘనంగా నివాళులు అర్పించారు. మహాసభల నిర్వహణ కోసం పలు కమిటీలను రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రతి నిధుల ముందు ప్రతిపాదన చేయగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎఫ్.ఆర్. డి.ఎ. చట్టాన్ని తీసుకురావడం ద్వారా ప్రజల సొమ్మును కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడమే మోదీ ముందు ప్రధమ లక్ష్యంగా ఉందని ప్రజా పోరాటాల ద్వారా ఈ చట్టాన్ని అడ్డుకొని తీరాల్సిన అవసరం ఉందన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కుంభకోణాలు లేవంటూ గొప్పలు పోతున్న మోదీ సర్కార్ రాఫేల్ కుంభకోణంపై ఎందుకు అధికారిక ప్రకటన చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. డిఫెన్స్ మినిస్టర్ నిర్మలాసీతారామన్ ప్రధాని మాట లను పార్లమెంటులో చిలక పలుకులుగా వల్లివేస్తున్నారని అసలు విషయాన్ని దాటవేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను రద్దు చేయడం బిజెపికే చెల్లిందన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం రైతులకు రుణమాఫీ చేయ డానికి డబ్బులు లేవనడం హాస్యాస్మదంగా ఉందన్నారు. రాజకీయ పిరా యింపు లను ప్రోత్సహిస్తూ ఎం.ఎల్.ఎ.లను సంతలో పశువులు మాదిరి కొనుగోలు సంస్కృతిని చంద్రబాబు గత 4 ఏళ్ళలో బాగా వంటబట్టించు కున్నారని విమ ర్శించారు. కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, సి.పి.ఎం. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు డా॥ కె.హేమలత, ఆర్. అరుణ్‌కుమార్, ఎం.ఎ.గఫూర్, పాటూరి రామయ్య, వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గులాబి నేతల గుండెల్లో రైళ్లు

- నియోజకవర్గాలపై గులాబి బాస్ సర్వే
- జిల్లాలో అభ్యర్థుల టిక్కెట్లపై సందేహాలు
- తెలుగుదేశంతో పొత్తు ఉంటుందా?
- టిక్కెట్లపై ఆశలు అంతంతే
- పంచాయతీ , సొసైటీ ఎన్నికలే గీటు రాయి




ఖమ్మం, సూర్య బ్యూరో : ఎన్నికలు , టిక్కెట్లు ఎక్కడ విన్నా ఇదే గోల మరో సంవత్సర కాలంలో రాష్ట్ర శాసనసభకు, పార్లమెంట్‌కు ఎన్నికల జరగనున్న వేళ దీనికి ప్రాధాన్యత సంతరించుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే అనేక సర్వేలు చేయించగా మరో మారు సర్వే చేయించుతున్నారనే వార్తలు గులాబి నేతల గుండెల్లో రైళ్ళు పరుగెత్తేలా చేస్తున్నాయి. ప్రధానంగా ఎమ్మెల్యేల పార్ల మెంట్ సభ్యుల పనితీరు గెలిచే అవకాశాలపై సర్వే జరుగుతుందటంతో ఎవరి జాతకం ఏలా ఉంది. తమకు టిక్కెట్లు తిరిగి వస్తాయా? రావా?అనే సందేహలు కలుగుతున్నాయి. రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా టిఆర్‌యస్‌కు అనుకులంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నప్పటికి పోటి చేసే అభ్యర్దులపై ఆధారపడి ఫలితాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మార్చిలో పంచాయతీ ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహలు చేస్తుంది. ఆ తరువాత సొసైటీ ఎన్నికలు ఉంటాయి. ఈ రెండు ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో వచ్చే పంచాయతీలు, సొసైటీల ఫలితాలే గీటురాయిగా టిక్కెట్ల కేటాయింపులు ఉంటాయని తెలుస్తుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ , రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో 2014 ఎన్నికల్లో ఖమ్మం వైకాపా నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయం సాధించి అనంతరం టిఆర్‌యస్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఈసారి తిరిగి ఖమ్మం నుంచే పోటిచేస్తానని ఘంటా పథంగా చెబుతున్నారు. తాను టిఆర్‌యస్ పార్టీలో చేరేటప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు హామీ ఇచ్చారని ఢంకా భజా యిస్తున్నారు. ఒక వేళ ఇతర పార్టీలతో టిఆర్‌యస్ పొత్తులు పెట్టుకుంటే మాత్రం తిరిగి పొంగులేటి శ్రీనివారెడ్డి పోటిపై అనుమానాలు లేకపోలేదని పరిశీలకులు బావిస్తున్నారు. ఆయన కూడా పార్టీకోసం తమ నాయకుడు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ టిఆర్‌యస్‌తో కలిసి పోటిచేసే ఆవకాశాలను తొసిపుచ్చలేమనే అభిప్రాయాలున్నాయి. మోత్కుపల్లి నర్సింహలు ప్రకటన ఇందుకు బలం చేకూ ర్చింది. అదే జరిగితే జిల్లాలో రెండు నుంచి మూడు అసెంబ్లీ సీట్లను ఖమ్మం పార్లమెంట్‌ను తెలుగుదేశం కోరే ఆవకాశం ఉంది. అసెంబ్లీ సీట్లలో సత్తుపల్లి , కొత్తగూడెం, భద్రాచలం సీట్లపై తెలుగుదేశం ఆశలు పెట్టుకుంది. ఇది ఎంత వరకు సక్సెస్ అవుతుంది. నిజంగా తెలుగుదేశంతో పొత్తును టిఆర్‌యస్ అంగీకరిస్తుందా? అనేది ఇప్పడే చెప్పలేమని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇక జిల్లాలో ఉన్న మిగతా సీట్లలో రెండు మూడు నియోజక వర్గాల్లో అభ్యర్థులపై వ్యతిరేకత ఉందని వారిని తప్పని సరిగా మార్చే అవకా శాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే జరిగితే కొంత అలజడికి దారి తీయవచ్చు. జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నుంచి తిరిగి ఆయన పోటి దాదాపు ఖాయం అయినప్పటికి ఆయనకు జిల్లా వ్యాపితం గా ఉన్న సంబంధాలు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నందున పార్లమెంట్‌కు పోటిచేస్తే ఎలా ఉంటుందనే చర్చ జరుగుతుంది. దాని వల్ల అన్ని నియోజక వర్గాలపై ప్రభావం ఉంటుందని దీంతో సులువుగా గెలుపు ఆవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన అజయ్‌కుమార్ టిఆర్‌యస్ పార్టీలో చేరారు. తిరిగి ఇక్కడ నుంచే పోటి చేసేందుకు సిద్దమౌతున్నారు. అయితే మారుతున్న రాజకీయ సమీకరణల నేపద్యంలో ఆయన్ను సుడా చైర్మన్‌గా నియమించి ఎమ్మెల్సీ ఇచ్చి ఇక్కడ కొత్త అభ్యర్దిని పెడితే ఏలా ఉంటుందనే దానిపై తర్జన భర్జనలు జరుగుతున్నట్లు సమాచారం. ఖమ్మం నుంచి ముస్లిం మైనార్టీ అభ్యర్థి ని పోటికి పెట్టాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తుంది. దీనికి అజయ్ కుమార్ అంగీకరిస్తారా? లేదా? అనే విషయంపై ఆదారపడి ఉంటుంది. వైరా నుంచి వైకాపా అభ్యర్థిగా పోటి చేసి విజయం సాధించిన బాణోత్ మదన్‌లాల్ అధికార టిఆర్‌యస్‌లో చేరారు. అయితే ఆయనకు ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పొసగటం లేదు. మదన్‌లాల్ మంత్రికి దగ్గరగా ఉన్నారు. ఇద్దరు ఒకే పార్టీ నుంచి వచ్చి అధికార పార్టీలో చేరినప్పటికి వారి మధ్య ఉన్న తేడాలు అలాగే కొనసాగుతున్నాయి. మదన్‌లాల్ నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగు తున్నప్పటికి కొన్ని సందర్భాలలో వివాదా స్పదుడుగా మారుతున్నారనే ఆరోప ణలున్నాయి. కేసీఆర్ మొదటిసారి సర్వేలో ఆఖరి స్థానంలో ఉన్నప్పటికి తరువాత కాలంలో తన పనితీరు మెరుగు పరుచుకుని నెంబర్ వన్‌స్థానానికి వచ్చారు. అయితే ఇటీవల సర్వేలో మాత్ర మిశ్రమ స్పందన వచ్చినట్లు తెలు స్తుంది. ఇదే జరిగితే కొంత మైనస్ ఉంటుంది. టిఆర్‌యస్ నుంచి ఒకరిద్దరు టిక్కెట్ ఆశిస్తున్నారు. మధిర ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి టిఆర్‌యస్ ఇన్ చార్జ్‌గా బమ్మెర రామ్మూర్తి ఉన్నారు. గతంలో సిపియం నుంచి పోటి చేసి అనంతరం వైకాపాలో చేరిన లింగాల కమల్‌రాజు ఎంపి పొంగేలేటి ద్వారా టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. అయితే వీరిద్దరు కాక భట్టిపై పోటికి సమ ఉజ్జీకోసం చూస్తున్నట్లు తెలుస్తుంది. సత్తుపల్లి నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్ చార్జ్‌గా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఉన్నారు. గత ఎన్నికల్లో వైకాపా నుంచి పోటిచేసి ఓడిపోయిన మట్టాదయానంద్ కూడా టిఆర్‌యస్‌లో చేరి తనకే ఈ సీటు కావాలని పట్టుబడుతున్నారు. ఆయన ఎంపితో వైకాపా నుంచి టిఆర్‌యస్‌లో చేరి దిశా చైర్మన్‌గా ఉన్నప్పటికి ఎంపితో ఇటీవల కాలం లో అంటి ముట్టనట్లుగా ఉంటున్నట్లు తెలుస్తుంది. ఇద్దరిలో ఎవరికి సీటు వస్తుందో చెప్పలేని పరిస్థితి. పిడమర్తి రవి తిరిగి పోటిచేసేందుకు పల్లె నిద్ర పేరుతో గ్రామాలలో బసచేస్తున్నారు.

కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు టిఆర్‌యస్ నుంచి 2014లో గెలిచిన ఏకైక శాసనసభ్యుడు అయితే ఆయన ఈ సారి పోటిచేస్తారా? లేదా? హైద్రాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నియోజకవర్గాల నుంచి పోటి చేసే ఆవకాశం ఉందనే పుకార్లు సికార్లు చేస్తు న్నాయి. ఆయన మాత్రం నియోజకవర్గంపై తన పట్టును బిగిస్తున్నారు. ఒక సందర్భంలో ఎంపిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటిచేస్తారని ప్రచా రం జరిగినా దాన్ని ఆయనే స్వయంగా కొట్టి పారేశారు. ఇలెండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటిచేసి గెలిచిన కోరం కనకయ్య టిఆర్‌యస్‌లో చేరారు. నియోజక వర్గంలో టిఆర్‌యస్ ప్రభావం ఉన్నప్పటికి ప్రత్యర్దులనుంచి గట్టి పోటి ఉండే ఆవకాశాలు ఉన్నాయి. అశ్వారావుపేట నుంచి వైకాపా అభ్యర్థిగా పోటి చేసి గెలిచిన తాటి వెంక టేశ్వర్లు టిఆర్‌యస్‌లో చేరారు. ఈసారి ఇక్కడ నుంచి తిరిగి పోటి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి కొంతమంది కూడా నియోజకవర్గంలో తమకు ఆవకా శం ఇవ్వాలని టిఆర్‌యస్ పెద్దలను కోరు తున్నట్లు తెలుస్తుంది. పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు కూడా వైకాపా అభ్యర్థిగా పోటిచేసి గెలిచి ఖమ్మం ఎంపితోపాటు టిఆర్ఎస్ తీర్థం పుచ్చు కున్నారు. అయితే పాయంపట్ల నియోజకవర్గంలో మిశ్రమ స్పందన కనపడు తుందని పార్టీ మారినందన కొంత మైనస్ ఉందనే అభిప్రాయాల నేపథ్యంలో ఇక్కడి నుంచి టిక్కెట్ ఆశిస్తున్నవారు తమ వ్యూహలకు పదును పెడుతున్నారు. భద్రాచలం రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి టిఆర్‌యస్ అభ్యర్థిగా డాక్టర్ తెల్లం వెంకట్రావుతోపాటు మరో ఇద్దరు ప్రయత్నాల్లో ఉన్నారు. మహబూ బాబాద్ పార్లమెంట్ పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లెండ్ నియోజకవర్గాలు ఉన్నాయి. బంజారాలు ఎక్కువగా ఉన్నందున ప్రొ. సీతారాం నాయక్ తిరిగి పోటీ చేయటం ఖాయం.

ప్రజల జీవన ప్రమాణాల్లో పెను మార్పు


భగీరథ నీటితో ఆరోగ్యం మెరుగు



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి : రాబోయే ఐదేళ్లలో మిషన్ భగీరథతో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు కచ్చి తంగా మెరుగవుతాయని 15 వ ఆర్థిక సంఘం కార్యదర్శి అర వింద్ మెహతా అన్నారు. మిషన్ భగీరథ లాంటి భారీ ప్రాజెక్టును ఇంత తక్కువ కాలంలో పూర్తి చేయబోతుండడం ప్రశంసనీయమన్నారు. శనివారంనాడు సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్ కోమటిబండ లో నిర్మించిన భగీరథ హెడ్ వర్క్స్ ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే జోషితో కలిసి అరవింద్ మెహత పరిశీలించారు. అక్కడ ఏర్పాటుచేసిన భగీరథ ఫోటో ఎగ్జిబిషన్‌ను చూశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈ.ఎన్.సి సురేందర్ రెడ్డి ప్రాజెక్టు వివరాలను తెలియచేశారు. 20 ఏళ్ల కిందట సిద్దిపేటలో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రారంభించిన తాగునీటి పథకమే మిషన్ భగీరథకు స్పూర్తి అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతనే మిషన్ భగీరథ ఆలోచన, ఆచరణ జరిగిందని తెలుసుకుని అరవింద్ మెహత ఆశ్చర్య పోయారు. ఇంతేకాదు 98 శాతం నీటి సరాఫరా గ్రావిటీతోనే జరుగుతుందని తెలుసుకున్న మెహత, తెలంగాణ భౌగోళిక స్వరూపాన్ని అద్భుతంగా ఉపయోగించుకున్నారని మెచ్చుకున్నారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన అరవింద్ మెహతా..తాగునీటి సమస్యను తీర్చడానికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ దేశం మొత్తానికి అనుసరనీయమన్నారు. ఇతర రాష్ట్రాల ఇంజనీర్లు, అధికారులు ఈ ప్రాజెక్టు నుంచి ఎంతో నేర్చుకోవచ్చని చెప్పారు. మనదేశంలో వచ్చే ఎన్నో వ్యాధులకు అపరిశుభ్ర తాగునీరే కారణమని, మిషన్ భగీరథతో తెలంగాణ ప్రజలకు సురక్షిత తాగునీరు హక్కుగా దొరకుతుందన్నారు. దీర్ఘకాలంలో తెలంగాణ సమాజంపై మిషన్ భగీరథ సామాజికంగా, ఆర్థికంగా సానూకూల ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరికి రక్షిత మంచినీటిని అందించాలన్న తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్దికి 9 నెలల కాలంలోనే పూర్తన కోమటిబండ హెడ్ వర్క్స్ పనులే నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అతి తక్కువ కరెంటును వినియోగించి దేశానికి, తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇంటింటికి మంచినీటితో పాటు ఇంటర్నెట్ ను అందించి తెలంగాణ చరిత్ర సృష్టించబోతుందన్నారు. ఆ తర్వాత మాట్లాడిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే జోషి, మిషన్ భగీరథ ఇవాళ టాక్ ఆఫ్ ది నేషన్ గా నిలిచిందన్నారు. ఇంటింటికి మంచినీటిని అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఈ.ఎన్.సి సురేందర్ రెడ్డి, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామి రెడ్డి, భగీరథ ఎస్.ఈ చక్రవర్తి, గడా హన్మంతరావు, ఈఈ రాజయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీ వ్యక్తిని ప్రధానిని చేసిన ఘనత బీజేపీదే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్




ఇబ్రహీంపట్నం, మేజర్‌న్యూస్ : బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని దేశ ప్రధానిని చేసిన ఘనత భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని శాస్త్ర గార్డెన్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చ సంగ్రామ సదస్సులో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు. బీసీలకు కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రభుత్వాలలో పూర్తిగా అన్యాయం జరుగుతుందని అన్నారు. భారతీయ జనతా పార్టీ దామాషా జనాభా ప్రకారం సీట్లు కేటాయించిందని చెప్పారు. బీసీ కమిషన్ ను ఏర్పాటు చేసిన ఘనత భాజాపాకే దక్కిందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి ఎన్నికల తరువాత వాటిని తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రయత్నం చేస్తూ బీసీ కులాలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉచిత విద్య ఇస్తానని అనడం సంతోషంగా ఉంద న్నారు. కానీ బీసీలు ఏం పాపం చేశారని, వారికి ఇవ్వడం లేదని ప్రశ్నిం చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తాగు, సాగు నీళ్లను ప్రజలకు అందిస్తామని చెప్పి వాటిని పూర్తిగా విస్మరించి రాత్రి 12 గంటల వరకు మద్యాన్ని అమ్ముతుందని విమర్శించారు. రూ.21 వేల కోట్లు మద్యం వల్ల వసూలు చేస్తూ రాష్ట్రాన్ని మద్యం మత్తులో పడేశారని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రగతిని పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇంత వరకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వని ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళితులకు మూడు ఎకరాల పొలం ఇస్తానని, దళితులనే ముఖ్యమంత్రి చేస్తానని, వాటిని విస్మరించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీసీలంతా బీజేపీ పార్టీ అండదండగా నిలవాలని, వారి అభివృద్ధికి బీజేపీ అహర్నిషలు పాటుపడుతుందని చెప్పారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు ప్రాణం పోసే ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకొని ఆ పనులను పూర్తి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను టీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్‌చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను దోచుకొని దాచుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని జోష్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం చెరువులోకి నీళ్లు తెస్తానని చెప్పి ఆ చెరువులోని మట్టిని అమ్ముకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఖరీముల్లాఖాన్ భూముల్లో బీడీఎల్‌కు పోయిన భూముల్లో రైతులను మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. బస్‌డిపో పక్కకు ఉన్న ఖరీముల్లాఖాన్ భూములపై కన్నేసి అవి కూడా అమ్ముకోవాలని చూస్తున్నారని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పరచకుండా మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని ద్వజమెత్తారు.

రాబోయే రోజుల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కాటం నర్సింహ్మ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు కాస వెంకటేశ్వర్లు, నెహ్రూ యువకేంద్ర జాతీయ ఉపాధ్యాక్షులు పేరాల శేఖర్‌జీ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్‌రాజ్ యాదవ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల భాస్కర్, యువమోర్చ రాష్ట్ర నాయకులు నాయిని సత్యనారాయణ, కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకులు పోరెడ్డి అర్జున్‌రెడ్డి, మహిళా మోర్చ రాష్ట్ర కార్యదర్శి సుమతి అర్జున్‌రెడ్డి, బీజేపీ మీడియా సెల్ కన్వీనర్ బూడిది రాంరెడ్డి, యువమోర్చ రాష్ట్ర నాయకులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కంది రైతులను ఆదుకోవాలి

కేంద్రం స్పందించకపోతే కంది రైతులలో అశాంతి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : కంది రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర మార్కెటింగ్, నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర పౌర సరఫరాల మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు లేఖ రాశారు. కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరారు. ఈ సీజన్ లో కందులు 2 లక్షల 84 వేల మెట్రిక్ టన్నుల కు పైగా కందుల దిగుబడి రానుందని హరీశ్ రావు చెప్పారు. అయితే 75 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం అంగీకరించడం పట్ల తీవ్ర అసంతృప్తిని ప్రకటించారు.

కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని,కంది రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ మంత్రి కోరారు. కనీసం మరో లక్ష మెట్రిక్ టన్నుల కంది కొనుగోలు కోసం సంబంధిత ఏజన్సీల ను ఆదేశించాలని కోరారు. మార్కెట్ లో కంది రైతులకు మద్దతు ధర లభించడం లేదని తక్కువ ధరకు అమ్ముకోక తప్పడం లేదన్నారు. దీంతో కంది రైతుల్లో అశాంతి నెలకొంటుందని హరీశ్ రావు చెప్పారు.మద్దతు ధర క్వింటాలుకు 5,450 రూపాయలు ఉండగా మార్కెట్ లో 3,800 నుంచి 4,200 రూపాయలకు

కంది రైతులు అమ్ముకోవలసి వస్తున్నదని మంత్రి హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కంది పంటపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రైతులు నిరాశ నిస్పృహలతో కంది పంటను వేసేందుకు నిరాకరిస్తారని చెప్పారు. పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయి ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని మార్కెటింగ్ మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పప్పు ధాన్యాలు దిగుమతి చేసుకోవలసి వస్తుందని మంత్రి అన్నారు. దీంతో ధరలు పెరిగి సామాన్య వినియోగదారులపై భారం పడుతుందని కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కు రాసిన లేఖలో మంత్రి హరీశ్ రావు వివరించారు.

గరగపర్రులో దళితుల సమస్య పరిష్కరించాలి

విజయవాడ, సూర్య బ్యూరో : పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రులో దళితుల సమస్య పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా గంగపర్రులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయమై దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన ఘటన మీకు విదితమేనన్నారు. ఈ వివక్షత ఘటన సందర్భంగా రాష్ట్ర మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పితాని సత్యనారాయణ, ఎస్‌సి కమీషన్ ఛైర్మెన్ కారెం శివాజీలు గరగపర్రులో పర్యటించి, పలు వాగ్దానాలు చేశారు. ఇరుపక్షాల వారికి రాజీ చేశామని ప్రపంచానికి తెలియజేశారు. మా రాష్ట్ర పార్టీ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ నెక్కంటి సుబ్బారావు, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ స్థానిక నాయకులతో కలసి తాను గరగపర్రు గ్రామాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ఇప్పటికి కూడా ఆ గ్రామంలో దళితులను పనులకు పిలవడం లేదు. కౌలుకు భూములు ఇవ్వడంలేదన్నారు. రబీ కాలంలో దళితులకు కౌలుకు భూమి ఇస్తామని మాట ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కాలేదన్నారు. దళితులను గ్రామంలో కూలిపనులకు పిలవకపోవడం వల్ల భీమవరం టౌన్‌పైన, ఇతర పల్లెలపైన ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గమైన పరిస్థితి. గరగపర్రులో చినకావుల యాకోబు అనుమానాస్పద పరిస్థి తుల్లో యాక్సిడెంట్‌కు గురై మరణించాడడన్నారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభు త్వం ఆర్థిక సహకారం అందిస్తుందని వాగ్ధానం చేశారు. మరణించిన దళితుడు యాకోబు కుటుంబానికి రు.5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వవలసినదిగా, తక్షణమే అధికారులను పంపి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతోపాటు దళితుల దయనీయ పరిస్థితిని సరిదిద్దటానికి తగు చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నామన్నారు.



బందరు అభివృద్ధే టిడిపి ప్రభుత్వ లక్ష్యం

- రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన
- పదేళ్ళుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం అభివృద్ధి
- ఏపి న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ, సూర్య బ్యూరో : బందరు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని, గత పదేళ్ళుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంత అభివృద్ధి కోసం తమ ప్రభుత్వ కృతనిశ్చయతో పనిచేస్తుందని రాష్ట్ర న్యాయ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పరిధిలోని 42వ వార్డ్ గుమస్థాల కాలనీలో రూ. 21.51 కోట్లతో నిర్మించనున్న వరదనీటి పారుదల డ్రైన్, 34వ వార్డు కాసానిగూడెంలో రూ. 22.70 కోట్లతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకం పనులకు స్థానిక పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావుతో కలిసి భూమి పూజ చేసారు. అనతర జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గత కొంత కాలంగా మచిలీపట్నం నియోజకవర్గ అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైందని 2014లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన తర్వాత సుధీర్ఘకాలంగా పెడింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులు ప్రారంభించామని, ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కార కాగా, మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. విజయవాడ బందరు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి పనులు వేగవంతరగా జరుగుతున్నాయని అన్నారు. మచిలీపట్నంలో ఎక్కడికక్కడ మంచినీటిని అందించేందుకు వివిధ ప్రాంతాలలో రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని అన్నారు. మంచి నీటి పైపు లన్నింటిని మార్చి ఆధునీకరణ పనులు చేపట్టడం వలన ప్రజలకి అవసరమైన నీటిని అందించగలుగుతున్నామని మంత్రి చెప్పారు.

మచిలీపట్నంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి వర్షం వస్తే ఎక్కడి నీరు అక్కడ నిల్చేదని, లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీటిని పంపు చేసేందుకు 145 మోటర్లతో పంపు చేసే విధంగా పనులు ప్రారంభించామని మంత్రి రవీంద్ర అన్నారు. 150 ఏళ్ళు చరిత్ర ఉన్న బందరు మునిసిపాలిటీలో నేడు రూ. 158 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ. 650 కోట్లతో జి+3 ఇళ్ళ నిర్మాణం చేపడుతున్నామని ఆయన చెప్పారు. బందరు నుండి మగినవూడి బీచ్ వరకు ఆరు లైన్ల రోడ్డు వేస్తున్నామని మంత్రి చెప్పారు. బీచ్ అభివృద్ధికి ఇటీవల రూ. 2.50 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేసామని త్వరలో మరో రూ. 2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలియజేసారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన బందరు పోర్ట్ నిర్మాణానికి తమ ప్రభుత్వ కట్టుబడి ఉందని, భూసేకరణ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వ స్థాయిలో ప్రణాలికలు రచిస్తున్నామని మరో రెండు, మూడు నెలలలో పోర్ట్ పనులు ప్రారంభిస్తామన్న ఆశాభావాన్ని మత్రి వ్యక్త చేసారు. బందరులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు రాజకీయంగా లబ్ది పొందేందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని వీరి ఆటలు ఎంతో కాలం సాగవని ప్రజా క్షేత్రంలో వారిని నిలదీసే రోజు దగ్గరలోనే ఉందని ప్రతిపక్షాలని మంత్రి హెచ్చరించారు.

మచిలీపట్నం పార్లమెట్ సభ్యులు కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ పరిస్థితులలో మన హక్కులను సాధించుకునేందుకు శక్తి వంచన లేకుండా పార్లమెంట్ సభ్యులైన మేము పోరాడుతున్నామని రాష్ట్ర ఎదుర్కొంటున్న ఇబ్బందులు త్వరలో పరిష్కారమవుతాయని ఆయన చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ప్రాంత సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయని చెప్పారు. ఒంగోలు - కత్తిపూడి రహదారి రైల్వే డబ్లింగ్ పనులు చేపడుతున్నామని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వ కృషి వల్లే వందల కోట్ల రూపాయల నిధులు మచిలీపట్నం ప్రాంతానికి వచ్చాయని చెప్పారు. ఈ సభలో పట్టణ గృహా నిర్మాణ పథకం కింద 979 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఉత్తర్వులు అందించారు. జాతీయ కర్మచారి యోజన పథక కింద రూ. 15 లక్షల విలువైన ట్రాక్టర్, వ్యాక్యూమ్ లోడర్‌ను లబ్ధిదారు జ్యోతిబాబు కి అందించారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపిచంద్, మునిసిపల్ ఛైర్మెన్ బాబా ప్రసాద్, వైస్ చెర్మెన్ కాశీ విశ్వనాధ, రూరల్ ప్రెసిడెంట్ కుంచే నాని, గనిపిశెట్టి గోపాల్, హాస్పిటల్ ఛైర్మెన్ సోమ శేఖర్, కౌన్సిలర్స్ పల్లపాటి సుబ్రమణ్యం, కాసాని రంగమ్మ, రమేష్, ఆంజనేయ ప్రసాద్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు భవనాలను పరిశీలించిన హైకోర్టు జ్యూడికేషర్ బృందం



అమరావతి, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి లో హైకోర్టు తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాలను పరిశీలిం చేందుకు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టు జ్యూడికేషర్ బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు కృష్ణా, గుంటూరు జిల్లాలలోని పలు ప్రాంతాలలో ఈ బృందం పర్యటించింది. ఉదయం గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ భవనాల సముదాయాలను, ఆచార్య నాగార్జున యూనివర్సీటీ పక్కన ఉన్న రామకృష్ణ టవర్స్ భవనాల సముదాయాన్ని, ఆచార్య నాగార్జున యూనివర్సీటీ ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీ విల్లాస్ భవనాలను మరియు అమరావతి రాజధాని తుళ్లూరు ప్రాంతం నెక్కల్లు ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. హైకోర్టు భవనాలను పరిశీలించేందుకు విచ్చేసిన బృందంలో గౌరవనీయులైన శ్రీ జస్టీస్ వి. రామసుబ్రహ్మణ్యం, శ్రీ జస్టీస్ సి ప్రవీణ్ కుమార్, శ్రీ జస్టీస్ ఎ.వి శేషసాయి, శ్రీ జస్టీస్ టి.సునీల్ చౌదరి మరియు శ్రీ జస్టీస్ పి. సత్యనారాయణమూర్తి, కృష్ణా జిల్లా జడ్జి ఎ.వి రవీంద్రబాబు, గుంటూరు కలెక్టర్ కోన శశిధర్, విజయవాడ బార్ ఆసోసియేషన్ ఆధ్యక్షులు సోము కృష్ణ మూర్తి, జనరల్ సెక్రటరీ కందుల శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ పి. శ్రీమన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ఎల్ మాధవ స్వరూప్ తదితరులు ఈ బృందం వెంట ఉన్నారు.

ప్రజాగ్రహానికి గురి కావద్దు

ఏపీజేఎఫ్ రిలే నిరాహారదీక్షలో పలువురు నాయకులు ధ్వజం



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఫ్) ఆధ్వర్యంలో శనివారం విజయవాడ లోని లెనిన్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ శిబిరానికి పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని తమ మద్దతును ప్రకటించాయి. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలియజేయడానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరవున రఘువీరారెడ్డి హాజరై ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ గత నాలుగేళ్లుగా పోరాడుతుందని, ఈ అంశంపై ఎవరు పోరాడిన కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. మన భవిష్యత్ గురించి 5 కోట్ల మంది కూడా ఆలోచన చేసుకోవాలి. జర్నలిస్టులుగా రాయడమే కాదు, అందరనీ ఒకటీ చేసే బాధ్యతను మేము తీసుకుంటామని మీరు ముందుకు వచ్చారు. మార్చి 6, 7, 8వ తేదీల్లో ఢిల్లీలోనే ఉండి తాడోపేడో తేల్చుకోవాలి, అన్ని రాజకీయ పార్టీలు, అన్నీ ప్రజా సంఘాలు అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో ఉన్న ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ముందు ఒక రోజు "ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష" చేద్దామన్నారు.

తారకరామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకుంటాం

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ, సూర్య బ్యూరో : అరిపిరాల తారకరామ ఎత్తిపోతల పథకాన్ని రానున్న జూలై మాసాంతానికి పూర్తిచేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ.890. 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న తారకరామా ఎత్తిపోతల పథకానికి మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్ణాడెల్టాలో కాలువ శివారు ప్రాంతాలకు కూడా సకాలంలో సాగునీటిని అందించి రైతాంగాన్ని అదుకున్నామన్నారు. బుడమేరుపై అరిపిరాల వద్ద నిర్మించే ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలపల్లి, వుట్టగుంట, పేద లింగాల, కుదరవల్లి, రామావురం, నందివడ గ్రామాలలోని 3597 ఎకరాలకు సాగునీటి లభ్యత ఏర్పడుతుందన్నారు. ఈ పథకానికి 120 %నూ% హెచ్‌పి సామర్ధ్యం గల 4 పంపులు 16 గంటలు నిర్విరామంగా పని చేస్తాయని అందుకు 315 కెవిఎ సామర్ధ్యం గల 2 లైన్లు విద్యుత్ ను అందిస్తామని మంత్రి అన్నారు. వచ్చే జూలై నాటికి ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. కష్ణాడెల్టా రైతాంగాన్ని ఆదుకోవాలనే మహా సంకల్పంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందిం చిన ఘనత ముఖ్యమంత్రిదన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 105 టీఎంసీలు రాగా, 15 టీఎంసీలు పశ్చిమగోదావరి మెట్ల ప్రాంతానికి వినియోగించ మిగిలిన 90 టీఎంసీల నీటిని ప్రకాశం బ్యారేజీ లోనికి తెచ్చి కష్ణా డెల్టా సకాలంలో సాగునీటిని అందించామన్నారు. దీనివలన 13 లక్షల ఎకరాల్లో పదివేల కోట్ల ఆదాయం రైతాంగానికి చేకూరిందన్నారు. పోలవరం నిర్మాణానికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పూర్తి చేస్తామన్నారు. 2019 జనవరి నాటికి కాంక్రీటు, స్పిల్వే పనులు పూర్తి చేయడంతోపాటు నలభై ఎనిమిది గేట్లు కూడా నిర్మిస్తామని మంత్రి అన్నారు. కేంద్రం నుండి నిధులు మంజూరు అయినప్పటికీ 3,000 కోట్ల పనులు పూర్తిచేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు తరచూ పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. బుడమేరు అభివద్ధిలో భాగంగా ఉన్న 141 ఎకరాల్లోని 232 మంది రైతులకు 25 లక్షల 30 వేల రూపాయలు అందించి ఆదుకున్నామన్నారు. విభజనానంతరం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ హామీ మేరకు రైతాంగానికి 24 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. కాగా రెండవ పంటగా మినుమును పండించిన రైతాంగాన్ని కూడా ఆదుకోవాలని లక్ష్యంతో రూ. 5400 మద్దతు ధర చెల్లించి, 25 వేల క్వింటాల్ కొనుగోలు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. ఈ నెల 12నుండి 116 రోజులు నిర్వహించే జలసంరక్షణ పనుల్లో భాగంగా డ్రైన్లు కాలువలు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని అన్నారు. నీటి సంఘాల నాయకులు నిబద్ధత నిజాయితీ తో పని చేసి కాల్వ చివరి ప్రాంతాల వరకు నీటిని తీసుకువెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.



12, 16 తేదీల్లో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ఫిబ్రవరి 12, 2018 న మొదట విడత జాతీయ నులివురుగుల నిర్మూలన దినమును దేశ వ్యాప్తంగా అమలు చేయడం జరుగుతుందని ఆర్‌బియస్‌కె కో ఆర్డినేటర్ మరియు డిప్యూటి డిఎమ్ అండ్ హెచ్ వొ డా॥ యు. శోభ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు మధ్య వున్న పిల్లలందరికీ నులివురుగులు నిర్మూలన మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లాలోని 7,126 కేంద్రాలలో 5,51,674 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో 3,314 పాఠశాలలు, కళాశాల పరిధిలోని 3,19,312 మంది విద్యార్థులకు 3,812 అంగన్‌వాడి కేంద్రాల పరిధిలోని 2,32,362 మంది పిల్లలకు నులివురుగులు మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో, 6 సంవత్సరాల వయస్సు నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పాఠశాలలో, కళాశాలల నందు పంపిణీ చేయడం జరుగుతుంది. 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల లోవు పిల్లలకు సగం ట్యాబ్లెట్ (200 మి.గ్రా) ఇవ్వవలెను. 2సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు పిల్ల లకు ఒక ట్యాబ్లెట్ (400 మి.గ్రా) ఇవ్వవలెను. జబ్బుతో ఉన్నా 'లేదా' ఏదైనా ఇతర మందులు వాడుతున్న పిల్లలకు ఈ నులివురుగుల నిర్మూలన మాత్ర ఇవ్వరాదన్నారు.

రొయ్యల సాగుకు అడ్డంకుల్ని పరిశీలిస్తాం

మంత్రి ఆదినారాయణరెడ్డి

అమరావతి, సూర్యబ్యూరో : తూర్పుగోదావరి జిల్లాలో రొయ్యల చెరువుల అనుమతుల విషయంలో ఏవైనా అడ్డంకులు ప్రభుత్వ పరంగా ఉంటే పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకుంటాం అని రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ, సహకార శాఖల మంత్రి ఆదినారాయణ రెడ్డి తూ. గో జిల్లా రొయ్యల రైతులకు హామీ ఇచ్చారు. తూ,గో జిల్లా రొయ్యల సాగు రైతులు శుక్రవారం మధ్యాహ్నం మంత్రిని సచివాలయంలో కలసి తమకు ఎదురవుతున్న సమస్యలపై వినతిపత్రం అందచేశారు. మంత్రి వారి సమస్యలను పశు సంవర్ధక, మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి గొపాలకృష్ణ దివేదితో కలసి సమావేశమై సావధానంగా విన్నారు. నిబంధనలకు లోబడి వ్యవహరించాలని మంత్రి వారికి ఈ సంధర్భంగా స్పష్టం చేశారు.

తూర్పుగోదావరి జిల్లాలో 30 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నా తొమ్మిదివేల ఎకరాల సాగుకే అనుమతులున్నాయని, మిగిలిన వాటి రెగ్యులరైజేషన్‌కు నిబంధనలకు లోబడి ధరఖాస్తు చేసినా అనుమతులు పెండింగ్ లో ఉన్నాయని మంత్రికి, ముఖ్య కార్యదర్శికి తూ. గో జిల్లా రొయ్యల సాగు రైతులు వివరించారు. కోర్టు కేసులు, ఫిర్యాదులున్నాయంటూ జిల్లాస్థాయి కమిటీ తమ ధరఖాస్తులన్నింటినీ పెండింగ్ లో పెట్టేసిందని తెలిపారు. తనిఖీలు చేసి



నిబంధనలు అతిక్రమించినవారిని పక్కన పెట్టి నిబంధనలకు అనుగుణంగా ఉన్నవారికి అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో సమస్య లేదని ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సమస్య ఉందని మంత్రికి వివరించారు. మంత్రి, ముఖ్యకార్యదర్శి ఈ అంశమై ఆ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకుని పరిష్కరిస్తామని వారికి తెలిపారు. రొయ్యల చెరువులు రోడ్డుకు, డ్రెయిన్లకు మూడు మీటర్ల దూరంలో ఉండాలి, గట్లు మీద చెట్లను పెంచాలి, కాలుష్య నివారణ చర్యలు తదితరాలన్నీ నిబంధనల కనుగుణంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. జి.వో 7 ప్రకారం మంచి నీటి చేపల చెరువులకు అనుమతులు తీసుకుని రొయ్యల సాగు చేయాలనుకుంటే జివో 15 ననుసరించి ధరఖాస్తులు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీలో విద్యుత్ అధికారి కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సమావేశంలో అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారి ఉండటం వల్ల ట్రాన్స్ ఫార్మర్ల పరిధిలో లోడ్ ఎక్కువ కాకుండా ఉండేలా అనుమతులిచ్చేలా చూడగలరని మంత్రి పేర్కొన్నారు.

రొయ్యల సాగు రైతులకు సబ్సిడీకి పరిమితులు విధించడం వల్ల సబ్సిడీని ఎవరూ వినియోగించుకోలేక పోతున్నారని రొయ్యల సాగు రైతులు మంత్రికి వివవరించారు. ఒక రైతుకు నాలుగు ఏరియేటర్లను మాత్రమే ఒక్కొక్కటి రూ. 20 వేల సబ్సిడీతో అందిస్తామని పరిమితి విధించారని, ఇవి ఏ మాత్రం సరిపోవని అందుకే రైతులెవరూ వీటిని తీసుకోవడం లేదని, సొంతంగా పెద్ద మొత్తంలో వాటిని కొనుగోలు చేసుకుంటున్నారని తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు కోట్లరూపాయలు సబ్సిడీగా ఇస్తూ రొయ్యల సాగు రైతాంగానికి మాత్రం పరిమితి విధించడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బీద మస్తాన్ రావు, అఖిలభారత రొయ్యల సాగు రైతు సమాఖ్య అధ్యక్షుడు రాజు,తూ.గో జిల్లా అక్వా రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రరాజు వెంకటరాజు, కార్య వర్గం, మత్స్యశాఖ అదనపు కమీషనర్ సీతారామ రాజు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు.. రూ.300 కోట్లు!

- ఏసీబీనే నివ్వెరపోయింది!
- పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః హెచ్‌ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ఆస్తుల చిట్టాలో కొత్త కోణాలు బయట పడుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.50కోట్లు విలువ చేసే ఆస్తులు ఏసీబీ గుర్తించిన సంగతి తెలిసిందే. అయితే 8 రోజులుగా అధికారులు సోదాలు చేస్తూనే ఉన్నారు. శనివారం మధ్యాహ్నానికి రూ.300 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఇదివరకే ఇద్దరు బినామీలను గుర్తించిన ఏసీబీ తాజాగా మరో ఇద్దర్ని గుర్తించింది. ఆయన ఆస్తుల చిట్టాను చూసిన అధికారులు నివ్వెరపోయారు.

పురుషోత్తంరెడ్డి బినామీ దందా...

లేఔవుట్ల పర్మిషన్ వచ్చేవారి నుంచి లంచం రూపంలో పార్ట్‌నర్‌షిప్ ఉందని అధికారులు గుర్తించారు. ఇలా రెండు లేఔవుట్ల రూపంలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులున్నాయి. నగదుతో పాటు విదేశాల్లో షాపింగ్‌లు, ఇండియా లోని టాప్ డిజైనర్లతో నగలు చేయించినట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులు, పురుషోత్తం రెడ్డి పరారయ్యారు. ఆయన కోసం నాలుగు బృందాలుగా విడిపోయిన పోలీసులు గాలిస్తున్నారు. పురుషోత్తం బావ కూడా పరారీలో ఉన్నాడు.. ఆయన దొరికితే మరిన్ని కోట్ల ఆస్తుల వివరాలు బయట పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అధికారపార్టీ ఎమ్మెల్యే అండదండలు

పురుషోత్తంరెడ్డికి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఉద్యమంలో ఉద్యోగ సంఘాల తరపున కీలకంగా వ్యవహరించిన సదరు ప్రజాప్రతినిధి అండతోనే అవినీతికి పాల్పడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.



కుటుంబ సమేతంగా శ్రీశైలం క్షేత్ర దర్శనం చేసుకున్న మంత్రి మాణిక్యాల రావు. స్వాగతం పలికిన ఆలయ ఈఓ, పూజారులు

ఆయిల్ మాఫియాకు తెరతీశారు

అన్నవరం (తూర్పుగోదావరిజిల్లా), మేజర్‌న్యూస్ : 16వ నెంబరు జాతీయ రహదారి వెంబడి డీజిల్ తారు స్థావరాలు విచ్చలవిడిగా వెలిశాయి. రహదారి గుండా ప్రయాణించే లారీల నుంచి డీజిల్, తారును తక్కువ ధరకు లారీల డ్రైవర్ల నుంచి కొనుగోలు చేసి స్థావరానికి దగ్గర్లోని ఓ స్థలంలో స్టోరేజ్ చేస్తూ వేల లీటర్లు పూర్తయిన తరువాత ఆ డీజిల్‌ను వేరే ప్రాంతాలకు తరలించి మాఫియా నడుపుతున్న వ్యాపారులు భారీ స్థాయిలోనే సొమ్ములు చేసు కుంటున్నారన్న వార్తలు వినబడుతున్నాయి. ఆయిల్ స్థావరాలు పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చినా పరిధిలోని పోలీసులు పట్టించుకోకపోవడం పలువురిని ఆశ్చర్య పరుస్తోంది. ఇదంతా తూర్పు గోదావరి జిల్లా తొండంగి మండలం తమ్మయ్య పేట, గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాంతాలలో జరుగుతోంది. వ్యాపారం చేసే నిర్వాహకులు జాతీయ రహదారి వెంబడి పలు ప్రదేశాలలో పాకలు వేసి దందాకు తెరతీశారు. దశాబ్దకాలం కిందట అప్పటి జిల్లా ఎస్పీ బత్తిన శ్రీను వాసులు ఆయిల్ మాఫియాపై దృష్టిసారించి ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చీకటి వ్యాపారాలకు ఆయిల్ మాఫియాకు చెక్‌పెట్టి పూర్తి స్థాయి లో తెరదించారు. జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌మాఫియా ఎక్కడ జరిగినా సహించ కుండా దాడులు చేసేలా



ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెట్టించారు. నాటినుంచి నేటి వరకు జిల్లాలో ఎక్కడా ఎటువంటి మాఫియా కను చూపు మేరలో కనిపించలేదు. కానీ మళ్లీ పోలీసు అధికారుల పరోక్షమద్దతుతో ఆయిల్ మాఫియా రెచ్చిపోతోంది. రహదారిలో అనుకూలంగా ఉన్న ప్రతీ ప్రదేశంలోనూ స్థావరాలను ఏర్పాటు చేసుకుని చీకటి వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తున్నారు. ఆయిల్ వ్యాపారం కారణంగా నెలకు రూ. 20 లక్షల నుంచి 30 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందని అందువల్లే అధికారులు సైతం మామూళ్లకు అలవాటు పడ్డారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ చీకటి వ్యాపారాలపై జిల్లా ఎస్పీ దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

మాఫియా శక్తులకు అండగా బొండా


ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్

విజయవాడ, సూర్య బ్యూరో : మూడు శాసన సభ నియోజక వర్గాలలో ఎక్కడా లేనివిధంగా మధ్య నియోజకవర్గం లో భూ మాఫియా కబ్జాలకు పాల్పడుతూ అరాచకాలకు కేంద్ర బిందువుగా నిలిచిందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ పోతిన వెంకట రామా రావు అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. గత నాలుగేళ్ళ కాలంలో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వర రావు ఆయన అనుచరవర్గంగా పేరొందిన కొందరు కార్పొరేటర్లు చేస్తున్న అక్రమాలు, పోలీసు, న్యాయ వ్యవస్థలకు సమాంతర వ్యవస్థలను నడవుతున్న తీరుపట్ల నియోజకవర్గ ప్రజలు భయాందోళనలకు గురవతున్నా రని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో బొండా అనుచరులుగా ప్రసిద్దిపొందిన కొందరు కార్పొరేటర్లు చేస్తున్న భూకబ్జాలను సవివరంగా తెలి పారు. బొండా అనుచరుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమీషనర్ గౌతంసవాంగ్‌కు తాము పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. అధికార పార్టీ శాసనసభ్యుడు కావడంతో ఆయనపై చర్యతీసుకోకుండా కొందరు మంత్రులు అడ్డుపడుతున్నారని ఆరో పించారు. సీఎం చంద్రబాబు నాయుడు బొండా అనుచరుల అక్రమాలపై ప్రత్యేకంగా ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీరి అక్రమాలలో భాగంగా 57వ డివిజన్‌లో ఇటీవల జరిగిన ఒక సంఘట నను వివరించారు. 57వ డివిజన్ కార్పొరేటర్ నందెపు జగదీష్‌వలన ఇబ్బంది పడి, భయాందోళనలకు గురైన కె.లక్ష్మారెడ్డి తన ఆవేదనను తెలియజేశారు. ఈయన చెప్పిన వివరాల ప్రకారం తన భార్య పేరిట వున్న 27 సెంట్ల స్థలంపై నకిలీ పత్రాలు సృష్టించి పోలీసుస్టేషన్ ఉన్నతా ధికారులతో బెదిరించే ప్రయత్నం చేశారన్నారు. ఇటు వంటి వారిని ప్రభుత్వం ఎందుకు ఉపేక్షిస్తోందని ప్రశ్నించారు. సమావేశంలో నగర నాయకులు విజయకుమార్, నగర కన్వీనర్ [illegible] భార్గవిలు పాల్గొన్నారు.



కారా మాస్టారి మహోన్నత 'యజ్ఞం'

కథా నిలయం



నేడు వార్షికోత్సవం సందర్భంగా



ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఉత్తరాంధ్ర సాహిత్యం ఒక విశిష్ట అధ్యాయం. ఆధునిక యుగం తొలినాళ్లలో ప్రగతిశీల సాహిత్యానికి నారుపెట్టి, నీరుపోసిన వైతాళికులు ఉత్తరాంధ్ర సాహితీ వేత్తలే. అటు కళింగసీమలో వికాసవంతమైన కొండగాలులు పీల్చుకుంటూ, జీవమిచ్చే నాగావళి నది తరంగాలలో తేలుకుంటూ, విజయనగర కోట గుమ్మాలు దాటుకుంటూ యారాడకొండంత ఎత్తులో నిలబడి రోజురోజుకూ సరికొత్త చైతన్యం పుంజుకుని విశాఖ సముద్రం సాక్షిగా ముందుకు వస్తోంది ఉత్తరాంధ్ర సాహిత్యం. ఉత్తరాంధ్ర తెలుగు కథ గురించి మాట్లాడినప్పుడు, శ్రీకాకుళంలో కాళీపట్నం మాస్టారు నెలకొల్పిన కథానిలయం గురించి తప్పక చెప్పుకోవాలి. కథా నిలయంలో తెలుగు సాహిత్యంలో ఒక్క ఉత్తరాంధ్ర సాహిత్యంతో సహా ఉన్న అన్నీ రచనల వివరాలు పొందు పరిచారు. ఇది మన తెలుగు రాష్ట్రాలలోనే కాదు మొత్తం దేశం లోనే చెప్పుకోదగ్గ గొప్ప సాహిత్య ఘటన . ఎంతోమంది కథకులకి బాసటగా నిలిచి తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టి చేయాలని, తెలుగు కథ గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే, కొత్త తరాలకు ఊపిరులు పోసి ప్రోత్సహించే కారా మాస్టారు గారి కథ నిలయం వైపు చూడాల్సిందే.

ఈ లోకములో నా శైశవం 1935 నుండి పాఠకుడుగా బాల్యము, 1940 – 1942 వరకు రాసేందుకు ఆసక్తి ప్రయత్నము .1943 నుండి ఐదేళ్ళు చిన్నచితగా పత్రికల్లో ఏవోవో కొన్ని రచనలు . 1948 నుండి ఆంధ్రపత్రిక ఉగాది సంచికలూ, భారతి వంటి పత్రిలలో పన్నెండు వరకు ఒక స్థాయి కథలు రాయగలిగాను, 1957 నుండి ఉన్నతస్థాయి కథలు రాయగలిగేందుకు అధ్యయనము . అది ఫలించి 1963 నుండి పదేళ్ళు పాటు మరో పన్నెందు కథానికలు రాయగలిగేను. ఆ తర్వాత కథలైతే రాయలేకపోయా కాని కథను గురించిన అధ్యయనము, అందుకవస రమైన ఇతర ప్రక్రియలలో సహా చదువూ నేటికీ కొనసాగు తూనే ఉన్నాయి.అభిప్రాయాలు పదిమందితో పందుకోవడమూ ఆగలేదు

– కాళీపట్నం రామారావు

ఈ దేశంలో వచ్చిన గ్రంథాలయ ఉద్యమాలు అనేక ఊళ్లలో గ్రంథాలయాలు తెచ్చాయి. ప్రభుత్వాలు సైతం పౌరుల గ్రంథపఠనం వారి అక్షరాస్యత, విద్యావ్యాప్తిలలో భాగంగా భావించి గ్రంథాలయాలకు నిధులు కేటాయించాయి. అవి గ్రంథ సేకరణ, భద్రతలకు ప్రయత్నించాయి. స్వచ్ఛంద సంస్థలు నడుం కట్టాయి. దాతలు విరాళాలు అందించారు. ఈ గ్రంథాలయాలు ఆరంభ లక్ష్యాలను చాలావరకు సాధించగలిగాయి. వినోదంకోసం చదివేవారికి ఇతర వినోదసాధనాలు అందుబాటులోకి రావటం, ఆసక్తిగా, ఆబగా చదవగలిగిన వయసులో పిల్లలకు పాఠ్యపుస్తకాలకు వెచ్చించాల్సిన సమయం అపరిమితంగా పెరిగిపోవటం వంటి పరిణామాలతో గ్రంథాలయాల వినియోగం తగ్గింది. ఒకప్పుడు జీవికనిచ్చిన అణా లైబ్రరీలూ, సర్క్యులేషన్ లైబ్రరీలూ అవి ఆధారపడిన పుస్తకాలు ఏ కోవకి చెందినవైనా కనుమరుగవసాగాయి. భద్రపరచటానికి అవసరమైన స్థలం, సంకల్పబలం, సాధనాలు కొరవడటంతో అనేక పత్రికలు పుస్తకాలు కాలగర్భంలో కలిసిపోసాగాయి. కనీసం అంగబలం, అర్థబలం కల పత్రికలు సైతం తమ పత్రికలనైనా భద్రపరచటానికి గట్టిగా పూనుకోలేదు.

ప్రసిద్ధ కథారచయిత కాళీపట్నం రామారావుగారికి ఒక ఆలోచన కలిగింది. ఒక కథ రాయటానికి ఒక వ్యక్తి కనీసం కొన్ని గంటల నుంచి కొన్ని రోజులు వారాలు నెలలు శ్రమ పడతాడు. ఆ శ్రమ ఫలితానికి ఆయువు ఎన్నాళ్లు? అచ్చైన పత్రికని బట్టి ఒక రోజు, ఒక వారం, ఒక పక్షం, ఒక మాసం. ఆసక్తీ, శక్తీగల వారు పూనుకుని పుస్తకరూపంలో రూపంలో తెస్తే, తెచ్చుకుంటే కొన్నేళ్లు. ఇలా ఈ శ్రమంతా వృథాపోవలసిందేనా? నన్నింతవాడిని చేసిన కథాప్రక్రియలోని శ్రమనైనా కనీసం కొంతకాలమైనా భద్రపరచలేనా? అని ప్రశ్నించుకున్నారు. తెలుగు సాహిత్యంలో ప్రచురించబడిన కథలను భావి తరాలవారికి పొందు పరచాలన్న బృహత్తరఆశయంతో కాళీపట్నం రామారావు అలా పుట్టింది 1997లో శ్రీకాకుళంలో కథానిలయం. తనకి పురస్కారాల ద్వారా వచ్చిన మొత్తాన్ని అంతటినీ శ్రీకాకుళంలో 1997ఫిబ్రవరి 22న ఈ గ్రంథాలయాన్ని స్థాపించేరు. తరువాత స్నేహితులు, దాతలు విరాళాలు ఇచ్చేరు. తెలుగులో రాయబడ్డ ప్రతి కథనీ ఈ గ్రంథాలయంలో భద్రపరచాలని స్థాపకుల ఆకాంక్ష. గురజాడ అప్పారావుగారి దిద్దుబాటు కథ వెలువడిన ఫిబ్రవరి 22వ తేదీన కథానిలయం ప్రారంభమయింది. రామారావుగారి సాహిత్య సంపాదనలో ప్రతి పైసా ఈ కథానిలయానికి అందించారు. అనేక మంది సాహిత్యాభిమానులు, రచయితలూ చేయివేసారు. రామారావుగారి సొంత పుస్తకాలు కథానిలయానికి తొలి పుస్తకాలు అయాయి. మొదటి సభలో పాల్గొన్న గూటాల కృష్ణమూర్తిగారు లండన్ నివాసి. చాలాకాలంగా బ్రిటిష్ లైబ్రరీతో సంబంధం ఉన్నవారు. ఆయన ఆనాటి సభలో ఉపన్యసిస్తూ ఇలా ఒక ప్రక్రియకు లైబ్రరీ ఏర్పడటం ప్రపంచం మొత్తం మీద ఇదే ప్రప్రథమం. రామారావుగారి అవిరామ కృషితో వందలాది మంది సాహిత్య సేకరణకర్తలు కథాసంపుటాలూ, సంకలనాలూ, పత్రికల మూలాలు గాని, ఫొటో నకళ్లు గాని సమకూర్చారు.

ఏదైనా సునాయాసంగా

చిన్న కథ నించి పెద్ద కథ వరకు సునాయాసంగా రాయగల కారా, ఆయన చెప్పదలుచు కున్న విషయం కోసం, వివరించవలసిన జీవితం కోసం, విశ్లేషించవలసిన ప్రపంచం కోసం పెద్ద కథనే ఎంచుకున్నారు. కానీ ఏ ప్రక్రియకైనా దాని ప్రత్యేకతలు ఉంటాయని ఆయన నమ్ముతారు.బారెడు పొద్దెక్కింది అని రాయాలంటే, ఆ వేళకి ఎండ ఎక్కడి దాకా వస్తుందో అడుగులు వేసుకుని కొలిచే మాస్టారి పద ప్రయోగాలు కూడా అబ్బుర పరుస్తాయి. వువ్వప్పుడే మిడిసిపడితే పిందప్పుడే రాలిపోతాదని సామెత, పొద్దల్లా అమ్మేది ముత్తువైతే , పొద్దోయి అమ్మేది పొందుం, ఒళ్లెరబెట్టి ఆణ్ణి తెచ్చుకోడమయితే నా సేత కాదు, వరి కంప మీద పట్టు కోక తీసినా దక్కదు, తియ్యకున్నా దక్కదు వంటి పదాల్లో పల్లెల సువాసన గుబాళిస్తుంది.

1997లో ఆరంభమైన ఈ కథా నిలయంలో (2000నాటికి) 4,000పైగా వారపత్రికలు, మాస పత్రికలు, విశేష పత్రికలు ఉన్నాయి. యువ, జ్యోతి, జాగృతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్ర పత్రిక, భారతి, జయంతి, సంవేదన, అభ్యుదయ వంటి అనేక పత్రికల అమూల్యమైన సేకరణ ఇది. 1944 నుండి భారతి పత్రిక ప్రతులు ఇక్కడ సేకరించారు. అంతకు పూర్వపు ప్రతులను కూడా సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.ఇంకా కథానిలయంలో 2,000 పైగా కథల సంపుటాలు, కథా రచనల గురించిన మరో రెండు వేల పుస్తకాలు ఉన్నాయి. 1910లో ప్రచురించిన అక్కిరాజు ఉమాకాంతం రచన త్రిలింగ కథలు ఇక్కడి సేకరణలలో అన్నింటికంటే పాతది. తెలుగు రచనలలో క్రొత్త పుంతలకు దారి తీసినవని భావించే యద్దనపూడి సులోచనారాణి, యండమూరి వీరేంద్రనాథ్ వంటి రచయితల నవలలు కూడా కొన్ని ఈ సేకరణలో ఉన్నాయి. తెలుగులో షుమారు 3,000 మంది కథా రచయితలు ఉండవచ్చునని, కాని వారిలో 600 మంది రచనలే తమ సేకరణలోకి తేగలిగామని కా.రా. అన్నాడు. కొద్దిపాటి కథలు వ్రాసిన రచయితలు తమ రచనలు అంత ప్రముఖమైనవి కాకపోవచ్చునని భావించి, తమ రచనలు పంపరు. అయితే ప్రతి కథా ఏదో ఒక దృక్పథాన్ని లేదా సమాజ స్థితిని లేదా ఘటనలను వెలికి తీస్తుందని కారా మాస్టారిభావన. 2014 సెప్టెంబర్ నాటికి వేలాది పత్రికల వివరాలు, 3000కి పైగా కథా సంపుటాలూ, సంకలనాలూ కథా నిలయం సేకరించగలిగింది. వీటితోబాటు దాదావు 1000 మంది రచయితలు తమ వివరాలను, తమ కథల నకళ్లను (దొరికిన వాటిని) అందించారు. ఇవికాక ఈ కథల కాల నేపథ్యాన్నీ సమాజ నేపథ్యాన్నీ అధ్యయనం చేసేందుకు వీలుగా ఆత్మకథలు, జీవిత కథలు, సామాజిక చరిత్రలు, ఉద్యమ చరిత్రలు కూడా సేకరించబడుతున్నాయి. ఆయా కథలు వెలు వడిన వెంబడే వచ్చిన స్పందనలు, ఆ మీదట విమర్శకుల తూనికలుసమాచార మంతా పోగుచేయటానికి కృషి జరుగుతోంది. దీనికి తోడుగా రచయితల గొంతులను, ఛాయాచిత్రాలను, జీవిత వివరాలను కూడా సేకరించి భద్రపరచాలని ఆలోచన ఉంది. కథానిలయం.కాం వెబ్ సైటుని సృష్టించి, వారు సేకరించిన కథలను స్కాన్ చేసి పాఠకులకు అందించే పని కథానిలయం ఈ సరిక ప్రారంభించినది. పరిశోధనాభిలాష ఉన్నవారికి వర్రపదమనిపించేలా ఇప్పటికే ఇక్కడ చాలామంది రచయితల కథలు లభ్యమౌతున్నాయి. 2004లో తెలుగు అకాడమీ విడుదల చేసిన తెలుగు కథాకోశం (తెలుగు కథకుల గురించిన సమగ్ర సమాచారం లభించే గ్రంథం) కూర్పులో కథానిలయం కృషి–విలువ కట్టలేనిది.ఐతే ఇంతవరకు సాధించిన ప్రగతి జరగవలసిన దానిలో పదోవంతైనా కాదు. ఒక ప్రక్క భవన నిర్మాణం మరో యాభై వేలతో పూర్తికావలసి వుంది. గత తొమ్మిది దశాబ్దాలలో వచ్చిన కథా సంపుటాలు, సంకలనాలు వేలలోనూ, పత్రికల్లో మిగిలిపోయిన కథలు లక్షలలోనూ సేకరించవలసి వున్నాయి. ఈ రెండే కాక కథా నిలయం తలపెట్టినవి మరికొన్ని కూడా వున్నాయి. ఈ పనులన్నీ ఏ కొద్దిమంది పూనికతోనే జరిగే పనులు కావు. కథానిలయం కోసం పూనుకొన్నవారు కొందరే కావచ్చు నెలకొన్న చోటు వొక్కటే కావచ్చు కాని ఈ సంస్థ తెలుగు వారందరిది, వినియోగించుకొనేవారు తెలుగు వారే కాదు – ప్రపంచ దేశాలలో ఎక్కడి వారయినా కావచ్చు. ఈ సత్యాన్ని గుర్తించి ప్రతివారు ముఖ్యంగా (తెలుగు కథకులు) తమ సహాయ సహకారాలు వెంటనే అందించవలసిందిగా అభ్యర్థన.



కథానిలయంలో వార్షికోత్సవాల సందర్భంగా శనివారం ప్రత్యేక రచనలు ఆవిష్కరించిన కారా మాస్టారు తదితరులు

కారా మాస్టారి గురించి.. తెలుగు కథా సాహిత్యం లో 1966 లో ప్రచురించిన తన యజ్ఞం కథ ద్వారా ఇంకో ప్రముఖ ఉత్తరాంధ్ర రచయిత శ్రీ కాళీపట్నం రామారావు గారు తెలుగు సాహిత్యం మీద తమ ముద్రా వేసుకున్నారు.. కారా మాస్టారుగా పిలువబడే కాళీపట్నం రామారావు 1924, నవంబరు 9 న శ్రీకాకుళంలో జన్మించారు. భీమిలిలో సెకెండరి గ్రేడ్ ట్రయినింగ్ స్కూలులో ఉపాధ్యాయ శిక్షణ పొంది. 1948 నుండి 31 ఏళ్ళు ఒకే ఎయిడెడ్ హైస్కుల్ లో ఒకేస్థాయి ఉద్యోగము. 1972లో ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగా రిటైరయ్యాడు. సరళ భాషా రచయిత, కథకుడు, విమర్శకుడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఈయన రచనా శైలి సరళంగా ఉండి సామాన్య జ్ఞానం కల పాఠకులు సైతం రచనలో లీనమయ్యేలా, భావప్రాధాన్యత గల రచనలు చేసారు . ప్రసిద్ధ నవలా రచయిత అయిన యండమూరి వీరేంద్రనాధ్ రామారావు రచనల నుండి ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించేవాడు.

ఈయన చేసిన రచనలు తక్కువైనా, అవి అత్యంత సుప్రసిద్ధమైన రచనలు. కారా కథలని 1970కి ముందు, వెనకలుగా విభజించ వచ్చు. ఎందుకంటే, అప్పట్లో దేశాన్ని కుదిపేస్తున్న నక్సల్బరీ శ్రీకాకుళ పోరాట ప్రభావానికి లోనుగాని మేధావులు, పీడిత ప్రజల పక్షపాతులు 70 లలో లేరనే చెప్పాలి. మాస్టారు కూడా ఆ ప్రభావానికి అతీతులు కారు. అందుకే ఆయన 70 తరువాత రాసిన కథల్లో వర్గ విశ్లేషణ పూసల్లో దారంలా కనిపిస్తూనే వుంటుంది.

యాభై , అరవై దశకాల్లో అయన రాసిన కథల్లో లోతయిన జీవితాన్ని పరిచయం చేశారు. ఆయన పెరిగిన వాతావరణానికి, ఆ కథల వాతావరణానికి పోలిక లేదనిపిస్తుంది. అట్టడుగు వర్గాల జీవితాన్ని అంత సునిశితంగా ఎలా పరిశిలించారా అని అబ్బురమనిపిస్తుంది. ఆ జీవిత విశ్లేషణకి మార్క్సిజం తోడయ్యాక ఆయన దృష్టి కోణం విస్తరించింది. అప్పుడు వెలువడిన కథలు ఉన్నత శిఖరాలని చేరుకున్నాయి. అగ్ర వర్ణంలో పుట్టినా దళిత జీవిత మూలాన్ని కారా అంత చక్కగా ఎలా చిత్రించగలిగారా అని ఆశ్చ ర్యం వేస్తుంది. రాగమయి లాంటి కథల్లో అచ్చం మధ్యతరగతిని చూపిస్తే, చావు కథలో దళిత జీవితాల్లోని దైన్యాన్ని చూపించారు. ముసలమ్మ దహనానికి కట్టెలు లేని పరిస్థితిని వివరిస్తూనే, ఆ కట్టెలు నిలవున్న చోటినించి వాటిని తెచ్చుకునే సాహసాన్ని కూడా ప్రదర్శింపచేశారు.

1964 లో రాసిన యజ్ఞం కథ అర్థం కావాలంటే తన అప్రజ్ఞాతం చదవాలంటారు కారా. దాదావు నలభై సంవత్సరాల కాలగమనం లో, స్వాతంత్ర్యానికి ముందు వెనుక, గ్రామాల్లో వచ్చిన మార్పుల్ని ఎంతో గాడంగా విశ్లేషించారు. కానీ ముగింపు మాత్రం కార్మికవర్గ ధృాఎష్టి నించి కాక మధ్యతరగతి ధృక్పథం నించి రాశారని మార్క్సిస్టులు విమర్శించారు.ఆరు దశాబ్దాలుగా కారా మాస్టారి కథలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. తన నిజజీవితంలో అనుభవించిన, పరిశీలించిన కష్టాలను, సంఘర్షణను ఆయన తన కథలలో ఇమిడ్చాడు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవన సమరాన్ని సునిశితంగా పరిశీలించి తన పాత్రలలో చూపాడు. 1964లో వెలువడిన 'యజ్ఞం' కథ ఫ్యూడల్ విధానంలోని దోపిడీని కళ్ళకు కట్టినట్లు చూపుతుంది. అందుకే ఆయన కథలు ఇతర భారతీయ భాషలలోకి, రష్యన్, ఇంగ్లీషు భాషలలోకి అనువదింపబడి పాఠకుల ఆదరణను చూరగొన్నాయి. రామారావు గారి కథా సాహిత్య దీక్షకు ప్రతిబింబమైన కథానిలయం విశిష్టమైన యత్నం.


కథానిలయం రెండంతస్తుల భవనం. శ్రీకాకుళం పట్టణంలో ఉంది. విశాఖ నించి నాన్–స్టాపు బస్సులో రెండు గంటల్లో వెళ్ళొచ్చు. కలకత్తా రైలు మార్గం మీద ఆమదాలవలసలో శ్రీకాకుళం రోడ్ అనే స్టేషను కూడా ఉంది. భవనంలో కింది అంతస్తు ప్రధాన పుస్తక భండాగారం. వెనక వేపు అరుదైన పుస్తకాల బీరువాలు. ఇక్కడే తెలుగు కథా త్రిమూర్తులు – గురజాడ, కొకు, రావిశాస్త్రులవి పెద్ద తైలవర్ణ చిత్రాలున్నాయి. పై అంతస్తులో ముందు ఒక వందమంది దాకా కూర్చోవటానికి వీలైన పెద్ద హాలు. ఈ హాలు గోడల నిండా అంగుళం ఖాళీ లేకుండా తెలుగు కథా రచయితల ఫొటోలు. వెనక వైపున ఒక అతిథి గది బాత్రూము సౌకర్యంతో సహా – ఎవరైనా లైబ్రరీని ఉపయోగించుకోవటానికి వస్తే రెండు మూడు రోజులు సౌకర్యంగా ఉండొచ్చు.

– సత్యగోపాల్, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా





భరత్ అనే నేను భారీ షెడ్యూల్



కొరటాల శివ దర్శకత్వంలో మహేష్‌బాబు నటిస్తున్న 'భరత్ అనే నేను' హైద్రాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుపుకుంటోంది. మహేష్‌బాబు-హీరోయిన్ కైరా అద్వానీలపై కొన్ని రొమాంటిక్ సీన్స్‌తోపాటు ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు జరిగే ఈ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ దాదాపు పూర్తవుతుంది. నాలుగయిదు రోజుల విరామం ఇచ్చి.. మహేష్‌బాబు - కైరాలపై చిత్రీకరించే సాంగ్‌తో షూటింగ్ పూర్తవుతుంది. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేసేందుకు నిర్మాత డి.వి.వి.దానయ్య సన్నాహాలు చేస్తున్నారు.

ప్రనుష్క పెళ్లి ఉన్నట్లా.. లేనట్లా?

భాగమతి కూడా విడుదలైపోయింది.. విజయవిహారం చేస్తోంది. అయినాసరే అనుష్క మరో సినిమాకి సంతకం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఇంతకుముందు వరకు సంవత్సరానికి అధమపక్షంలో అయిదారు సినిమాలు చేస్తూ వచ్చిన అనుష్క 'బాహుబలి-ది కన్‌క్లూజన్' తర్వాత నుంచి సినిమాలు చేయడం తగ్గించేసింది. దానికి ముందు ఒప్పు కొన్న సినిమాలు మాత్రమే చేసింది.

ఈ నేపథ్యంలో ప్రభాస్-అనుష్క (ప్రనుష్క)ల పెళ్లి మళ్లీ తెర మీదకొస్తోంది. 'భాగమతి' సినిమా ప్రచారం కోసం మీడియాతో పదేపదే ముచ్చటించిన అనుష్క ప్రతిసారీ ప్రభాస్‌తో తన పెళ్లి అనేది ఒట్టి పుకారు మాత్రమే అని చెప్పుకొచ్చింది. గట్టిగా ఖండించింది. అయితే అదే సందర్భంలో తనకు పిల్లలంటే చాలా ఇష్టమని ఈ అమ్మడు చెప్పుకొచ్చింది.

పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అవ్వడం వల్లే అనుష్క కొత్తగా సినిమాలు ఒప్పుకోవడం లేదని, అనుష్క మనసు దోచుకొన్న అదృష్టశాలి కచ్చితంగా బాహుబలి అయ్యుంటాడనే గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి.

అనుష్క చకచకా వేరే హీరోలతో రెండు మూడు సినిమాలకు సంతకాలు చేసేవరకు ఈ ఊహాగానాలకు తెరపడడం కష్టమేనని టాలీవుడ్ పండిట్స్ అంటున్నారు!



కైకాలను సత్కరించనున్న కళాబంధు



అసాధారణ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నా.. కన్నుల పండువగా కళాకారులకు సన్మాన కార్యక్రమాలు జపపాలన్నా అది టి.సుబ్బిరామిరెడ్డికే చెల్లింది. ఆధ్యాత్మికవేత్తగా, రాజకీయ దురంధరునిగా, నిర్మాతగా, సమాజసేవకుడిగా.. బహుముఖాలుగా తన ప్రతిభను ప్రకటించుకొనే సుబ్బిరామిరెడ్డి ఫిబ్రవరి 13, శివరాత్రి పుణ్యదినాన విశాఖ సాగర తీరాన మహా కుంభాభిషేకం నిర్వహిస్తూ.. కోటి శివ లింగాలను ప్రతిష్టించడంతోపాటు అదే రోజు సాయంత్రం ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణను ఘనంగా సన్మానించనున్నారు. నందమూరి బాలకృష్ణ ఈ వేడుకలో పాలు పంచుకోనున్నారు. ఈ విషయం తెలియజేసేందుకు టి.సుబ్బిరామిరెడ్డి పత్రికా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో మురళీమోహన్, పరుచూరి వెంకటేశ్వర్రావులతో పాటు.. టియస్సార్ గత అయిదేళ్లుగా ప్రదానం చేస్తున్న యాష్ చోప్రా నేషనల్ అవార్డ్ జ్యూరీ మెంబర్ అయిన పద్మినీ కొల్హాపూర్ పాల్గొన్నారు. ఈవారంలో ముంబయిలో ఈ వేడుక జరగనుందని, ఆశాభోస్లే ఈ ఏడాది అవార్డుకు ఎంపికయ్యారని పద్మినీ తెలిపారు. తనకు పద్మశ్రీ, డాక్టరేట్ వంటి ప్రభుత్వపరమైన అవార్డులు ఎందుకు రాలేదని అందరూ ప్రశ్నిస్తుంటారని, అవి రాలేదని తానెప్పుడూ బాధపడలేదని, కానీ ఈ ప్రశ్నలు ఎదుర్కొనే ప్రతిసారీ మనసు చివుక్కుమంటుందని కైకాల సత్యనారాయణ అన్నారు. ఎందరో కళాకారులను సత్కరించి, గౌరవిస్తున్న సుబ్బిరామిరెడ్డి ఈ పర్యాయం తనను ఎంపిక చేయడం ఎంతో ఆనందాన్నిస్తోందని అన్నారు!!



నా లైఫ్ నా ఇష్టం! మధ్యలో మీరెవరు?

రంగస్థలం షూటింగ్ ఎట్టకేలకు పూర్తయ్యిందన్న ఆనందంతోనో ఏమో పనిగట్టుకొని గోవాకెళ్లి మరీ సేద దీరుతోంది సమంత అక్కినేని. ఏకంగా బికినీ వేసుకొని అక్కడి అందాలు ఆస్వాదిస్తున్న సమంత.. తన అందాలు అందరూ ఆస్వాదించేలా బికినీలో తీయించుకొన్న ఫోటోలు పబ్లిక్‌గా షేర్ చేసింది. అయితే సమంత చేసిన పనిని అక్కినేని వంశాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. సమంత తీరును వారు తీవ్రంగా తప్పు పడుతున్నారు. కానీ సమంత మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. నా లైఫ్.. నా ఇష్టం. మధ్యలో మీరెవరు? నా లైఫ్ రూల్స్ నేను రాసుకుంటాను. మిమ్మల్ని ససేమిరా రాయనివ్వను' అంటోంది. అంతేకాదు.. ఎవరేమనుకున్నా ఐ డోంట్ కేర్' అంటోంది. అక్కినేని అభిమానులు సమంత ప్రవర్తనపై అగ్రహోదగ్రులవుతున్నారు. మహానటుడు అక్కినేని నాగేశ్వరావు కాలధర్మం చెందడం మంచిదయ్యింది. లేకపోతే..' అంటూ వారు ఆవేదన చెందుతున్నారు. పెళ్లయ్యాక సినిమాల్లో నటించడమే తప్పంటే.. ఇలా బీచ్‌ల్లో పబ్లిగ్గా బికినీల్లో తిరుగుతూ.. తగుదునమ్మా అంటూ వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం తగదు గాక తగదని వారు హితవు పలుకు తున్నారు!



మానుషి మనసెరిగేవారెవరు?

ప్రపంచ సుందరిగా ఎన్నికైన మానుషి చిల్లర్ సినిమా అవకాశాల కోసం తెగ వెంపర్లాడుతోంది. ఐశ్వర్యరాయ్, సుస్మితా సేన్, ప్రియాంక చోప్రా కోవలో తాను కూడా వెండితెరపై వెలుగులు విరజిమ్మాలని ఈ అమ్మడు ఉవ్విళ్లూరుతోంది. అందుకే హాట్ హాట్‌గా ఎప్పటికప్పుడు తన పిక్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. అవకాశాల కోసం ఆశగా ఎదురుచూస్తోంది. మరి మానుషి మనసెరిగి ఆమె అర్హతకు తగిన అవకాశాలిచ్చేందుకు దర్శకనిర్మాతలు ఎప్పుడు ముందుకొస్తారో వేచి చూడాల్సిందే!!


శర్వా సరసన..

స్వామి రారా ఫేమ్ సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్ నటించబోతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. మొదట ఈ సినిమాలో కాజల్, నిత్య మీనన్ నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిన మాట వాస్తవమే అయినప్పటికీ కొన్ని అనివార్య కారణాలవల్ల వారిద్దరు ఈ సినిమాలో నటించడం లేదని తెలుస్తోంది. ఈ సినిమాలో శర్వానంద్ సరసన 'హలో' ఫేమ్ కళ్యాణి ప్రియదర్శిని నటించబోతోంది. నిత్య మీనన్ స్థానంలో కళ్యాణి ఎంపిక అయ్యింది. మార్చి మూడో వారం నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. శర్వానంద్ ఈ సినిమాలో డాన్ పాత్రలో కనిపించబోతున్నాడు. మాఫియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కబోయే ఈ సినిమాలో నటించే మరో హీరోయిన్ వివరాలు త్వరలో తెలియనున్నాయి.





నవాబ్‌తో జవాబు చెబుతాడా?



ఇద్దరు ముగ్గురు హీరోలున్న కథలతో మణిరత్నం సిన్మా తీస్తే మ్యాగ్జిమమ్ హిట్టే. దొంగ దొంగ, దళపతి, యువ చెప్పుకుంటూ పోతే మణిరత్నం తీసిన మంచి సిన్మాలెన్నో. ఇటీవల కొన్ని ఫ్లాప్ సిన్మాలతో మణిరత్నం పేరుకు మచ్చ వచ్చినా 'నవాబ్'తో మళ్ళీ ట్రాక్‌లో వచ్చేట్టు కనిపిస్తున్నాడు. శింబు, అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి, అరుణ్ విజయ్ హీరోలుగా మణిరత్నం తీస్తున్న గ్యాంగ్‌స్టర్ సిన్మాకి తెలుగులో 'నవాబ్' టైటిల్ కన్ఫమ్ చేశారు. తమిళంలో ఈ సిన్మా టైటిల్ 'సెక్క సేవంత వానమ్'. తెలుగులో 'ఆకాశం బాగా ఎరుపెక్కింది' అని అర్థమట! అసలే నలుగురు హీరోలున్నారు. పైగా గ్యాంగ్‌స్టర్ సిన్మా. టిపికల్ మణిరత్నం స్టైల్ యాక్షన్ మూవీ ఎక్స్‌పెక్ట్ చెయ్యొచ్చు. 'చెలియా' ఫ్లాప్ తర్వాత మణిరత్నం తీస్తున్న సిన్మా ఇది. 'చెలియా' హీరోయిన్ అదితీరావ్ హైదరి ఇందులోనూ యాక్ట్ చేస్తోంది. జ్యోతిక, ఐశ్వర్యా రాజేష్ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరి నవాబ్ అనే పేరుతో రూపొందుతున్న తన తాజా చిత్రంతో 'మణిరత్నం పనైపోయిందంటూ' తనపై విరుచుకుపడుతున్న విమర్శకులకు మణిరత్నం జవాబు చెబుతారేమో వేచి చూడాలి!

నితిన్‌తో నాగశౌర్య హీరోయిన్

ఛలో చిత్రంలో నాగశౌర్య సరసన నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయమయిన రశ్మికకు తెలుగులో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండతో ఒక సినిమా చేస్తున్న ఈ కన్నడ భామ తాజాగా నితిన్‌తో జత కట్టే అవకాశం అందివుచ్చుకుందని సమాచారం.

నితిన్ హీరోగా 'శతమానం భవతి' ఫేమ్ సతీష్ వేగేశ్న దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న 'శ్రీనివాస్ కళ్యాణం'లో నందిత శ్వేత ఒక హీరోయిన్‌గా ఇప్పటికే ఎంపిక కాగా తాజాగా రష్మికను కూడా తీసుకున్నారని సమాచారం!





భూమి మీద అలగా జనమంతా గోవా వస్తున్నారు : మంత్రి

పణజీ : అందాల గోవా తీరంలో సేద తీరాలని అందరూ కోరు కుంటారు. అలా వెళ్లే ఇతర రాష్ట్రాలవారిని గోవా పట్టణ, ప్రణాళిక శాఖ మంత్రి విజయ్ సర్దేశాయ్ అలగా జనమని అభివర్ణించారు. ఉత్తరాది పర్యాటకులు గోవాను మరొక హర్యానాగా మార్చాలను కుంటున్నారని ఆయన ఆరోపించారు. గోవా బిజ్ ఫెస్ట్ సందర్భంగా సర్దేశాయ్ మాట్లాడుతూ, గోవా ఉత్తరాది పర్యాటకులపై ఆధార పడిందని, వారు తమకు ఇస్తున్నది మురికి అని చెప్పారు. వారు గోవా గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. గోవాలో హర్యానాను సృష్టించాలనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గోవాకు వస్తున్న దేశీయ పర్యాటకుల్లో చాలా మంది ఈ భూమి మీద అలగా జనమేనని ఆయన అన్నారు. రాష్ట్ర జనాభా కన్నా ఆరు రెట్ల మంది పర్యాటకులు వస్తున్నారని ఆయన తెలిపారు. వారు ఉన్నత స్థాయికి చెందినవారు కాదని మంత్రి అన్నారు. మిగతా భారతదేశం కన్నా గోవా అత్యున్నతమైనదని సర్దేశాయ్ చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న బాధ్యతారహితులైన పర్యాటకులను నియంత్రించడం కష్టమని ఆయన అన్నారు. గోవా ప్రజలు తలసరి ఆదాయం, సాంఘిక, రాజకీయ చైతన్యం, ఆరోగ్యం వంటి అనేక రంగాల్లో మిగతా దేశం కన్నా ఎంతో ఉన్నతంగా ఉన్నారని మంత్రి చెప్పారు.

సోనియా బాటలో రాహుల్

అదే స్థానం నుంచి ప్రచారం ప్రారంభం



బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం కర్నాటకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఉదయం బళ్లారి సమీపంలో విమానం దిగిన రాహుల్ అక్కడి నుంచి 'దు ఆర్ డై' పేరుతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 19 ఏళ్ల క్రితం ఆయన తల్లి సోనియా గాంధీ కూడా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కర్నాటకలోని ఇదే స్థానం నుంచి ప్రచారం ప్రారంభించారు. 1999 సాధారణ ఎన్నికల్లో బళ్లారి నుంచి పోటీ చేసిన సోనియా గాంధీ భారతీయ జనతా పార్టీ (బిజెపి) తరపున పోటీ చేసిన సుష్మా స్వరాజ్‌ను ఓడించారు. నాడు సోనియా గాంధీ విజయవంతంగా ఎస్ఎం కృష్ణ నేతృత్వంలో కర్నాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేగలిగారు కానీ, కేంద్రంలో అటల్ బిహారి వాజ్‌పేయి చేతిలో ఓటమి చవి చూశారు.

కర్నాకలో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ బళ్లారి నుంచే ప్రచారం ప్రారంభించాలని నిర్ణయించారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన సంగతి విదితమే. వచ్చే ఎన్నికల్లో కూడా రాష్టంలో ఘన విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్ కర్నాటకలో మూడు రోజుల ప్రచారంలో భాగంగా పలు దేవాలయాలు, దర్గాలు సందర్శించనున్నారు. ఆయన కొప్పాల్‌లోని హులిగమ్మ దేవాలయం, గావి సిద్ధేశ్వర మఠం సందర్శిస్తారు. అలాగే సోమవారం కలబురగిలోని ఖ్వాజా బందే నవాజ్ దర్గాకు రాహుల్ వెళ్లనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ తమ ప్రచారంలో భాగంగా రోడ్ షోలు, సభలు, సమావేశాలు, ప్రత్యేకంగా రైతులకు సంబధించి సమావేశాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

సిఎం వ్యక్తిగత కార్యదర్శి ఇంటిపై బిజెపి కార్యకర్తల దాడి



భువనేశ్వర్ : ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యక్తిగత కార్యదర్శి ఇంటిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) కార్యకర్తలు శనివారం దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐఎఎస్ అధికారి వి కార్తికేయన్ నివాసానికి దాదాపు 30 మంది బిజెపి యువ మోర్చా కార్యకర్తలు వెళ్లి విధ్వంసం సృష్టించారు. వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన అధికార పార్టీ బిజెడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు వారు ఆరోపించారు. సెక్యూరిటీ గార్డులపై వారు దాడి చేశారు. ఇంటి ఆవరణలోని ద్విచక్ర వాహనాలను, పూల కుండీలను వారు ధ్వంసం చేశారు. వారు బిజెపి జెండాలను పట్టుకుని మరీ వెళ్లారు. వారిలో నలుగురిని అరెస్టు చేశారు. అయితే, వారి చర్యను సమర్థించేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఎసిపి మానస్ గర్నాయక్ మాట్లాడుతూ, నిరసనకారుల్లో నలుగురిని అరెస్టు చేశామని, తదుపరి దర్యాప్తు సాగుతోందని తెలియజేశారు. సమాచారం అందిన వెంటనే భువనేశ్వర్- కటక్ పోలీస్ కమిషనర్ ఖురానియా, భువనేశ్వర్ డిసిపి సత్యబ్రత భోయి, భువనేశ్వర్ మేయర్ అనంత జెనా సంఘటన స్థలానికి వెళ్ళినట్లు ఆయన తెలిపారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి నివాసంపై దాడి ఘటనను ఐఎఎస్, ఓఎఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది.

పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు అధికారం ఇవ్వండి

ఎన్నికల కమిషన్



న్యూఢిల్లీ : నేరం రుజువై శిక్ష అనుభవించిన నేతలు కొత్తగా రాజకీయ పార్టీలు పెట్టకుండా చేయాలనే పిటిషన్‌కు ఎన్నికల కమిషన్ (ఇసి) మద్దతు పలికింది. కమిషన్ ఈ మేరకు సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. రాజకీయ పార్టీలను నమోదు చేసుకోవడం మాత్రమే కాదు, వాటిని జాబితా నుంచి తొలగించే అధికారం కూడా ఇవ్వాలనికోరింది. కమిషన్ శనివారం సుప్రీం కోర్టుకు ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది. రాజకీయ పార్టీలను డీరిజిస్టర్ చేసే అధికారం కావాలని ఇసి అడిగింది. ఇటువంటి విధానం ఉండడం దేశ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని ఇసి అభిప్రాయపడింది. పార్టీలను డీరిజిస్టర్ చేసే అధికారం తమకు కల్పించాలని తాము 20 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఇసి వెల్లడించింది. నేరస్థులు రాజకీయ పార్టీలను ఏర్పాటు చేయడాన్ని ఆపాలని దాఖలైన పిటిషన్‌కు ఇసి మద్దతు ఇచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లో రాజకీయ పార్టీల నమోదుకు సంబంధించిన నిబంధనలు మాత్రమే ఉన్నాయి. డీరిజిస్టర్ చేయడానికి సంబంధించిన స్పష్టమైన నిబంధన ఏదీ లేదు. న్యాయవాది, ఉద్యమకారుడు అశ్విని ఉపాధ్యాయ్ సుప్రీం కోర్టులో ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నేరస్థులు, ఎన్నికల్లో పోటీ చేయడంపై అనర్హత వేటు పడినవారు ప్రస్తుత చట్టాలను ఆసరాగా చేసుకుని రాజకీయ పార్టీలను ఎలా ఏర్పాటు చేయగలుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేలా చేయగలిగే అధికారం ఇసికి ఉండాలని కూడా పిటిషనర్ వాదించారు.

కిమ్ సోదరికి శత్రు దేశాధ్యక్షుడి పసందైన విందు



సియోల్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌కు దక్షిణ కొరియా పసందైన విందు ఇచ్చింది. కొంత కాలంగా దక్షిణ, ఉత్తర కొరియాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా దక్షిణ కొరియాకు వచ్చిన ఉత్తర కొరియా అధక్షుడు కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ సహా ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందానికి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ సియోల్‌లోని తన అధికారిక నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని ప్రపంచ దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం వీఐపీ బాక్స్‌లో కూర్చుని కిమ్ యో జోంగ్ వింటర్ ఒలింపిక్స్ వేడుకల ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. వారికి కాస్త దూరంలో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూర్చోవడం మరింత ఆసక్తి రేపింది. కాగా, ఉత్తర కొరియా అణ్వాయుధ పరీక్షల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తత నెలకొన్న సంగతి విదితమే.


మువ్వన్నెల జెండా కాంతుల్లో మెరిసిపోతున్న బుర్జ్ ఖలీఫా, దుబాయి ఫ్రేమ్స్

- యూఏఈ, అబు ధాబిలోని ప్రముఖ కట్టడాలకు త్రివర్ణ పతాకపు రంగుల విద్యుత్ కాంతులు
- విద్యుత్ కాంతులీనుతున్న అడ్నాక్ బిల్డింగ్, ఎమిరేట్స్ ప్యాలెస్, బుర్జ్ ఖలీఫా, దుబాయి ఫ్రేమ్స్
- ఎప్పుడైనా మాటల కన్నా చిత్రాలే భావాలను మరింత ఎక్కువగా వ్యక్తం చేస్తాయి : యూఏఈలో భారత్ రాయబారి నవదీప్ సూరి



దుబాయి : భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుతం పశ్చిమాసియాలోని మూడు దేశాల పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా దుబాయిలోని ప్రముఖ నిర్మాణాలు భారతదేశ జాతీయ జెండా రంగులతో విద్యుత్ కాంతులీనుతున్నాయి. ఈ విషయాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని భారత్ రాయబారి నవదీప్ సూరి తన ట్విట్టర్ ఖాతాలో తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీపర్యటన సందర్భంగా యూఏఈ, అబు ధాబిలోని అడ్నాక్ బిల్డింగ్, ఎమిరేట్స్ ప్యాలెస్, దుబాయిలోని బుర్జ్ ఖలీఫా, దుబాయి ఫ్రేమ్స్ భారతదేశ జాతీయ త్రివర్ణ పతాకం రంగులను పోలిన విధంగా విద్యుత్ వెలుగులతో నిండిపోయాయని, ఎప్పుడైనా మాటల కన్నా చిత్రాలే భావాలను మరింత ఎక్కువగా వ్యక్తం చేస్తాయి అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నసూరి ఆయా చిత్రాలను పోస్ట్ చేశారు. కాగా, జోర్డాన్ పర్యటన ముగించుకున్న మోడీ శనివారం పాలస్తీనా చేరుకున్నారు. మోడీ తొలుత పాలస్తీనా ప్రధాని రమీ హమదల్లాహ్‌తో కలిసి పాలస్తీనా నేత యాసర్ అరాఫత్ సమాధి వద్ద నివాళులు అర్పించారు.

నడిగర్ సంఘం కల్యాణ మండపంలో జరిగే తొలి పెళ్లి నాదే : విశాల్



చెన్నై : నడిగర్ (దక్షిణ భారత నటీనటుల) సంఘం కార్యదర్శి, తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విశాల్ పెళ్లిపీటలు ఎక్కనున్నాడు. ఈ మేరకు విశాల్ చెన్నై విమానాశ్రయంలో మాట్లాడుతూ, నడిగర్ సంఘం నూతన భవన నిర్మాణం వేగంగా జరుగుతోందని చెప్పాడు. డిసెంబర్ నాటికి ఈ భవన నిర్మాణం పూర్తవుతుందని, జనవరిలో ప్రారంభోత్సవం ఉంటుందని అతను ప్రకటించాడు. పనిలో పనిగా ఆ భవనంలోని కల్యాణ మండపంలో జరిగే తొలి పెళ్లి తనదేనని విశాల్ తెలిపాడు. ఈ మేరకు అడ్వాన్స్ ఇచ్చి మండపాన్ని బుక్ చేసుకున్నానని అతను తెలిపాడు. అయితే, వధువు ఎవరు అన్నది మాత్రం అతను బయట పెట్టలేదు. కాగా, శరత్ కుమార్ కుమార్తె వరలక్ష్మితో విశాల్ ప్రేమలో ఉన్నాడంటూ గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక రౌడీల బర్త్‌డే పార్టీ గురించి మాట్లాడుతూ, సినిమాల్లో అటువంటి సన్నివేశాలు సహజమని, కానీ వాస్తవంలో జరిగిందని తెలిసి ఆశ్చర్యపోయానని విశాల్ చెప్పాడు. చలనచిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న క్యూబ్, జీఎస్టీ వంటి సమస్యలపై సంఘటితంగా పోరాడాలని ఇచ్చిన పిలుపునకు తాను కట్టుబడి ఉన్నామని విశాల్ తెలిపాడు. ఈ మేరకు మార్చి 1 నుంచి సమ్మె జరుగుతుందని అతను స్పష్టం చేశాడు. ఆరోజు నుంచి సినిమాల విడుదల ఉండదని అతను చెప్పాడు. క్యూబ్ సంస్థలతో ఇప్పటికే చర్చలు జరుగుతున్నట్లు, అవి సఫలమవుతాయని ఆశిస్తున్నట్లు విశాల్ తెలిపాడు. ఇక అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో తమిళ భాష ప్రత్యేక విభాగం ఏర్పాటుకు నిధులందించాలన్న ఆలోచనలో ఉన్నామని విశాల్ తెలిపాడు.

కేరళ రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతున్న 9వ తరగతి బాలిక సెల్ఫీ వీడియో

- సీపీఎం నుంచి బీజేపీలోకి వెళ్లిన సుకుమారన్
- బెదరింపులకు దిగిన సీపీఎం స్థానిక నేతలు
- భయాందోళనతో సెల్ఫీ వీడియో పోస్టు చేసిన బాలిక



తిరువనంతపురం : కేరళలో 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక సోషల్ మీడియాలో పోస్టు చేసిన సెల్ఫీ వీడియో ఒకటి పెను కలకలం రేపుతోంది. దాని వివరాల్లోకి వెళితే, సీపీఎంకు మంచి పట్టు ఉన్న కసరగాడ్ జిల్లాకు చెందిన సుకుమారన్ అనే వ్యక్తి ఆ పార్టీని వీడి బీజేపీలోకి వలస వెళ్లారు. ఇది ఉప్పు-నిప్పులా ఉన్న బీజేపీ, సీపీఎం మధ్య కాక పుట్టించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఐదుగురు స్థానిక సీపీఎం నేతలు తన కుమార్తె అశ్విని (9వ తరగతి) ని స్కూల్ నుంచి ఇంటికి తెచ్చే సమయంలో సుకుమారన్‌ను అడ్డుకున్నారు. పార్టీలోకి తిరిగి రావాలని ఆహ్వానించారు. రాని పక్షంలో తీవ్ర ఎరిణామాలుంటాయని హెచ్చరించారు. చంపేస్తామని బెదరింపులకు కూడా దిగారు. తమను వెవరూ ఏమీ చేయలేరని, తాము ఎవరికీ భయపడే రకం కాదని వారు తెలిపారు. దీంతో బదరిపోయిన అశ్విని జరిగినదంతా వివరిస్తూ, సీపీఎం కార్యకర్తలు తన తండ్రిని చంపేస్తారని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తాను కనీసం స్కూలుకు వెళ్లాలన్నా భయపడుతున్నానని, దొడ్డి దారిన స్కూలుకు వెళ్లవలసి వస్తోందని చెబుతూ, సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పోస్టు చేసింది. దీంతో నెటిజన్లు ఆమెకు మద్దతు పలికారు. దీనిపై స్పందించిన సీపీఎం నేతలు, సుకుమారన్ ఒక సాధారణ కార్యకర్త అని, తొలుత కాంగ్రెస్, తరువాత బీజేపీలో చేరాడని తెలియజేస్తూ, అతనిని బెదరించవలసిన అవసరం తమకు ఏమి ఉందని ప్రశ్నిస్తున్నారు. సుకుమారనే పబ్లిసిటీ కోసం ఇలా చేయించి ఉంటాడని వారు అభిప్రాయపడ్డారు. బీజేపీ నేతలు దీనిపై స్పందిస్తూ, సుకుమారన్ బలమైన నేత అని, బెదరింపులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. కాగా, దీనిపై సీఎం నివేదిక కోరారు.

జైట్లీకి నిర్మల సీతారామన్ ప్రత్యేక విజ్ఞప్తి




న్యూఢిల్లీ : సైనిక కార్యకలాపాల్లో అమరులైనవారి పిల్లల చదువు కోసం ఇస్తున్న ఆర్థిక సహాయానికి విధించిన పరిమితిని తొలగించాలని రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కోరారు. గత జూలై 1న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సైనిక కార్యకలాపాల్లో అమరులైన లేదా అంగ వైకల్యం పొందినవారి పిల్లల చదువుకు నెలకు గరిష్ఠంగా రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తారు. ఈ పరిమితిని తొలగించాలని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి నిర్మల విజ్ఞప్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విధంగా పరిమితి విధించడం పట్ల త్రివిధ దళాల సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సంగతి విదితమే. సైన్యం, నావికా దళం, వాయు సేనల అధిపతులతో కూడిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ కూడా ఈ పరిమితిని తొలగించాలని రక్షణ మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. సైనిక కార్యకలాపాల్లో అమరులైన లేదా అంగ వైకల్యం పొందినవారి పిల్లలు చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేసే పథకాన్ని 1972లో ప్రారంభించారు. దీని ప్రకారం పాఠశాలలు, కళాశాలలు, ఇతర వృత్తి విద్యా సంస్థల్లో చదువు కునే ఇటు వంటి విద్యార్థినీ, విద్యార్థులు ఫీజులు చెల్లించవలసిన అవసరం ఉండదు. నిర్మల సీతారామన్ విజ్ఞప్తి మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖ అధికారి ఒకరు చెప్పారు.

కిమ్, ట్రంప్ పక్కపక్కనే...



ప్యాంగ్‌చాంగ్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంచక్కా చెట్టపట్టాలేసుకుని ఆడియన్స్‌లో కూర్చొని ఒలింపిక్ క్రీడలను సందర్శిస్తున్నారు. అదేమిటి అనుకుంటున్నారా. మరీ ఆశ్చర్యపోకండి. చూడడానికి అచ్చం కిమ్, ట్రంప్ వలె ఉన్న ఇద్దరు వ్యక్తులు దక్షిణ కొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్‌లో ఆడియన్స్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆస్ట్రేలియాకు చెందిన హోవార్డ్ ఎక్స్ అనే వ్యక్తి కిమ్ జోంగ్ మాదిరిగా, అమెరికాకు చెందిన డెన్నిస్ అలన్ అనే వ్యక్తి ట్రంప్‌లా తయారై స్టేడియానికి వచ్చారు. వారిని చూసి మీడియా వ్యక్తులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయి అంతా ఎగబడడంతో భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపు చేశారు. 'మమ్మల్ని స్టేడియం బయటకు పంపేస్తారేమోనని అనుకున్నాం. కానీ సిబ్బంది తిరిగి మమ్మల్ని మా సీట్లలో కూర్చోబెట్టారు' అని కిమ్‌ను అనుకరించిన హోవార్డ్ అనే వ్యక్తి తెలిపారు. 'మా వద్ద టిక్కెట్లు ఉన్నాయి. కాబట్టి మమ్మల్ని బయటకు పంపించలేదని అన్నారు. చాలా మంది జర్నలిస్టులు తమ వెంట పడగా భద్రతా సిబ్బంది తమను తీసుకువచ్చి సీట్లలో కూర్చోబెట్టారు' అని చెప్పారు. ఆటగాళ్లను దగ్గరగా చూసేందుకు మీడియా సెక్షన్‌కు దగ్గరగా వెళ్లామన్నారు. వారి వేషధారణతో తమకు ఎలాంటి సమస్య లేదని, కానీ వాళ్లు సాధారణ టిక్కెట్లతో మీడియా సెక్షన్ వైపు రావడంతో వారిని తీసుకువెళ్లి ఆడియన్స్‌లో కూర్చోబెట్టినట్లు అక్కడి భద్రతా సిబ్బంది తెలిపారు. వింటర్ ఒలింపిక్స్‌కు అమెరికా తరపున దేశ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, ఉత్తర కొరియా తరపున కిమ్ జోంగ్ సోదరి కిమ్ యో జోంగ్ హాజరయ్యారు. ఇటీవల ఉత్తర కొరియా అణ్వస్త్ర ప్రయోగాలు, అణు బాంబు హెచ్చరికల నేపథ్యంలో అమెరికా, ఉత్తర కొరియా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న సంగతి తెలిసిందే.

హాంగ్‌కాంగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



హాంగ్‌కాంగ్ : హాంగ్‌కాంగ్‌లోని ఒక డబుల్‌డెక్కర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో దాదాపు 18 మంది వ్యక్తులు మృతి చెందారు. దీంతో ఘటన స్థలం మొత్తం భయానకంగా మారింది. బస్సు అత్యంత వేగంగా ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వీడియో ఫుటేజీలను చూస్తే తెలుస్తోంది. ఇప్పటికే బస్సుపై అంతస్తులో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు కట్టర్లను వినియోగించవలసి వస్తోంది. మృతులు 18 మందిలో 15 మంది పురుషులు కాగా మిగిలిన వారు మహిళలు. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రదేశమంతా రక్తసిక్తమైంది. బాధిత కుటుంబాలకు 10,230 డాలర్ల నష్టపరిహారం ఇస్తామని ది కప్లూన్ మోటార్ బస్ కో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహిస్తామని సంస్థ తెలియజేసింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

ఇద్దరు జర్నలిస్టులను దేశం నుంచి వెళ్లిపొమ్మన్న మాల్దీవులు



మాలె : మాల్దీవుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఒక భారతీయ పాత్రికేయుడిని దేశం నుంచి వెళ్లిపోవలసిందిగా ఆ దేశ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత కొన్ని రోజులుగా ఆ దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం విదితమే. అతడితో పాటు భారతీయ మూలాలు ఉన్న మరొక జర్నలిస్టు ఫ్రాన్స్‌కు చెందిన మీడియా సంస్థలో పని చేస్తున్నారు. అతన్ని కూడా మాల్దీవులు విడిచివెళ్లాలని ఆదేశించింది. భారత జాతీయుడైన మణి శర్మ, భారతీయ మూలాలు ఉన్న బ్రిటన్ జాతీయుడైన అతిశ్ రావి పటేల్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులకు పోలీసులు అప్పగించారు. వారిద్దరు పర్యాటక వీసా మీద మాల్దీవులు వెళ్లారు. వలస చట్టం నిబంధనలకు విరుద్ధంగా న్యూస్ ఏజెన్సీ కోసం వార్తలు సేకరిస్తున్నారని గుర్తించి అధికారులు వారిని అరెస్ట్ చేశారు. వారి మీద ఎటువంటి న్యాయపరమైన చర్యలూ తీసుకోలేదు కానీ దేశం విడిచిపెట్టివెళ్లవలసిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడంతో రాజకీయ సంక్షోభం ఏర్పడిన విషయం విదితమే.

జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు

- జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర దాడిపై దద్దరిల్లిన అసెంబ్లీ
- పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా బిజెపి సభ్యుల నినాదాలు
- నేను ముస్లింను కనుక, ఈ నినాదాలను భరించలేకపోయా
- అందుకే, పాకిస్తాన్ జిందాబాద్ అన్నానంటూ ఎన్సీ ఎమ్మెల్యే మహహ్మద్ అక్బర్ లోనె వ్యాఖ్యలు



జమ్మూ : సంజ్‌వాన్ ప్రాంతంలోని ఆర్మీ శిబిరంపై జరిగిన ఉగ్ర దాడి సంఘటన నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ శనివారం దద్దరిల్లిపోయింది. ఈ దాడిని నిరసిస్తూ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) సభ్యులు నినాదాలు చేశారు. అయితే, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఎమ్మెల్యే మహమ్మద్ అక్బర్ లోనె మాత్రం పాక్‌కు వంత పాడారు. పాకిస్తాన్ జిందాబాద్ అని ఆయన నినాదాలు చేశారు. ఈ ఘటనపై బిజెపి సభ్యులు మండిపడ్డారు. జమ్మూ కాశ్మీర్ పరిసరాల్లో రోహింగ్యా శరణార్థులు పెరిగిపోతుండడంతోనే సంజువాన్ ఘటన చేటు చేసుకున్నట్లు స్పీకర్ కవీందర్ గుప్తా అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఆయన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఒక్కసారిగా విరుచుకు పడ్డాయి. దీనితో గందరగోళ పరిస్థితుల మధ్య సభ వాయిదా పడింది.

బిజెపి సభ్యుల నినాదాలు భరించలేకపోయా : మహమ్మద్ అక్బర్

ఈ విషయమై మహ్మమద్ అక్బర్ మీడియాతో మాట్లాడినప్పుడు, పాకిస్తాన్ జిందాబాద్ అంటూ తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. 'నేను మొదట ముస్లింను. పాకిస్తాన్ నశించాలి అని బిజెపి సభ్యులు నినాదాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేకపోయాను. భరించలేకపోయాను. నా భావోద్వేగాలను అణచుకోలేకపోయాను. అందుకే, పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశాను' అని అక్బర్ చెప్పారు. అంతే కాకుండా, ఈ విషయమై ఆయన ఒక ట్వీట్ కూడా చేశారు. 'అవును, ఆ నినాదాలు నేను చేశాను. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. సభలో నేను చేసిన ఈ నినాదాలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తాయని నేను భావించడం లేదు' అని లోనె పేర్కొనడం గమనార్హం. కాగా, జమ్మూ కాశ్మీర్‌లోని సంజ్‌వాన్ ప్రాంతంలోని ఆర్మీ శిబిరంపై శనివారం తెల్లవారు జామున ఉగ్ర దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోగా, ఆరుగురు గాయపడ్డారు. ఆర్మీ క్యాంప్ పక్కన ఉన్న సైనికుల క్వార్టర్స్ నుంచి ఉగ్రవాదులు ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.

నేడు సఫారీ ఫ్లైట్ ఎక్కనున్న రైనా



ముంబయి : సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేయనున్నాడు సురేశ్ రైనా. ప్రస్తుతం దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా వన్డే సీరీస్ ఆడుతున్న భారత జట్టు ఆ తరువారత ఆడనున్న టీ20 సీరీస్‌కు ఎంపికైన రైనా నేడు సఫారీ గడ్డపైకి చేరుకోనున్నాడు. టీ20 సీరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో అతడు చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైనా ముందుగానే దక్షిణాఫ్రికాకు చేరుకొని సాధన చేయనున్నాడు. భారత్ తరఫున రైనా చివరిసారిగా 2017 ఫిబ్రవరి 1న ఇంగ్లాండ్‌తో ఆడాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు, యో యో టెస్టు పాసవ్వకపోవడం తదితర కారణాలతో ఏడాదిపాటు జట్టులో చోటు సంపాదించలేకపోయాడు. గత ఏడాది ఆఖర్లో యో యో టెస్టు పాసైన రైనా తాజాగా దక్షిణాఫ్రికాతో టీ20 సీరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ నెల 18 నుంచి భారత్-సఫారీల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సీరీస్ ప్రారంభంకానుంది. ఈ క్రమంలో రైనా ఆదివారం భారత్ నుంచి సఫారీగడ్డకు పయనమవ్వనున్నట్లు సమాచారం.



ధావన్ దంచెన్

- ముంచేందుకు వచ్చిన వరుణుడు!
- ఉత్కంఠగా సాగుతున్న నాల్గో వన్డే

భారత్ విజయావకాశాలతో వరుణుడు దోబూచులాడుతున్నా... గెలుపే లక్ష్యంగా తమ ఆటతీరును మార్చుకుంటున్న టీమిండియా పరిస్థితులకు తగ్గట్టుగా ప్రత్యర్థితో పోరాడుతోంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్‌కు ధావన్ వీరోచిత ఇన్నింగ్స్ కారణంగా 289 పరుగులు స్కోరు చేయగలిగింది. ఈ లక్ష్యాన్ని కాపాడుకునేందుకు ప్రత్యర్థిని కట్టడి చేస్తున్న భారత్‌కు వరుణుడు అడ్డంకులు సృష్టిస్తున్నాడు. ఈ క్రమంలో రెండుసార్లు నిలిచిన మ్యాచ్‌లో కడపటి వార్తలు అందే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. ఈ క్రమంలో సౌతాఫ్రికా విజయం మరో 131 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 28 ఓవర్లు 8 వికెట్లు ఉన్నాయి.

అంతకు మందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా అదరగొట్టే ఆటతీరును ప్రదర్శించింది. ఆరంభంలో భారత బ్యాట్స్‌మెన్ దావన్ (109; 105 బంతుల్లో 11ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లీ (75; 83 బంతుల్లో 7 ఫోర్లు, సిక్సర్) చెలరేగగా... ఆఖర్లో మహేంద్రసింగ్ ధోనీ (42 నాటౌట్; 43 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్) రాణించడంతో నిర్ణీత ఓవర్లో 7 వికెట్ల నష్టానికి భారత్ 289 పరుగులు చేసింది. ధావన్, విరాట్ మరోసారి 150 పరుగులకు పైగా భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా భారీ స్కోరు చేయగలిగింది. మిడిలార్డర్‌లో రహానె (8), శ్రేయాస్ అయ్యర్ (18) విఫలమయ్యారు.

రోహిత్ మరోసారి విఫలం

దక్షిణాఫ్రికా పర్యటనలో టీమిండియా సూపర్ ఓపెనర్ రోహిత్‌శర్మ వరుసగా విఫలవుతూ వస్తున్నాడు. శనివారం నాటి నాలుగో వన్డేలో భారత్ కోల్పోయిన తొలి వికెట్ రూపంలో రోహిత్ పెవిలియన్‌కు చేరాడు. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌ల్లోనూ ఆకట్టుకోలేకపోయిన రోహిత్ సీరీస్ సొంతం చేసుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన భారత్‌కు కీలకంగా మారిన ఈ (నాల్గో) మ్యాచ్‌లోనూ చేతులెత్తేశాడు. కేవలం 5 పరుగులు (13 బంతుల్లో) మాత్రమే చేసి నిరాశపరిచాడు. గత మ్యాచ్ తరహాలోనే ఈ వన్డేలోనూ ప్రత్యర్థి జట్టులోని యువ బౌలర్ రబాడ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ ఆఖరి బంతిని రిటర్న్ క్యాచ్ ఇచ్చి అతడు వెనుదిరిగాడు.

నాలుగో వన్డేలో గబ్బర్ శతకం

దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డేలో టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ శతకంతో చెలరేగాడు. ఆరంభం నుంచి ఆతిథ్య బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ భారీ ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. ధావన్ 99 బంతుల్లో 10ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. కెరీర్‌లో 100వ వన్డే ఆడుతున్న ధావన్ అద్భుతంగా రాణిస్తూ న్యూ వాండరర్స్ స్టేడియంలో పరుగుల వరద పారిస్తున్నాడు. 100వ వన్డేలో సెంచరీ చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సైతం నెలకొల్పాడు. వన్డే కెరీర్లో అతనికిది 13వ శతకం కావడం విశేషం. దక్షిణాఫ్రికాపై అతనికి మూడో సెంచరీ. కాగా 2015 ప్రపంచకప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో ఇదే జట్టుపై చెలరేగి 137 పరుగులు సాధించాడు. ఇదే ఇప్పటి వరకు ఆ జట్టుపై గబ్బర్‌కు అత్యధిక స్కోరు. మరింత జోరు పెంచి బ్యాట్ ఝులిపించే ప్రయత్నంలో వ్యక్తిగత 109 పరుగుల వద్ద వికెట్ చేర్చాకున్నాడు.



ఆఖరు వన్డేలో ఓడిన మహిళలు


- మూడు మ్యాచ్‌ల సీరీస్ 2-1 తేడాతో భారత్ కైవసం
- చివరి వన్డే విజయంతో ఉపశమనం పొందిన సఫారీలు



పోచెఫ్‌స్ట్రూమ్ : దక్షిణాఫ్రికా మహిళలతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సీరీస్‌ను భారత మహిళల జట్టు 2-1 తేడాతో గెలుచుకుంది. మొదటి రెండు వన్డేలలోనే వరుస విజయాలు సాధించిన భారత్ నామమాత్రవు మ్యాచ్‌గా శనివారం నాడు మూడు వన్డే ఆడింది. ఈ మ్యాచ్‌లో మాత్రం ప్రత్యర్థి జట్టు చేతిలో 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్దేశించిన 241 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా బ్యాట్స్ ఉమెన్ 49.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించారు. ఆ జట్టు ఓపెనర్ వోల్వర్ట్ (59; 88 బంతుల్లో, 4 ఫోర్లు), స్టెయిన్ (30; 47 బంతుల్లో, 5 ఫోర్లు) మొదటి నుంచి నిలకడగా ఆడుతూ జట్టును విజయం దిశగా ముందుకు నడిపించారు. స్టెయిన్ అవుట్ అయిన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మరో బ్యాట్స్ ఉమెన్ ఫ్రీజ్ (90; 111 బంతుల్లో, 7 ఫోర్లు) సైతం ధాటిగా ఆడుతూ చివరి వరకూ నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఈ క్రమంలో ఫ్రీజ్‌కు మరో బ్యాట్స్ ఉమెన్ నికెర్క్ (41; 30 బంతుల్లో 5 ఫోర్లు) సహకారం లభించడంతో మరో వికెట్ పడకుండా సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ... ఈ సీరీస్‌లో జట్టుకు మొదటి విజయం అందించారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి రెండు వన్డేల్లో దూకుడుగా ఆడిన ఓపెనర్ శ్రుతి మంధాన చివరి వన్డేలో మాత్రం పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగింది. మరో ఓపెనర్ డీబీ శర్మ (79; 112 బంతుల్లో, 8 ఫోర్లు) అర్ధశతకం సాధించి నిలకడగా ఆడింది. మరో బ్యాట్స్ ఉమెన్ వీ.కృష్ణమూర్తి (56; 64 బంతుల్లో, 8 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్ ఆడినా చివరి బ్యాట్స్ ఉమెన్ సైతం తక్కువ స్కోరుకే అవుట్ కావడంతో భారత్ 240 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఇస్మాయిల్ 4 వికెట్లు పడగొట్టగా, ట్రయన్ 2 వికెట్లు పడగొట్టింది.

మ్యాచ్ మధ్యలో వరుణుడి బ్రేక్



జొహానెస్‌బర్గ్ : భారత్-దక్షిణాఫ్రికాల మధ్య శనివారం జరిగిన నాలుగో వన్డేకు వాతావరణ పరిస్థితులు అడ్డంకిగా మారాయి. భారత ఇన్నింగ్స్ 34.2 ఓవర్ వద్ద వెలుతురు లేమితో పాటు, సన్నగా చినుకులు ప్రారంభం కావడంతో అంపైర్లు మ్యాచ్‌కు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చారు. ఆ సమయంలో భారత్ 2 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి పటిష్ఠంగా ఉంది. అప్పటికే దావన్ శతకంతో (107) అదరగొట్టగా... రహానె 5 (8) పరుగులతో క్రీజులో ఉన్నారు. కెప్టెన్ కోహ్లి, (75), రోహిత్ (5) పరుగులు చేసి ఔటయ్యారు. దాదాపు గంట వర కు నిలిచిపోయిన మ్యాచ్‌ని వాతావరణం అనుకూలించడంతో ప్రారంభించారు.

భారత్ జాతీయ జెండాతో ఆఫ్రిది



న్యూఢిల్లీ : భారత్‌తో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఆఫ్రిది తన దైన శైలిలో విరుచుకుపడిన సందర్భాలు తక్కువేమీ కాదు. అయితే తన ప్రతాపం దాయాది దేశంతో మ్యాచ్ జరిగేంత వరకే అని చెబుతుంటాడు అఫ్రీదీ. కాగా నిన్నటి తరం క్రికెటర్లంతా రెండు జట్లుగా విడిపోయి స్విట్జర్లాండ్‌లో మంచుతో నిండిన పర్వతం మీద క్రికెట్ మైదానాన్ని తీర్చిదిద్ది రెండు మ్యాచ్‌లు ఆడారు. షాహిద్ ఆఫ్రిది నేతృత్వంలో రాయల్స్, వీరేంద్ర సెహ్వాగ్ సారథ్యంలో డైమండ్స్ మధ్య పోరు క్రికెట్ అభిమానులను అలరించింది. అయితే ఇరు జట్ల మధ్య మొదటి మ్యాచ్ అనంతరం ఓ ఆసక్తికర సంఘ టన చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం ఆఫ్రిదితో అభిమానులు సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఈ క్రమంలో కొందరు తమ తమ దేశ పతాకాలను చేతబట్టి ఫోటోలు దిగుతున్నారు. ఇంతలో భారత్ నుంచి మ్యాచ్‌కు హాజరైన అభిమానులు కూడా ఆఫ్రిదితో సెల్ఫీలు దిగే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయానికి వారి చేతిలో భారత్ జాతీయ జెండా ఉంది. జెండాతో ఫోటో దిగడేమోనని సంశయించిన అభిమానులు దానిని పక్కకు పెట్టారు. అయితే ఆఫ్రిదినే స్వయంగా చొరవ తీసుకొని మరీ భారత్ జాతీయ పతాకాన్ని ఎదురుగా ఉంచి ఫోటో దిగాడు. దీంతో పట్టలేనంతం ఆనందంతో భారత్ అభిమానులు ఆఫ్రిదితో ఫోటోలు దిగేందుకు ఎగబడ్డారు. ఆఫ్రిది నేతృత్వంలోని రాయల్స్ మొదటి మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో సెహ్వాగ్ సారథ్యంలోని డైమండ్స్‌పై గెలుపొందింది. నిర్ణీత 20 ఓవర్లలో సెహ్వాగ్ జట్టు 164/9 పరుగులు సాధించగా, ఆఫ్రిది జట్టు చెలరేగి ఆడి మరీ 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. ఇంగ్లాండ్ మాజీ బ్యాట్స్‌మెన్ ఒవైస్ షా 74 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లోనూ రాయల్స్ జట్టు సెహ్వాగ్ జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలిచింది.

2021లో భారత గడ్డపై చాంపియన్స్ ట్రోఫీ

- షరతులు వర్తిస్తాయని మెలిక పెట్టిన నిర్వాహకులు
- పన్ను మినహాయింపు ఇస్తేనే ఆలోచిస్తామని వ్యాఖ్య



దుబాయ్ : ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమైంది. కానీ, ఇందుకు కొన్ని అడ్డంకులు కూడా సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా మ్యాచ్‌లకు పన్ను మినహాయింవు. 2021లో భారత్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలంటే పన్ను మినహాయింవు ఇవ్వాలని కోరుతోంది ఐసీసీ. 2016లో టీ20 ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం టోర్నీ నిర్వహణకు పన్ను మినహాయింవు ఇవ్వలేదట. దీంతో ఐసీసీ నిర్వాహకులు భారత్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించడానికి మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. కాకపోతే మాకు పన్ను మినహాయింవు కావాలి అని కోరుతున్నారట. "ఎందుకంటే మాకు టోర్నీ నిర్వహించడానికి చాలా పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఇలాంటి సమయంలో పన్ను మినహాయింవు మాకు కాస్త ఊరట ఇచ్చే అంశం" అని ఐసీసీ ప్రతినిధులు తెలిపారు. దీనిపై ఇప్పటికే బీసీసీఐ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరువుతున్నట్లు సమాచారం. క్రీడలను జీవితంలో భాగం చేసుకోమని పిలువునిచ్చిన ప్రభుత్వం చాంపియన్స్ ట్రోఫీకి పన్ను మినహాయింపుపై ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి మరి.

జడేజా, అశ్విన్ రేసులోనే ఉన్నారు



జొహానెస్‌బర్గ్ : భారత స్టార్ ఆటగాళ్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ 2019లో జరగబోయే ప్రపంచకప్ రేసులో ఉన్నారని భారత జట్టు బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ స్పష్టం చేశారు. కేప్‌టౌన్‌లో మూడో వన్డేలో విజయం అనంతరం కెప్టెన్ కోహ్లి స్పిన్ ద్వయం చాహల్, కుల్‌దీప్‌పై ప్రశంసల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. దీంతో వన్డే జట్టులో అశ్విన్, జడేజా వునరాగమనంపై అభిమానుల్లో పలు అనుమానాలు లేవనెత్తాయి. తాజాగా కోచ్ భరత్ అరుణ్ దీనిపై స్పందించారు. జొహానెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో శుక్రవారం ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. అనంతరం భరత్ మాట్లాడుతూ..ప్రపంచకప్ కోసం జట్టును ఎంపిక చేసే సమయంలో అందర్నీ దృష్టిలో పెట్టుకుంటాం. ఆటగాళ్ల ప్రతిభ ఆధారంగానే జట్టు ఎంపిక జరుగుతుంది. కాబట్టి అశ్విన్, జడేజా కూడా ప్రపంచకప్ రేసులో ఉన్నట్లే. వారి కోసం తలువులు తెరిచే ఉన్నాయి. ప్రస్తుతం జట్టులో విపరీతమైన పోటీ నెలకొంది. మంచి ప్రదర్శన చేయకపోతే బెంచ్‌కే పరిమితమైపోతామని వారికి తెలుసు. అందుకే ఆటగాళ్లు పోటీని తట్టుకునేందుకు స్థాయికి మించి ప్రదర్శన చేస్తున్నారు. శ్రీలంకతో సిరీస్ సమయంలో మన ఆటగాళ్ల ప్రతిభను గుర్తించేందుకు ప్రయత్నాలు చేపట్టాం. ఇందులో విజయవంతమయ్యాం. ఎంతో మంది ప్రతిభ గల బౌలర్లు ఇప్పుడు మన వద్ద ఉన్నారు అని భరత్ వివరించారు.

వింటర్ ఒలింపిక్స్‌లోనూ చొక్కా లేకుండా పిటా



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా) : పిటా తౌఫాతౌవువా.. క్రీడాభిమానులకు ఈ పేరు గుర్తు ఉండే ఉంటుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో ఒంటి నిండా నూనె రాసుకుని.. చొక్కా లేకుండా.. నడుం చుట్టూ తమ సంప్రదా య వస్త్రం ధరించి పరేడ్‌లో పాల్గొన్నాడు కదా. అతడే. ఇప్పుడు గుర్తు వచ్చే ఉంటుంది కదా. టోంగాకు చెందిన పిటా తాజాగా మరోసారి ఇలాగే ఒలింపిక్ పరేడ్‌లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. తాజాగా దక్షిణకొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో వింటర్ ఒలింపిక్స్ జరుగుతోన్న సంగతి తెలిసిందే. భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం ఈ ఒలింపిక్స్ అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి దేశానికి చెందిన ఆటగాళ్లు జాతీయ జెండాను పట్టుకుని పరేడ్‌లో పాల్గొనడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో టోంగా దేశానికి చెందిన పిటా రియో ఒలింపిక్స్‌లో ఎలా అయితే నూనె రాసుకుని, చొక్కాలేకుండా పతాకధారిగా కనిపించాడో అచ్చు అలాగే ఈ ఒలింపిక్స్‌లోనూ పరేడ్‌లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఎముకలు కొరికే చలిలో 34 ఏళ్ల పిటా ఇలా చొక్కా లేకుండా రావడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పిటా హాట్‌టాపిక్‌గా మారిపోయాడు. రియో ఒలింపిక్స్ సమయంలో టోంగా గురించి దాదావుగా సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చర్చ జరిగింది. మాకింకా పెళ్లి కాలేదంటూ.. కొంత మంది అమ్మాయిలు సందేశాలు కూడా పంపారు. ఇప్పుడు కూడా మరోసారి పిటాను చూసి ఫిదా అయిన అమ్మాయిల నుంచి ఎన్ని ప్రస్తావనలు వస్తాయో చూద్దాం..

కోహ్లికి మామగారి కానుక



ముంబయి : టీమిండియా కెప్టెన్ కోహ్లి... బాలీవుడ్ నటి అనుష్క శర్మ వివాహం జరిగి రెండు నెలలు కావొస్తోంది. వృత్తిపరంగా ఇద్దరూ ఎంత బిజీగా ఉన్నా సామాజిక మాధ్యమాల్లో ఒకరినొకరు ఉద్దేశిస్తూ పోస్ట్‌లు పెడుతూనే ఉన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన మ్యాచ్‌లో విరాట్ సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనుష్క తన భర్త విరాట్‌ను మెచ్చుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. మరోపక్క అనుష్క నటించిన పరి టీజర్ ఇటీవలే విడుదలైంది. ఈ టీజర్ తనకూ నచ్చిందంటూ కోహ్లి ట్విటర్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు అనుష్క తండ్రి అజయ్ కుమార్ కూడా తన అల్లుడికి ఓ కానుక ఇచ్చారు. విరాట్‌కి కవితలంటే చాలా ఇష్టం. అందుకని.. ప్రముఖ రచయిత్రి తేజశ్విని దివ్యా నాయక్ రచించిన 'స్మోక్స్ అండ్ విస్కీ' అనే వుస్తకాన్ని అజయ్ విరాట్‌కి కానుకగా ఇచ్చారు. గురువారం ముంబయిలో ఈ వుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వుస్తకం ఓ కాపీని అజయ్... విరాట్‌కు పంపించారు. మ్యాచ్‌ల నిమిత్తం విరాట్ దక్షిణాఫ్రికాలో ఉండగా... అనుష్క జీరో, పరి, సూయిధాగా సినిమాల షూటింగ్‌లో బిజీగా ఉంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·